


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 12 సంచిక: 148

SUNDAY Special | ఆదివారం 18-8-2019




**వీకెనెస్ నుంచే బలం రావాలి**

నటి నీతూచంద్రతో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

– ఫ్యామిలీలో

**సాయిప్రణీత్‌కు 'అర్జున'..**

అవార్డుకు తెలుగు షట్లర్ పేరును ప్రతిపాదించిన ఎంపిక కమిటీ

– స్పోర్ట్స్‌లో



SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# సెంచరీ కొట్టేశాయ్

## 'స్వచ్ఛ దర్పణ్'లో ఆరు తెలంగాణ జిల్లాలు



- దేశవ్యాప్తంగా 700 జిల్లాల్లో 8 జిల్లాలకు ప్రథమ స్థానం
- తెలంగాణ నుంచి వరంగల్ అర్బన్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్‌కు పెద్దపీట
- కేంద్ర ప్రభుత్వ సర్వే తాజా నివేదికలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ దర్పన్ మూడో దశ సర్వేలో తెలంగాణలోని ఆరు జిల్లాలు మొదటి స్థానంలో నిలిచాయి. స్వచ్ఛ దర్పణ్ ఫేస్– 3 ర్యాంకింగ్ వివరాలను కేంద్ర తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ శనివారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా మొత్తం 700 జిల్లాల్లో ఈ సర్వే నిర్వహించారు. అందులో 8 జిల్లాలకు మొదటి ర్యాంకు దక్కింది. వీటిలో రాష్ట్రంలోని వరంగల్ అర్బన్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలతో పాటు గుజరాత్‌లోని ద్వారక, హరియాణాలోని రేవరీ జిల్లాలకు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు దక్కింది. స్వచ్ఛభారత్ అమలు తీరుపై అంచనాలకోసం కేంద్రం దశల వారీగా సర్వేలు

మిగతా 4వ పేజీలో ▶



శనివారం యాదాద్రి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# ప్లాట్ల పేరుతో కొల్లగొట్టారు!



- అక్రమాలకు అడ్డాగా హైదరాబాద్ ప్రభుత్వ ఉద్యోగుల సహకార హౌసింగ్ సొసైటీ
- విలువైన భూమికి రెక్కలు.. అనర్హులకు ప్లాట్లు
- చేతులు మారిన కోట్ల రూపాయలు
- ఆరోపణలపై సర్కారు విచారణ
- ఏసీబీ లేదా సీబీఐ దర్యాప్తునకు కలెక్టర్ సిఫారసు
- నెలలు దాటుతున్నా పట్టించుకోని సచివాలయ వర్గాలు

అది పేరుకే ప్రభుత్వ ఉద్యోగుల సహకార హౌసింగ్ సొసైటీ. కానీ ఎక్కడా సహకార స్ఫూర్తి కనిపించదు. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టవు. అనుమతులు, లే అవుట్లు గిట్టవు. సీనియారిటీ పట్టింపు అసలే లేదు. మార్గదర్శకాలను మరుగున పడేశారు. పెద్దల అండతో ఇష్టారాజ్యంగా రూ. వందల కోట్ల భూమికి రెక్కలొచ్చాయి. అడ్డగోలుగా దందాలు సాగించి అందినకాడికి దండుకున్నారు.

*– ఇదీ హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సహకార హౌసింగ్ సొసైటీ గురించి క్లుప్తంగా...*

సాక్షి, హైదరాబాద్

ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కోసం సర్కార్ కేటాయించిన భూమిని తమకు తోచినట్లు, నచ్చినట్లు పందేరాలు చేసిన భూ కుంభకోణం బట్టబయలైంది. ఈ కేసును ఏకంగా సీబీఐ లేదా ఏసీబీకి అప్పగించి దర్యాప్తు జరిపించాలని, దీని వెనుక పెద్ద తలల బాగోతం బయటపెట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఇప్పుడు సొసైటీ పాలకమండలి సభ్యుల గుండెల్లో రైళ్లు పరుగులెత్తిస్తోంది.

**అంతా మా ఇష్టం!**

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కోసం గండిపేట మండలం

మిగతా 2వ పేజీలో ▶

# చెప్పిందేంటి.. చేస్తుందేంటి?

## ఐదేళ్లయినా పనులు పూర్తవుతాయా?.. యాదాద్రి ఆలయ పనుల జాప్యంపై కేసీఆర్ ఫైర్

> ప్రధాన ఆలయం పనుల్లో సింహభాగం పూర్తయింది. కొద్దిపాటి పనులు మాత్రమే మిగిలాయి. వాటి పట్ల నిర్లక్ష్యం వహించొద్దు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి. టెంపుల్ సిటీలో 250 కాటేజీలు నిర్మించాలి. ఇందుకోసం దాదాపు రూ. 400 కోట్ల విరాళాలు ఇవ్వడానికి వివిధ కార్పొరేట్ సంస్థలు, దాతలు సిద్ధంగా ఉన్నారు. వెంటనే కాటేజీల డిజైన్లు రూపొందించి నిర్మాణం ప్రారంభించాలి. భూసేకరణ త్వరగా పూర్తి చేసి ప్రధాన రహదారులన్నీ వెడల్పుగా నిర్మించాలి. చెరువు కింది భాగంలో పురుషులు, మహిళలకు వేరువేరుగా కళ్యాణ కట్టలు, నీటి కొలనులు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి.
>
> *– కేసీఆర్*

- ఫిబ్రవరిలో యాగం చేద్దామనుకున్నా
- ఇక్కడ చూస్తే ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయ్
- కావాల్సిన నిధులిస్తా.. వెంటనే పనులు పూర్తి కావాలి
- మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి
- అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టీకరణ
- రెండున్నర గంటలపాటు నిర్మాణ పనుల పరిశీలన
- అధికారులతో ఐదు గంటలపాటు సమీక్ష
- ఇప్పటివరకు పనుల కోసం 692 కోట్ల వ్యయం
- పనులు జాప్యం చేసిన ఆర్అండ్‌బీ ఈఈపై వేటు

సాక్షి, యాదాద్రి/హైదరాబాద్

''ఫిబ్రవరిలో యాగం చేద్దామనుకున్నా.. అందరినీ పిలిచి దేవుడికి దండం పెడదాం అనుకున్నా.. పనులు ఇలా జరిగితే ఎలా? ఇంకా ఐదేళ్లు పడతాయా ఈ పనులు జరగడానికి? మీకైనా ఉండాలి.. నాకైనా ఉండాలి.. ఇలా ఎన్నిసార్లు మాటలు చెబుతారు? గర్భాలయ పనులతో పాటు మిగతా పనులన్నీ సమాంతరంగా పూర్తి చేయాలని గత ఫిబ్రవరిలో వచ్చినప్పుడు చెప్పాను. కానీ, ఇక్కడ జరుగుతున్న పనులు చూస్తే ఎక్కడివి అక్కడే ఉన్నాయి''అని యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనుల జాప్యంపై సీఎం కేసీఆర్ మండిపడ్డారు. శనివారం ఆయన ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పరిశీలించారు. రాయగిరి–యాదగిరిగుట్ట రోడ్డు విస్తరణ పనులతోపాటు గండి చెరువు, రింగ్‌రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్, ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న పచ్చదనాన్ని పరిశీలించి యాదాద్రి కొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన ఆలయం పనులను పరిశీలించారు. దాదాపు రెండున్నర గంటలపాటు మండు టెండను సైతం లెక్కచేయకుండా ఆలయ ప్రాంగణమంతా కలియదిరిగారు. ప్రతి నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భాలయం పనుల్లో వచ్చిన పగుళ్లను గుర్తించి.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులు చేయడంలో ఆలస్యం ఎందుకు

మిగతా 2వ పేజీలో ▶

# తహసీల్దార్ల అధికారాలకు కత్తెర!

- మ్యుటేషన్ జారీ అధికారం జేసీలకు..
- రికార్డుల మార్పులు, చేర్పులు కూడా వారి చేతుల్లోనే..
- కొత్త రెవెన్యూ చట్టంపై ప్రభుత్వం కసరత్తు
- వచ్చే నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం



**'రెవెన్యూ' మార్పు ఇలా ఉండొచ్చు**

- తహసీల్దార్ల అధికారాలను కుదిస్తారు. 'రెవెన్యూ'లోని 124 చట్టాలకు మంగళం పాడి ఒకే గొడుగు కిందకు పలు చట్టాలు తీసుకొస్తారు. జేసీ లేదా ఆర్డీవోకు మ్యుటేషన్ అధికారాలు ఇస్తారు. వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు లేదా పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖలో విలీనం చేస్తారు. 'టైటిల్ గ్యారంటీ'చట్టాన్ని అమల్లోకి తెస్తారు.

3లో






# సడలుతున్న ఆంక్షలు



కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. జమ్మూ, కశ్మీర్ లోయలో ప్రజల రాకపోకలపై విధించిన ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం శనివారం పాక్షికంగా సడలించింది. దీంతో కశ్మీరీలు తమ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. – 5లో

# పాక్ పరువు పోయింది



పాకిస్తాన్‌కు అంతర్జాతీయంగా భంగపాటు ఎదురైంది. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేయడంపై ఐరాస భద్రతా మండలికి చెందిన 15 దేశాల రహస్య భేటీ ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. – 5లో

# భూటాన్ విశ్వసనీయ దేశం



భూటాన్ భారత్‌కు ఎప్పుడూ విశ్వసనీయ పొరుగు దేశమేనని ప్రధాని మోదీ చెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మోదీ శనివారం భూటాన్ చేరుకున్నారు. ఆ దేశ ప్రధాని లోటే షెరింగ్‌తో కలిసి మోదీ ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని విస్తరించే దిశగా చర్చలు కొనసాగించారు. – 5లో

**ఇదంజగత్**



మీ ఇల్లు కరకట్ట మీద ఉండటం తప్పిదం కాదటసార్! ఆ... వరదలే తప్పిదమట!




రేపు WORLD PHOTOGRAPHY DAY

# స్మైల్ ప్లీజ్...

**ఫొటో.. మాటలకందని ఓ దృశ్య కావ్యం.. ప్రేమగా లాలిస్తుంది.. హాయిగా నవ్విస్తుంది.. కోపంగా కసురు కుంటుంది.. కంటతడి కూడా పెట్టిస్తుంది..**

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జాక్వేస్ మాండే డాగ్వేర్ 1837లోనే తొలిసారి డాగ్వేరియన్ ఫొటోగ్రఫీ విధానానికి రూపకల్పన చేశారు. రెండేళ్ల తర్వాత 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఈ విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. వందేళ్ల తర్వాత ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం డాగ్వేర్ ఫొటోగ్రఫీ పేటెంట్లను కొనుగోలు చేసింది. ప్రజలందరికీ ఈ విధానం ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు గుర్తుగా 2010 నుంచి ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. అప్పట్లో ఫొటోలు తీసేందుకు రాగి, వేడిని ఉపయోగించేవారు.

**లూయిస్ జాక్వేస్ మాండే డాగ్వేర్ ఈ ఫొటో తీశారు. 1838లో పారిస్‌లోని బౌలేవార్డ్ డ్యు టెంపుల్ స్ట్రీట్‌లో తీశారు. దూరం నుంచి తీయడం వల్ల మసకగా కనిపిస్తున్నా.. బాగా గమనిస్తే.. ఓ వ్యక్తి తన బూట్లను పాలిష్ చేయించుకుంటున్న దృశ్యం ఫొటో కింద ఎడమవైపు కనిపిస్తుంది.**



## క్లుప్తంగా...

### సీసీఎంబీ శాస్త్రవేత్తకు జేసీ బోస్ ఫెలోషిప్

**సాక్షి, హైదరాబాద్:** జనాభా, వైద్యపరమైన జన్యుశాస్త్ర రంగాల్లో చేస్తున్న పరిశోధనలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీకి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.తంగరాజ్‌ను ప్రతిష్టాత్మక జేసీ బోస్ ఫెలోషిప్‌కు ఎంపిక చేసింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన విభాగపు సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బోర్డు అందించే ఈ ఫెలోషిప్ కింద తమ తమ రంగాల్లో పరిశోధనలను విస్తృతం చేసేందుకు రూ.15 లక్షల గ్రాంట్ లభిస్తుంది. దీంతోపాటు ప్రోత్సాహకంగా నెలకు రూ.25 వేలు చొప్పున ఐదేళ్లపాటు అందిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ తంగరాజ్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పాతికేళ్లుగా తాను కృషి చేస్తున్న రంగాల్లో మరింత లోతైన అధ్యయనం చేసేందుకు ఈ ఫెలోషిప్ ఉపయోగపడుతుందని చెప్పారు. వేల ఏళ్ల క్రితం భారత్‌పై ఆర్యులు దండెత్తారన్న అంశంపై తంగరాజ్ గతంలో పరిశోధనలు చేశారు. ఆర్యుల దండయాత్ర లేనేలేదని.. భారత ప్రజల జన్యుక్రమాల్లో విదేశీయుల ఆనవాళ్లు లేవని తేల్చి చెప్పారు.

### పర్యాటక శాఖ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ అవార్డులను అందజేయాలని నిర్ణయించింది. వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ఈ అవార్డులను అందించనున్నట్లు తెలిపింది. వీటికి సంబంధించి వచ్చేనెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందులో ట్రావెల్ ఏజెంట్లు, క్లాసిఫైడ్ హోటల్స్, రెస్టారెంట్స్, ఇండిపెండెంట్ హోటల్స్ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఈ అవార్డులను అందించనుంది. ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్/పబ్లికేషన్, బెస్ట్ ఫిల్మ్ఆన్ తెలంగాణ టూరిజం/హెరిటేజ్, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, బెస్ట్ రెస్టారెంట్లు, బెస్ట్ టూరిజం గైడ్, బెస్ట్ రూరల్ టూరిజం ప్రాజెక్టు తదితర విభాగాల్లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టూరిజం కమిషనర్ కార్యాలయం లేదా, **www.telangana tourism.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

### ఏఏఐ బృందం పర్యటన షెడ్యూలు ఖరారు

**22 నుంచి ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల పరిశీలన**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలోని ఆరు విమానాశ్రయాల అభివృద్ధికి సంబంధించి సాధ్యాసాధ్యాలను మదింపు చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం ఈ నెల 22 నుంచి రాష్ట్రంలో పర్యటించనుంది. ఇదివరకే వరంగల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ విమానాశ్రయాలను సందర్శించిన ఏఏఐ బృందం అవసరమైతే మరోమారు ఆయా ప్రాంతాలను సందర్శిస్తుంది. అయితే తాజా షెడ్యూలు ప్రకారం ఈ నెల 20న ఢిల్లీ నుంచి నాగపూర్‌కు చేరుకునే అధికారుల బృందం.. 21న ఆదిలాబాద్ మీదుగా జక్రాన్‌పల్లి (నిజామాబాద్)కు చేరుకుంటుంది. 22న జక్రాన్‌పల్లి నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌పూర్‌కు చేరుకుని ప్రతిపాదిత విమానాశ్రయం విస్తరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుంది. అదే రోజు సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకుంటుంది. 23న అవసరమయ్యే పక్షంలో మహబూబ్‌నగర్‌లోని అడ్డాకుల ప్రాంతాన్ని కూడా సందర్శించి.. తిరిగి ఢిల్లీకి పయనమై వెళ్తుంది.

### నకిలీ ఉద్యోగ ప్రకటనలతో... జాగ్రత్త!

**ఎస్‌సీసీఎల్‌లో 88,585 జాబ్స్ కూడా ఇలాంటివే**

**సాక్షి, హైదరాబాద్:** నకిలీ విత్తనాలు, నకిలీ మందులు, నకిలీ పరికరాలే కాదండోయ్! నకిలీ ఉద్యోగ ప్రకటనలు సైతం ఇచ్చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఇందుకు సౌత్ సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఎస్‌సీఎల్)లో 88,585 ఉద్యోగాలంటూ వెలువడిన నకిలీ ప్రకటన తాజా ఉదాహరణ. ఇది నిజమైనదా, కాదా అని గుర్తుపట్టలేనంత చాకచక్యంగా తీర్చిదిద్దారు. ప్రకటన నంబరుతోసహా నకిలీ వెబ్‌సైట్ పేరునూ ఇచ్చేశారు. ఇంకేముంది! కొన్ని ప్రముఖ మీడియా సంస్థలకు చెందిన వెబ్‌సైట్లు సైతం దీన్ని ప్రముఖంగా ప్రచురించేశాయి. తీరా చూస్తే ఇది నకిలీ ప్రకటన అంటూ.. కోల్ ఇండియా లిమిటెడ్ శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. సౌత్ సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) పేరుతో 88,585 ఉద్యోగాల భర్తీ కోసమంటూ ఇచ్చిన నోటిఫికేషన్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది.

# చెప్పిందేంటి.. చేస్తుందేంటి?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోందని ప్రశ్నించారు. గర్భాలయం తెరిచేటప్పుడు, మూసేటప్పుడు అడ్డుగా ఉన్న గుండు ఎందుకు సరి చేయలేకపోయారని నిలదీశారు. యాదాద్రి ప్రధాన ఆలయం, శిల్పి పనులు మినహా మిగతా పనులన్నింటినీ ఎందుకు పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. కావాల్సిన నిధులు విడుదల చేస్తానని, నెలరోజుల్లో పనులన్నింటినీ పూర్తిచేయాలని స్పష్టంచేశారు. వెంటనే రూ.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 15 రోజుల్లో రూ.470 కోట్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం చేస్తూ కిందిస్థాయి ఉద్యోగులను వేధిస్తున్న ఆర్అండ్‌బీ ఈఈ వసంత నాయక్‌పై వేటు వేసి.. ఆయన స్థానంలో ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్‌ను డిప్యుటేషన్‌లో వైటీడీఏ విధుల్లో చేరాలని ఆదేశించారు.

### డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి...

ప్రధాన ఆలయంతోపాటు మిగతా పనులన్నీ డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయంలో ఎక్కడెక్కడ విద్యుత్ దీపాలు వస్తాయి, ఏసీలు ఎక్కడ వస్తాయి, కిటికీలు ఎక్కడ వస్తాయనే అంశాలపై ఆర్కిటెక్టు ఆనందసాయితో చర్చించారు. ప్రధాన ఆలయంలో లక్ష్మీదేవి ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసేలా పనులు చేయాలని చెప్పారు. రిటైనింగ్ వాల్ పనులపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నిర్మిస్తున్న వర్షం నీటి కాల్వను తగ్గించాలని ఆదేశించారు. సప్త రాజగోపురాలు, అష్టభుజి మండపాలు, కల్యాణ మండపం, క్యూ లైన్లు, ప్రసాద కౌంటర్లు, ధ్వజస్తంభం, ఆళ్వారు స్వాముల విగ్రహాలు, గర్భగుడి ప్రాంతం, శయన మందిరం, అంతఃప్రాకారాలు, హుండీ లెక్కింపు ప్రాంతం, శ్రీస్వామివారి పుష్కరిణి, శివాలయం, తెప్పోత్సవం నిర్వహించే తదితర నిర్మాణాలను పరిశీలించారు. ప్రధానాలయ మాడ వీధుల నిర్మాణంలోనూ, గుడి అంతర్గత పనుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన ఆలయంలో ఉన్న ఎత్తయిన దిమ్మెను తొలగించాలని సూచించారు.

### యాగస్థల పరిశీలన...

ఫిబ్రవరిలో నిర్వహించనున్న మహా సుదర్శన నారసింహ యాగం స్థలిని సీఎం పరిశీలించారు. గండి చెరువు నుంచి యాదగిరిపల్లి వరకు వాహనంలో తిరుగుతూ చూశారు. కొద్దిసేపు కాన్వాయ్‌ను నిలిపి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే జరుగుతున్న ప్రెసిడెన్షియల్ సూట్‌ల నిర్మాణం పనులను పరిశీలించారు. రింగురోడ్డు, గిరిప్రదక్షిణ పనుల పురోగతిని తెలుసుకుని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### శివాలయంలో రామాలయమా?

శివాలయంలో రామాలయం నిర్మాణం ఏమిటని సీఎం అధికారులను ప్రశ్నించారు. గతంలో రామాలయం ఎక్కడ ఉందని అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తిని అడగగా.. ప్రధాన ఆలయం పక్కనే ఉండేదని ఆయన వివరించారు. దీంతో యథాస్థానంలో రామాలయం నిర్మించాలని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా వాస్తు, ఆర్కిటెక్ట్‌లకు చీవాట్లు పెట్టారు. శివాలయానికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, ప్రసాద మండపాలకు మధ్యలో ఖాళీ స్థలంలో ఎగుడు, దిగుడు లేకుండా సమాంతరంగా స్లాబ్ వేయాలని, మెట్లు నిర్మించాలని ఆదేశించారు. సుమారు రెండున్నర గంటల పాటు కొండపైన జరుగుతున్న పనులన్నింటినీ కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. పలుచోట్ల అవసరమైన సలహాలు, సూచనలు చేశారు.

### ప్రత్యేక ప్రారంభోత్సవం ఉండదు

యాదాద్రి ప్రధాన దేవాలయం పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను రెండు, మూడు నెలల్లో పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రధాన దేవాలయం పనుల కోసం ఇప్పటివరకు రూ.235 కోట్లు ఖర్చు చేశామని.. భూ సేకరణ, రహదారుల నిర్మాణం, దేవస్థాన నిర్వహణ తదితర ఖర్చులన్నీ కలిపి రూ.692 కోట్లు వ్యయమైనట్లు వెల్లడించారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కొత్తగా నిర్మిస్తోంది కాదు కాబట్టి, ప్రారంభోత్సవం ఉండబోదని స్పష్టం చేశారు. ఆలయ పనుల పరిశీలన తర్వాత కేసీఆర్ అధికారులతో దాదాపు 5 గంటలపాటు సమీక్ష నిర్వహించారు. 'ప్రధాన ఆలయం పనుల్లో సింహభాగం పూర్తయింది. కొద్దిపాటి పనులు మాత్రమే మిగిలాయి. వాటి పట్ల నిర్లక్ష్యం వహించొద్దు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి. ఇకపై ఆర్అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రతివారం యాదాద్రిలో పర్యటించి పనుల పురోగతిని నేరుగా పర్యవేక్షిస్తారు. ప్రధాన ఆలయం పనులతోపాటు రింగురోడ్డు నిర్మాణం, ప్రెసిడెన్షియల్ సూట్స్, కాటేజీలు, విద్యుత్ సబ్–స్టేషన్ తదితర పనులన్నీ రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలి. టెంపుల్ సిటీలో 250 కాటేజీలు నిర్మించాలి. ఇందుకు రూ.400 కోట్ల విరాళాలు ఇవ్వడానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు సిద్ధంగా ఉన్నారు. భూసేకరణ త్వరగా పూర్తి చేసి ప్రధాన రహదారులన్నీ వెడల్పుగా నిర్మించాలి' అని సీఎం ఆదేశించారు. ప్రధాన ఆలయం ఉన్న గుట్ట కింది భాగంలో గండి చెరువును తెప్పోత్సవం నిర్వహించేందుకు వీలుగా తీర్చిదిద్దాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఈ చెరువును నింపడానికి అనువుగా కాలువ నిర్మించాలని పేర్కొన్నారు. ''చెరువు కింది భాగంలో పురుషులు, మహిళలకు వేరువేరుగా కల్యాణ కట్టలు, నీటి కొలనులు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. గుట్ట కింది భాగంలోనే బస్టాండు, ఆటో స్టాండు, పార్కింగ్, ఫైర్ స్టేషన్, పోలీస్ ఔట్ పోస్టు, అన్నదాన సత్రాలు ఏర్పాటు చేయాలి. మైసూరు బృందావన్ గార్డెన్ లాగా తీర్చిదిద్దబోతున్న బస్వాపూర్ చెరువు ప్రాంతంలో అధునాతన హరిత రెస్టారెంట్, కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. పునరుద్ధరణ పనులు పూర్తయిన తరువాత బస్సుల ద్వారా భక్తులను గుట్ట పైకి చేర్చాలి. ఇందుకోసం గుట్టపైన బస్ బే నిర్మించాలి' అని సూచించారు.



శనివారం యాదాద్రిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

### స్వామివారికి ప్రత్యేక పూజలు

అంతకుముందు యాదాద్రికి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. బాలా ఆలయంలోని ప్రతిష్ట మూర్తులకు సుమారు 10 నిమిషాల పాటు సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు నిర్వహించారు. అర్చకులు సీఎం కేసీఆర్‌కు వేద ఆశీర్వచనం చేశారు. సీఎం వెంట మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు, యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ అనితా రాంచంద్రన్, ఆలయ ఈవో గీత, ఆలయ శిల్పి ఆనంద్ సాయి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారుడు సుధాకర్ తేజ, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్రావు, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



యాదాద్రి మహా మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద పూజలు నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు నృసింహస్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ గీతారెడ్డి. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సంతోశ్ కుమార్, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే సునీత తదితరులు

# ప్లాట్ల పేరుతో కొల్లగొట్టారు!

▶ మొదటి పేజీ తరువాయి

మణికొండ జాగీర్ పరిధిలోని సర్వే నంబర్లు 203/పీ, 204, 205, 208, 209లలో 50 ఎకరాలను ప్రభుత్వం 2003లో హైదరాబాద్ ప్రభుత్వ ఉద్యోగుల సహకార హౌసింగ్ సొసైటీ (టీఎన్జీవోస్)కు కేటాయించింది. అయితే ఈ సొసైటీ ఇళ్ల స్థలాల కేటాయింపు ఆది నుంచి వివాదాస్పదంగానే మారింది. నిబంధనల ప్రకారం నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు మాత్రమే మెంబర్‌షిప్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఇవేమీ పట్టించుకోని పాలక కమిటీ... అడ్డగోలుగా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి. నచ్చిన, మెచ్చిన వారిని సభ్యులుగా చేర్చుకొని స్థలాలు కేటాయించారని, ఇందులో గెజిటెడ్ హోదా కలిగిన వారికి కూడా స్థలాలను ధారాదత్తం చేశారన్న ఆరోపణలు మొదటి నుంచీ వినిపిస్తున్నాయి. సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకపోగా విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగులకు కేటాయించిన స్థలాలను రద్దు చేసి మరొకరికి కేటాయించిన దాఖలాలున్నాయి. ఇవేగాకుండా తమ కనుసన్నల్లో పనిచేసిన వారికి.. ఆమ్యామ్యా ముట్టజెప్పిన వారికి మాత్రమే ప్లాట్లు దక్కాయి. సభ్యుల నుంచి రూ. నాలుగేసి లక్షల వరకు వసూలు చేయడం ద్వారా రూ. 20 కోట్ల మేర అనధికారికంగా రాబట్టినట్లు తేలింది. సొసైటీ అక్రమాల నిగ్గు తేల్చేందుకు వచ్చిన అధికారులకు కూడా స్థలాలను కట్టబెట్టడం విస్మయపరుస్తోంది. కాగా, త్వరలో సొసైటీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సొసైటీ సభ్యుల మధ్య విభేదాలు పొడచూపాయి. ఆధిపత్య పోరులో అనర్హుల పేరిట 168 మంది ఓట్లను తొలగించారు.

### 8 నెలలైనా చర్యలు శూన్యం...

సీబీఐ లేదా ఏసీబీతో దర్యాప్తు చేయించాలని ఏకంగా జిల్లా కలెక్టర్ లేఖ రాసి 8 నెలలైనా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఈ భూ బాగోతం వెనుక పెద్దల హస్తం ఉందని నివేదికలో పేర్కొన్నా విచారణ ముందుకు సాగక పోవడానికి గతంలో ఉద్యోగ సంఘాల్లో కీలకపాత్ర పోషించి సచివాలయంలో చక్రం తిప్పుతున్న ఓ అధికారే కారణమనే ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ కలెక్టర్లు, మాజీ, ప్రస్తుత జిల్లా కలెక్టర్లే కాకుండా ఉద్యోగ సంఘ నేతలు, ప్రభుత్వ పెద్దలకు కూడా ఇందులో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో నివేదిక బుట్టదాఖలవుతోందనే విమర్శలున్నాయి.

### ఎప్పుడు ఏం జరిగిందంటే...

- ఈ సొసైటీకి ప్రభుత్వం 2003లో 50 ఎకరాలను కేటాయించగా అప్పటి నుంచి ఆరేళ్లపాటు సభ్యులకు ప్లాట్ల కేటాయింపు జరిగింది.
- సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సొసైటీ తాజా పరిస్థితిని వివరిస్తూ నివేదిక ఇవ్వాలని 2016లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అప్పటి జిల్లా సహకార అధికారిని విచారణాధికారిగా నియమించింది.
- ఆరు నెలలకు కూడా ఎలాంటి నివేదిక రాకపోవడంతో 19 కాలమ్‌ల ఫార్మాట్‌లో వివరాలు సమర్పించాలని లేదా భూ కేటాయింపు రద్దు చేస్తామని నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు డీసీఓ పంపిన ఫార్మాట్‌లో రికార్డుల్లేవని సర్‌చార్జి కేసులో సికింద్రాబాద్ డివిజనల్ సహకార అధికారి అధీనంలో రికార్డులు ఉన్నాయని సొసైటీ అధ్యక్షుడు వివరణ ఇచ్చారు.
- ఆ తర్వాత పలుమార్లు వివరాలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించినా సొసైటీ నుంచి స్పందన రాలేదు. మూడు రోజుల్లో వివరాలు ఇవ్వకుంటే కేటాయింపు రద్దు చేస్తామని హెచ్చరించడంతో 2017 డిసెంబర్‌లో పాలకమండలి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశం మినిట్స్ ఆధారంగా ఐదు అంశాలతో నివేదిక తయారు చేయాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సొసైటీ అక్రమాలు వెలుగు చూశాయి. దీనిపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ నివేదిక ఆధారంగా కలెక్టర్ సీబీఐ విచారణకు సిఫారసు చేశారు.
- హెచ్ఎండీఏ జారీ చేసిన లే అవుట్‌కు విరుద్ధంగా అదనంగా 22 ప్లాట్లను (బై నంబర్) సృష్టించారు. ఒక స్థలాన్ని ఇరువురికి కేటాయించడం ద్వారా 23 మంది సభ్యులకు వివాదం సృష్టించారు. 81 మంది అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఇటీవల సహకారశాఖ కమిషనర్ వీరబ్రహ్మయ్య విచారణలో తేలింది.
- ఇందులో టీఎన్జీఓలు కానీ ఏసీబీ, పోలీసు విభాగాలకు చెందిన 22 మందికి ప్లాట్లు కేటాయించారు. సొసైటీ అక్రమాలను నిగ్గు తేల్చేందుకు నియమించిన విచారణాధికారులకు కూడా ప్లాట్లు ఇవ్వడం, అనుమతుల్లేకుండా ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం కల్పించిన పంచాయతీ కార్యదర్శికి స్థలం కేటాయించడం గమనార్హం.

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తుది నివేదికలో పేర్కొన్న అంశాలివి...

'సొసైటీ ద్వారా స్థలాల కేటాయింపులో రూ. కోట్ల మేర ప్రజాధనం దుర్వినియోగం జరిగింది. అనర్హులకు సీనియారిటీని విస్మరించి ప్లాట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించి ప్రాథమిక రికార్డులు కూడా నిర్వహించలేదు. ఇందుకు సొసైటీ మేనేజింగ్ కమిటీయే కారణం. పాలక మండలి పెద్ద ఎత్తున నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు ప్రభుత్వ మార్గదర్శకాలు పట్టించుకోకుండా వ్యవహరించింది. ఈ అక్రమాల వెనుక బడా బాబుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. కమిటీకి వారి నుంచి ఉన్న అండదండల కారణంగా అక్రమాలకు పాల్పడ్డారని అర్థమవుతోంది. సొసైటీ ద్వారా స్థలాల కేటాయింపు వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని కేసును ఏసీబీ లేదా సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలి. కమిటీ సభ్యులతోపాటు ఎలాంటి టైటిల్ డీడ్స్ లేకుండా అక్రమంగా భవన అనుమతులిచ్చిన గ్రామ పంచాయతీపై కూడా చర్యలు తీసుకోవాలి. అనర్హులకు అక్రమంగా కేటాయించిన ఇళ్ల స్థలాలను రద్దు చేయాలి.'

### అక్రమాల పుట్ట.. సొసైటీ చిట్టా

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నివేదికలో పేర్కొన్న ప్రకారం సొసైటీకి భూమిని అప్పగించిన అనంతరం ఆ సొసైటీ భూ బదలాయింపు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం ద్వారా ఆ భూమి సొసైటీ పేర బదలాయింపు జరగాలి. ఆ తర్వాత సొసైటీ లే అవుట్ ప్లాన్ తయారు చేసి హెచ్ఎండీఏ అనుమతి తీసుకున్నాకే అర్హులైన ఉద్యోగులకు ప్లాట్లను కేటాయించాల్సి ఉంది. కానీ కనీసం బదలాయింపు ప్రతిపాదనలు కోరకుండా హెచ్ఎండీఏ అనుమతులు తీసుకోకుండా తాత్కాలిక ప్రాతిపదిక పేరుతో 2004 నుంచే స్థలాల కేటాయింపు ప్రారంభించారు. ప్లాట్ల కేటాయింపు కూడా అడ్డగోలుగా జరిగింది. సభ్యుల సీనియారిటీని పట్టించుకోకుండా అర్హులకు ఆర్థిక నష్టం కలిగిస్తూ ఇష్టారీతిన కేటాయింపు జరిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులే ఈ సొసైటీలో ప్లాట్లు పొందేందుకు అర్హులుకాగా... ప్రభుత్వ నిబంధనలు, సొసైటీ మార్గదర్శకాలను ఉల్లంఘించి అర్హతలేని అనేక మందికి ప్లాట్లను కట్టబెట్టారు. ఈ హౌసింగ్ సొసైటీ ఆవిర్భావ స్ఫూర్తి అయిన ఎన్జీఓలకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని పక్కదోవపట్టిస్తూ 2008 నవంబర్ 8న ఏకంగా సొసైటీ నియమావళినే మార్చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగిగా ఉండి రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న సుపీరియర్ ఉద్యోగులై ఉండాలనే అర్హతను చేర్చారు. తద్వారా ఎన్జీఓల హక్కులను కాలరాస్తూ ఎన్జీఓలకు ప్లాట్ల కేటాయింపు కోసం ఏర్పాటు చేసిన సొసైటీలో కనీసం వారికి సభ్యత్వం పొందే అవకాశం కూడా లేకుండా చేశారు.

### అర్హులకే స్థలాలు కేటాయించాం

అనర్హులకు ఇళ్లను కేటాయించామనడం అవాస్తవం. షేర్ క్యాపిటల్ కట్టనివాళ్ల సభ్యత్వం రద్దు చేశాం. ఇళ్లు రాలేదనే అక్కసుతో కొందరు మాపై దుష్ప్రచారం చేస్తున్నారే తప్ప ఎలాంటి అక్రమాలు జరగలేదు. కాకపోతే నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరిగిన మాట వాస్తవం. గృహావసరాలకు కాకుండా కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించారు.

*– టీఎన్జీఓ హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు*

### అర్హతలేని వారికి స్థలాలిచ్చారు...

1982లోనే సొసైటీ మెంబర్‌గా చేరా. షేర్ క్యాపిటల్ కూడా చెల్లించా. ఉద్దేశపూర్వకంగా మాకు స్థలాలు కేటాయించకుండా సొసైటీ పాలకవర్గం అనర్హులకు ప్లాట్లను అమ్ముకుంది. ఇళ్ల కేటాయింపులో నిబంధనలు పాటించలేదు. మమ్మల్ని కాదని 89 మందికి అర్హత లేకుండా ఇళ్లను ఇవ్వడం వెనుక భారీ మొత్తంలో చేతులు మారాయి. టీఎన్జీఓ సభ్యులుకాని ఏసీబీ, పోలీసు, డీసీఓలకు ప్లాట్లు ఎలా కేటాయించారో నిగ్గు తేల్చాలి.

*– మక్కల కరుణాకర్, రిటైర్డ్ తహసీల్దార్*

# తహసీల్దార్ల అధికారాలకు కత్తెర!

- మ్యుటేషన్ జారీ అధికారం జేసీలకు..
- రికార్డుల మార్పులు, చేర్పులు కూడా వారి చేతుల్లోనే..
- కొత్త రెవెన్యూ చట్టంపై ప్రభుత్వం కసరత్తు
- వచ్చే నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం



**సాక్షి, హైదరాబాద్:** తహసీల్దార్ల అధికారాలకు కత్తెర పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రెవెన్యూ రికార్డుల మార్పులు, చేర్పుల్లో వారి భాగస్వామ్యాన్ని తగ్గించే దిశగా ఆలోచిస్తోంది. రెవెన్యూ శాఖలో భారీ సంస్కరణలు తీసుకురావాలని యోచిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. కొత్త రెవెన్యూ చట్టంలో తహసీల్దార్ల అధికారాల కుదింపుపై స్పష్టతనిచ్చే అవకాశముంది. సెప్టెంబర్‌లో జరిగే శాసనసభ సమావేశాల్లో ముసాయిదా రెవెన్యూ కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత కొన్నాళ్లుగా నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరచాల్సిన అంశాలపై ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ నేతృత్వంలోని నిపుణుల కమిటీ చర్చోపచర్చలు సాగిస్తోంది. అయితే, పురపాలక సంఘాల పదవీకాలం ముగియడం.. కొత్త చట్టం ఆధారంగానే మున్సి'పోల్స్'కు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించడంతో రెవెన్యూ చట్టానికి తాత్కాలికంగా పక్కనబెట్టింది. ఈ చట్టం మనుగడలోకి రావడంతో ఇక కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ముసాయిదా చట్టం తయారీలో తలమునకలైంది.

**తేలనున్న వీఆర్‌ఓల భవితవ్యం...**

రెవెన్యూ వ్యవస్థను సంస్కరించనున్నట్లు పలు సందర్భాల్లో ప్రకటించిన సీఎం.. ఇటీవల పంద్రాగస్టు ప్రసంగంలోనూ బూజు పట్టిన చట్టాలకు పాతర వేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమలులో ఉన్న 124 రెవెన్యూ చట్టాల్లో కాలం చెల్లినవాటికి మంగళం పాడనున్నట్లు తెలుస్తోంది. అలాగే, కొన్ని చట్టాలను ఒకే గొడుగు కిందకు తేవాలని యోచిస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. భూ యాజమాన్య హక్కు (మ్యుటేషన్) జారీని సరళతరం చేయడమే గాకుండా.. పారదర్శకంగా చేసే విధానాన్ని ప్రవేశపెట్టే అవకాశముంది. ఈ క్రమంలోనే మ్యుటేషన్ చేసే అధికారాలను తహసీలార్దకు కాకుండా ఆర్డీఓ లేదా జాయింట్ కలెక్టర్లకు కట్టబెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాల సంఖ్య పెరగడం, పరిధి కూడా తక్కువగా ఉన్నందున రికార్డుల పరిశీలన పెద్ద కష్టం కాబోదని అంచనా వేస్తోంది. తద్వారా మ్యుటేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పడమేకాకుండా.. అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ శాఖ భ్రష్టు పట్టడానికి కింది స్థాయి ఉద్యోగుల అవినీతే కారణమని బలంగా విశ్వసిస్తున్న సీఎం.. వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు లేదా పంచాయతీరాజ్, వ్యవసాయశాఖలో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీఆర్‌ఓల అవినీతి బాగోతాలపై తరుచూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేసీఆర్ వీరిపై కఠిన చర్యలకు దిగనున్నట్లు సంకేతాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

### పరిశీలనలో 'టైటిల్ గ్యారెంటీ'చట్టం...

భూమి హక్కులకు సంపూర్ణ భద్రత, పూర్తి భరోసా ఇచ్చే 'టైటిల్ గ్యారెంటీ'చట్టాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఈ బిల్లుకు ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో.. మన రాష్ట్రంలో కూడా దీని అమలుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తోంది. మూడేళ్ల క్రితమే రాజస్థాన్.. పట్టణ ప్రాంత భూముల కోసం 'టైటిల్ సర్టిఫికేషన్'చట్టాన్ని తీసుకొచ్చింది. గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ముసాయిదాలను రూపొందించుకున్నాయి. భూ హక్కుకు పూర్తి హామీ ఇచ్చే ఈ చట్టం అమలులోకి వస్తే పదుల సంఖ్యలో ఉన్న భూరికార్డుల స్థానంలో భూ యాజమాన్య హక్కులకు అంతిమ సాక్ష్యంగా టైటిల్ రిజిస్టర్ ఉండనుంది. తద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలకు ఆస్కారం ఉండదని సర్కార్ భావిస్తోంది. అయితే, ఈ చట్టం మనుగడలోకి తేవాలంటే భూ సమగ్ర సర్వే తప్పనిసరి. ఈ సాధకబాధకాలను అంచనా వేసిన తర్వాతే దీనిపై ముందడుగు వేసే అవకాశముంది. నీతి ఆయోగ్ సిఫార్సులు, పక్క రాష్ట్రం అమలు చేస్తున్న తరుణంలో ఇక్కడ కూడా దీన్ని ఈ చట్టాన్ని తీసుకొస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని నిపుణుల కమిటీ సూక్ష్మంగా పరిశీలిస్తోంది.

## గాంధీలో రెండు స్వైన్‌ఫ్లూ కేసులు

### నగరంలో విజృంభిస్తోన్న చికెన్‌గున్యా, డెంగీ వ్యాధులు

**హైదరాబాద్:** మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలతోపాటు స్వైన్‌ఫ్లూ మహమ్మారి విజృంభిస్తోంది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రెండు స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. రంగారెడ్డిజిల్లా బాలాపూర్ అల్మాస్‌గూడకు చెందిన వృద్ధుడు (75) తీవ్ర జ్వరంతో నాలుగు రోజుల క్రితం అపోలో ఆస్పత్రిలో చేరాడు. స్వైన్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో మెరుగైన వైద్యం కోసం రిఫరల్‌పై ఈనెల 16న గాంధీ ఆస్పత్రిలో చేరాడు. స్వైన్‌ఫ్లూతో బాధపడుతున్న నాగర్ కర్నూల్ బిజ్నాపల్లి లట్టుపల్లికి చెందిన వృద్ధురాలు (63) మలక్‌పేట యశోద ఆస్పత్రి నుంచి రిఫరల్‌పై గాంధీ ఆస్పత్రిలో చేరింది. వీరిద్దరితోపాటుగా మరో ఇద్దరు స్వైన్‌ఫ్లూ అనుమానితులకు డిజాస్టర్ వార్డులో చికిత్సలు అందిస్తున్నామని ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహరావునేత తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు గాంధీఆస్పత్రిలో 93 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా 70మంది పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జీ అయ్యారని, 21 మంది మృతి చెందారని డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహరావునేత తెలిపారు. ఆగస్టులో ఇప్పటివరకు 37 చికెన్‌గున్యా, 50 డెంగీ కేసులు నమోదయ్యాయని డిప్యూటీ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ ఏడాది గాంధీ ఆస్పత్రి ల్యాబోరేటరీలో 2,245 మంది నుంచి నమూనాలు సేకరించి వైద్యపరీక్షలు నిర్వహించగా 269 మందికి డెంగీ, 2,024 మందిలో 200 మందికి చికెన్‌గున్యా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు.







# బడ్జెట్ తర్వాతే రుణమాఫీ!

- కసరత్తు చేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ
- బడ్జెట్లో పూర్తిస్థాయి కేటాయింపులుండే అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే నెలలో ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి బడ్జెట్ తర్వాతే పంటరుణాలను మాఫీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆ దిశగా మార్గదర్శకాలపై వ్యవసాయ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. గతంలో అమలు చేసిన విధంగానే చేయాలా? ఏవైనా మార్పులు చేయాలా? అన్నదానిపై చర్చిస్తున్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఈ ఏడాది రుణమాఫీకి రూ.6 వేల కోట్లు కేటాయించింది. గతేడాది డిసెంబర్ 11 వరకున్న రైతుల పంటరుణాల్లో రూ.లక్షలోపు మాఫీ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ పంటరుణాలు ఇవ్వడంలో బ్యాంకులు కొర్రీలు పెడుతున్నాయి. పాత రుణాలు రీషెడ్యూల్ చేసుకోకపోతే కొత్త రుణాలు ఇవ్వబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా అంచనాలను, పరిస్థితులను లెక్కలోకి తీసుకొని పంట రుణాలను బడ్జెట్ ప్రవేశపెట్టాక మాఫీ చేస్తామని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

**బంగారంపై రుణాలు మాఫీ చేస్తారా?**

మరోసారి రుణమాఫీ చేస్తామని టీఆర్‌ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే గత ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.6 వేల కోట్లు కేటాయించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు లక్ష రూపాయల రుణమాఫీ ప్రకటించి అమలు చేసింది. అప్పట్లో 35.29 లక్షలమంది రైతులకు చెందిన రూ.16,124 కోట్ల రుణాలను 4 విడతలుగా మాఫీ చేసింది. ఈసారి ఎన్ని విడతల్లో మాఫీ చేస్తారన్న దానిపై స్పష్టత రాలేదు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 48 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నట్లు అంచనా. అందులో 42.36 లక్షలమంది రైతుల పంటరుణాలు రూ.32,262 కోట్లు ఉన్నాయి. మరో 5.56 లక్షలమంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రూ.5,253 కోట్ల పంటరుణాలు తీసుకున్నారు. అయితే, కేంద్రం ఇటీవల బంగారంపై తీసుకున్న రుణాలను కూడా సాధారణ రుణాలుగానే పరిగణిస్తామని, వాటికి పావలావడ్డీ, వడ్డీలేని రుణాల పథకాలను వర్తించబోమని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో బంగారంపై రైతులు తీసుకునే రుణాలను ప్రభుత్వం ఎలా పంట రుణాలుగా గుర్తిస్తుందా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

**ఔను బడ్జెట్ తర్వాతే..**

వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ తర్వాతే రుణమాఫీ అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 'సాక్షి'కి చెప్పారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో రుణమాఫీకి సొమ్ము కేటాయించామని, అయితే పూర్తిస్థాయి బడ్జెట్ తర్వాతే అమలు చేస్తామన్నారు.

# రెవెన్యూ మరింత పెరగాలి..

- రాబడి లక్ష్యాలు పెంచుకోండి
- బడ్జెట్ రూపకల్పనపై సమీక్షలో సీఎస్ ఎస్‌కే జోషి

**సాక్షి, హైదరాబాద్:** భారీగా పెరిగిన రాష్ట్ర ఆర్థిక అవసరాలను తీర్చడానికి అనుగుణంగా రాబడి సైతం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పథకాలు, కార్యక్రమాల కొనసాగింపుతో పాటు గత ఎన్నికల హామీల అమలుకు కొత్తగా చేపట్టాల్సిన కార్యక్రమాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో భారీగా నిధులు అవసరమన్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రవాణా, స్టాంపులు, రిజిస్ట్రేషన్ వంటి శాఖలు తమ వార్షిక ఆదాయ లక్ష్యాలను పెంచుకుని, వాటిని అందుకోవడానికి మరింత గట్టిగా కృషి చేయాలని కోరారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై వివిధ శాఖల కార్యదర్శులతో శనివారం ఆయన సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్షణమే శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించి ఆర్థిక శాఖకు సమర్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ తొలి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశముందని ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రులు తమ శాఖలతో బడ్జెట్ రూపకల్పనపై సమీక్షలు నిర్వహించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, ఆ తర్వాత సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని సీఎస్ తెలియజేశారు. కేంద్ర ప్రయోజిత పథకాలు, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపును దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలను సిద్ధం చేయాల న్నారు. గతేడాది బడ్జెట్ కేటాయింపులను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. బడ్జెట్ రూపకల్పనలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్ తివారి, చిత్ర రామచంద్రన్, అధర్ సిన్హా, సోమేశ్‌కుమార్, శాంతికుమారి పాల్గొన్నారు.

# పదోన్నతుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం

- ఇందిరాపార్కు వద్ద దీక్షలో భాషా పండితులు, పీఈటీలు
- పదోన్నతుల జీవో 15 అమలులో అధికారుల నిర్లక్ష్యం
- దీక్షకు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సంఘీభావం

**హైదరాబాద్:** భాషాపండితులు, పీఈటీల పదోన్నతుల సాధన కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు(ఆర్‌యూపీపీ–టీ), వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం(పీఈటీఏ టీఎస్)ల రాష్ట్ర కమిటీ నాయకులు అన్నారు. ఏ ఉద్యోగంలోనైనా ప్రమోషన్లు ఉన్నాయని, అయితే భాషాపండితులు, పీఈటీలు చేరిన కేడర్‌లోనే రిటైరవుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషాపండితులు, పీఈటీల సమస్యపై స్పందించి పోస్టులను అప్‌గ్రేడేషన్ చేస్తూ జీవో 15 పై సంతకం చేసినా అమలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భాషాపండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు, వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘాలు ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్షలు నిర్వహించాయి. దీక్షల్లో ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.డి. అబ్దుల్లా, గండమల్ల విశ్వరూపం, పీఈటీఏ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ ఎస్.సోమేశ్వర్‌రావు, బి.రాఘవరెడ్డిలతోపాటు తెలంగాణలోని అన్నిజిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు కూర్చున్నారు. అన్నిజిల్లాల నుంచి పండిత ఉపాధ్యాయులు, పీఈటీలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీక్షలకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎ.నర్సిరెడ్డి, సరోత్తమ్‌రెడ్డి, చావ రవి (టీఎస్‌యూటీఎఫ్) భుజంగరావు(ఎస్‌టీయూ), రాఘవరెడ్డి (పీఈటీ అసోసియేషన్), రఘునందన్ (టీటీఎఫ్), పి.లక్ష్మయ్య(జూనియర్ కళాశాల పీఈటీ అసోసియేషన్) తదితరులు సంఘీభావం ప్రకటించారు.

**సీఎంకు పండిత టీచర్ల సమస్యలు పట్టవా?: ఆర్.కృష్ణయ్య**

భాషా పండితుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పండితుల సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయమని ఆర్.కృష్ణయ్య అన్నారు. పండిత, పీఈటీ పోస్టుల్లో 25, 30 ఏళ్లుగా పనిచేస్తున్నా ప్రమోషన్లు లేకపోవడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ భాషాపండితులు, పీఈటీల సమస్యలపై శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. పదోన్నతులతో 12 వేల కుపైగా భాషాపండితులు, పీఈటీలు, లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని ఐక్య ఉద్యమాలతోనే మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఆర్‌యూపీపీటీ, పీఈటీఏ టీఎస్ నేతలు పలువురు మాట్లాడుతూ ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేయాలని కోరారు.



దీక్షకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య

**భాషా పండితుల అరెస్టు**

భాషా పండితుల నిరాహారదీక్షలను పోలీసులు భగ్నం చేశారు. అనుమతి లేకుండా దీక్షలు కొనసాగిస్తున్నారంటూ పోలీసులు 8 మంది భాషాపండితులను బలవంతంగా అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పదోన్నతుల సాధనకై భాషా పండితులు , పీఈటీలు ఇందిరాపార్కు వద్ద ఆమరణ దీక్ష కోసం దరఖాస్తు చేసుకోగా పోలీసులు రెండు రోజుల రిలేదీక్షలకు అనుమతించారు. అయితే అమరణ దీక్షల పేరుతో సాయంత్రం అయిదు తర్వాత కూడా దీక్షలను యధావిధిగా కొనసాగిస్తుండడంతో పోలీసులు టీచర్ల దీక్షలను ముగించాలని చెప్పారు. ఈ క్రమంలో పోలీసులు బలవంతంగా దీక్ష శిబిరం టెంటును తొలగింపచేశారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్న ఎమ్మెల్సీల హామీతో పీఈటీలు దీక్షలు విరమించగా భాషా పండితులు ససేమిరా అన్నారు. దీంతో రాత్రి 7 గంటల తర్వాత పోలీసులు భాషా పండితులను అరెస్టు చేశారు.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Govt. of India Society) Ministry of MSME
Balanagar 'X' Roads, Hyderabad-500 037 (TS) INDIA.
TEL. No.040 - 23772749. Mobile : 9652119499 (Sl.No.2 & 3) Visit us at: www.citdindia.org,
E-Mail: citdcadcam@citdindia.org, citdvijayawada@citdindia.org

Admission Notice for Free Training on Entrepreneurship cum Skill Development Programme Courses

| S. No | Course Name | Duration | Hosting Centre | No. of Participants | Batch starting date | Eligibility |
|---|---|---|---|---|---|---|
| 1. | MASTER CERTIFICATE COURSE IN CAD/CAM | 780 Hrs/ 6 Months 6 Hrs/day | Hyderabad | 25 | 21.08.2019 | Diploma / Degree (Mechanical Engineering or equivalent) |
| | MASTER CERTIFICATE COURSE IN CAD/CAM | 780 Hrs/ 6 Months 6 Hrs/day | Sub Centre Vijayawada | 25 | 04.09.2019 | |
| 2. | Split AC (Room Air Conditioner-RAC), Home Appliances-HA)-RACHA | 610 Hrs/ 4 Months 6 Hrs/day | Hyderabad | 25 | 21.08.2019 | ITI/ 10+2, Diploma, any Degree or its equivalent |
| 3. | Handheld products - HHP (Mobiles & Tablets) | 460 Hrs/ 3 Months 6 Hrs/day | Hyderabad | 25 | 21.08.2019 | ITI/10+2, Diploma, any Degree or its equivalent |

NOTE : (1) Admission are on first come first serve basis.
(2) Interested Candidate are advised to contact CITD, Hyderabad and Sub-Centre Vijayawada (54-2-9, Phase III, Autonagar, Vijayawada - 520 007. Tel.No.0866-2540560, Mobile:9885429054) along with Photocopies of Certificates, Aadhar Card and Reg. Fee of Rs.1000/- to be paid.
Sd/-
PRINCIPAL DIRECTOR
ISO 9001 : 2015, ISO 29990:2010, ISO 14001:2004, ISO 50001:2011 Certified Institution

# కుక్కల స్వైరవిహారం

- రాష్ట్రంలో 3 నెలల్లో 75 వేల మందికి కాట్లు
- ఒక్క నల్లగొండ జిల్లాలోనే 46 వేలమందిపై దాడి
- రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేక బాధితుల ఇక్కట్లు



**సాక్షి, హైదరాబాద్:** కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కుక్కల దాడికి గురవుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ లెక్కలే చెబుతున్నాయి. వీటిని నియంత్రించేదిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల వైఫల్యం కారణంగా పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడంలేదు. వైద్య, ఆరోగ్యశాఖ తాజాగా ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 29వ తేదీ నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు 33 జిల్లాల్లో 74,836 మంది కుక్కల కాట్లకు గురయ్యారు. అందులో ఒక్క నల్లగొండ జిల్లాలోనే ఏకంగా 46,297 మందిని కుక్కలు కరిచినట్లు తెలిపింది. వీటికి గల కారణాలను పరిశీలిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో 2,677 మందిపై కుక్కలు దాడులు చేశాయి. 15 జిల్లాల్లో వెయ్యిమందికిపైగా గాయపడ్డారు. కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ వ్యాధితో అనేకమంది మృతి చెందుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నా అవి వెలుగులోకి రావడం లేదు. జిల్లాలో ఐదారు లక్షలకు పైగా కుక్కలు వీధుల్లో సంచరిస్తూ వందలాది మందిని గాయపరుస్తున్నాయి. కుక్కకాటు టీకాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతంత మాత్రంగానే ఉన్నాయి.రాష్ట్రంలో రానురాను కుక్కకాటుకు గురై రేబిస్ సోకి మరణించేవారి సంఖ్య పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశం. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు పాదచారులకు నిత్యం భయాందోళనలు కలిగిస్తున్నాయి. జిల్లా వెయ్యికిపైగా కేసులు నమోదయ్యాయి. వీధికుక్కల ఏరివేతకు సంబంధిత అధికారులు హడావుడి చేసినా ఫలితం మాత్రం కనిపించటంలేదు.

**వ్యాక్సిన్ కొరత...**

పిచ్చికుక్క కాటుతో వచ్చే రేబిస్‌వ్యాధి నియంత్రణకు వ్యాక్సిన్ కనుగొని ఇప్పటికి 140 ఏళ్లు దాటాయి. అయినా రేబీస్‌వ్యాధి ప్రాణాంతకంగా మారుతోంది. ఈ విషయం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్నోసార్లు హెచ్చరించింది. కుక్కకాటు మరణాల్లో సగానికిపైగా భారత్‌లోనే సంభవిస్తున్నాయి. అందులో అధిక శాతం 15 ఏళ్లలోపు పిల్లలేనని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వ్యాధి నిరోధక, ముఖ్యంగా రేబిస్ నియంత్రణకు వాడే మందులను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. కుక్క కరిచిన తర్వాత జరగాల్సిన చికిత్సకు అవసరమైన మందులు అనేక ఆస్పత్రుల్లోలేవని చెప్పొచ్చు. అధికార లెక్కల ప్రకారమే కుక్కకాటు వల్ల 40 వేల మందికిపైగా ఆస్పత్రుల పాలవుతున్నట్లు వెల్లడైంది. విచక్షణారహితంగా కరిచే పిచ్చికుక్కలను పట్టి దూరంగా వదిలివచ్చే శిక్షణ కలిగిన సిబ్బంది కొరత తీవ్రంగానే ఉంది. మున్సిపల్ అధికారులు ఏదో నామమాత్రంగా ఈ పిచ్చి కుక్కలు, వీధికుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రికార్డుల్లో రాసుకుంటున్నా ఆచరణలో ఫలితం శూన్యం. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో 20 వేలకు పైగా వీధికుక్కలు ఉండవచ్చని అంచనా. ముఖ్యంగా వీటికి సంబంధించి సీజన్ మారినప్పుడల్లా కలుషితనీరు తాగడమో, కలుషిత ఆహారం తినడం వల్లనో రోగాల బారినపడి ప్రజలపై దాడికి ప్రయత్నిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వ్యయం చేసి కొంటున్నట్లు చెప్తున్నా మందులు అందుబాటులో ఉండటం లేదు.

### కుక్కల నియంత్రణ నామమాత్రం

కుక్కల సంఖ్య పెరగకుండా నియంత్రణ చేసే కార్యక్రమం కూడా నామమాత్రంగా మారింది. శునకాలకు శస్త్రచికిత్స చేస్తున్నట్లు రికార్డుల్లో రాసుకుంటున్నా అవి ఎంతవరకు వాస్తవం అనేది అగమ్యగోచరంగానే ఉంది. కుక్కల నియంత్రణకు సంబంధిత మున్సిపాలిటీల్లో కానీ, ఇటు పంచాయతీల్లో కానీ నిర్దిష్టమైన కార్యక్రమాలు తీసుకోకపోవడం వల్ల అవి అంతకంతకూ పెరిగిపోతున్నాయి. రేబిస్ చికిత్సకు అవసరమైన అన్ని మందులు మండల, కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలని బాధితులు కోరుతున్నారు.



# మన ఫొటోగ్రఫీకి మహా'రాజా'



**1839లో** ఫ్రాన్స్‌లో కనుగొన్న డాగ్వేరియన్ ఫొటోగ్రఫీ టెక్నాలజీని ఆ మరుసటి సంవత్సరం భారత్‌కు పరిచయం చేశారు. దీనికి సంబంధించి కోల్‌కతాలో విస్తృతంగా ప్రకటనలు జారీ చేశారు. బాంబే, కోల్‌కతా, మద్రాస్ వంటి నగరాల్లో 1850 నుంచి ఫొటోగ్రఫీ వాడకం మొదలైంది. అప్పటివరకు యూరోపియన్ స్టైల్‌లోనే ఫొటోలు తీస్తుండగా.. రాజా దీన్ దయాళ్ ప్రయత్నాల పుణ్యమా అని భారత్‌లో ఫొటోగ్రఫీ కొత్తరూపు సంతరించుకుంది. తీసే పద్ధతిలో కొన్ని మార్పులు చేయడంతో పాటు భారత కళా సంస్కృతులను జోడించడం ఈయనతోనే ప్రారంభమైంది. హైదరాబాద్ ఆరో నిజాం ఆస్థాన ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన రాజా దీన్ దయాళ్.. అంతఃపురంలో జరిగే ఎన్నో వింతలు, విశేషాలు తమ కెమెరాలో బంధించారు. అయితే ఆయన ఎక్కువగా రాజమందిరంలో కళారూపాలను చిత్రించడానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. 1858లో ఫెలైస్ బీటో అనే ఫొటోగ్రాఫర్ తెల్లదొరల ఆదేశాల మేరకు లక్నోలో పర్యటించి అక్కడ పరిస్థితుల్ని చిత్రరూపంలో బంధించారు. కోల్‌కతాలోని సికిందర్‌బాగ్‌లో శవాల గుట్టల్ని తన కెమెరాలో బంధించి ఫెలైస్ బీటో గొప్ప పేరు తెచ్చుకున్నారు. 1860లలో యూరప్ నుంచి వచ్చిన మేయర్ అనే మహిళ ఫొటోగ్రఫీని వృత్తిగా చేసుకున్న తొలిమహిళగా రికార్డులకెక్కారు.

భారత్‌లో ఫొటోగ్రఫీకి ఆద్యుడైన రాజా దీన్ దయాళ్ తీసిన అపురూపమైన ఛాయాచిత్రాల్లో ఇదీ ఒకటి. పేరు 'గజల్ అండ్ డ్యాన్స్'



## క్లుప్తంగా...

### ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**టీజేఎస్ నేత కోదండరాం డిమాండ్**



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రాజెక్టులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం డిమాండ్ చేశారు. నదుల అనుసంధానంతో ఫలితం శూన్యమని, తాము నదుల అనుసంధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ నీటిని సీఎం కేసీఆర్ ఎలా దానం చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ నీటిని తరలించి ఈ రాష్ట్రాన్ని ఎడారిగా మార్చడాన్ని తాము ఒప్పుకోమన్నారు. తెలంగాణ నదీజలాలను తరలిస్తే నష్టపోయేది రాష్ట్రమేనన్నారు. కృష్ణా నదిలో నీరు పోయాల్సిన అవసరం లేదని చెప్పారు. గోదావరి నుంచి కృష్ణలో నీరు పోస్తే ఎగువ రాష్ట్రాలకూ వాటిపై హక్కు వస్తుందన్నారు.

### బీజేపీ కబంధ హస్తాల్లో టీఆర్‌ఎస్ ఎంపీలు బందీ

**ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సమస్యలపై టీఆర్‌ఎస్ ఎంపీలు ఏ రోజైనా బీజేపీ సర్కార్‌ను నిలదీశారా? అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ప్రశ్నించారు. బీజేపీ కబంధ హస్తాల్లో టీఆర్‌ఎస్ ఎంపీలు బందీ అయ్యారని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని అడిగారు. ఇంకోసారి కాంగ్రెస్‌ను లక్ష్మణ్ విమర్శిస్తే మా తడాఖా చూపిస్తామన్నారు. 'ముందు నీ అధ్యక్ష పదవి ఊడకుండా కాపాడుకో'అని హితవు పలికారు.

### బకాయిలు వెంటనే చెల్లించాలి: మల్లు రవి

**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించి రోగులకు న్యాయం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుంటే సేవలు ఆపేస్తామని ప్రైవేటు ఆసుపత్రులు హెచ్చరించినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### మంచి చేస్తున్నట్లు నిరూపించుకో: పొన్నాల



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సీఎం కేసీఆర్ న్యాయమైన పాలన అందించడం లేదని, ఎక్కడైనా మంచి చేస్తున్నానని ఆయన నిరూపించుకుంటే నమస్కరిస్తానని మాజీ టీపీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య అన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో పొన్నాల మాట్లాడుతూ.. పేదల కోసం కాంగ్రెస్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తెస్తే కేసీఆర్ దాన్ని నిలిపివేశారని, 108 ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

### 'సీఎం జోక్యం చేసుకోవాలి'

**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ సేవలపై ప్రైవేటు యాజమాన్యాలతో జరిగిన చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొన్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత తర్వగా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

### నిధుల కేటాయింపు నిరాశాజనకం: నామా



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదని ఎంపీ నామా నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించడానికి ఆ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో శనివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. మిషన్ భగీరథ పథకానికి 'హర్ ఘర్ జల్' పథకం కింద కేంద్రం నిధులు కేటాయించాలని లోక్‌సభ మొదటి సమావేశాల్లో ప్రస్తావించినట్లు వెల్లడించారు.

# 'సెల్ఫీ' విత్ సక్సెస్





## 35 రోజుల్లో 20 వేల కాపీలు అమ్ముడయ్యాయని వెల్లడి

- తొలి పుస్తకం సక్సెస్‌తో మరిన్ని రచనలకు సిద్ధపడ్డ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం
- మూడు నెలల్లో రానున్న 'నోవేర్ నవ్ అండ్ హియర్'
- ఎవరెస్టు పర్వతం మాట్లాడుతున్నట్టుగా రచన
- అన్ని ప్రధాన ప్రపంచ భాషల్లో విడుదలకు ప్లాన్
- బ్రెయిలీ వర్షన్‌లోనూ 'సెల్ఫీ ఆఫ్ సక్సెస్' విడుదల

'సెల్ఫీ ఆఫ్ సక్సెస్' కొద్దిరోజుల క్రితం అమెజాన్ ఆన్‌లైన్ అంగట్లో హల్‌చల్ చేసిన పుస్తకం. 166 పేజీలతో ఉన్న ఈ పుస్తకం పేరే కాస్త గమ్మత్తుగా అనిపిస్తోంది కదూ. సెల్ఫీకి లోకం ఫిదా అయిన తరుణంలో విజయమే తన సెల్ఫీని మన ముంగిటకు తెచ్చినట్టు అనిపించేలా విడుదలైన ఆ పుస్తకం తక్కువ సమయంలో ఎక్కువ అమ్మకాలతో ఆకట్టుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం రాసిన ఆ పుస్తకం విడుదలైన 35 రోజుల్లో దాదాపు 20 వేల ప్రతులు అమ్ముడైనట్టు పబ్లిషర్స్ చెప్తున్నారు. కొత్త పుస్తకాల విభాగంలో ఇంత తక్కువ సమయంలో అధిక రేటింగ్ పొందిన తొలి పుస్తకం ఇదేనంటూ అమెజాన్ గుర్తించిందనేది వారి మాట. మరి ఇంత తక్కువ పేజీలున్న ఈ పుస్తకం అంత క్రేజ్ సంపాదించుకోవటానికి కారణం కూడా అంతుచిక్కని 'విజయ రహస్యమే'. ప్రపంచవ్యాప్తంగా వారివారి రంగాల్లో విజయం సాధించిన వారు అనుసరించిన పద్ధతుల సారాంశాన్ని ఇందులో కళ్లకు కట్టినట్టు వివరించారు. వారి విజయానికి ఫలానాదే కారణం అంటూ ఎక్కడా స్పష్టం చేయకుండా కేవలం వారి వ్యవహారాన్ని మాత్రమే పేర్కొన్నారు. దీంతో పాఠకులు కూడా విజయం అంటే ఇలా వ్యవహరించాలా అన్న తరహాలో ఆలోచించుకునేలా చేసిందా పుస్తకం. విజయం అంటే డబ్బు సంపాదనే కాదు, విజయాన్ని ఆనందించే తత్వం, తోటి వారిని కూడా సంతోషపెట్టేలా చేయటం అన్న విషయాన్ని కూడా ఆ విజేతల జీవితాలను చూసి తెలుసుకునేలా చేసింది. గెలుపుపై అవగాహన, గెలుపు ప్రయాణం, గెలుపు అర్థం, గెలుపు తెచ్చే అనర్థం, గెలుపు పరమార్థం... ఇలా ఐదు అంకాలుగా ఈ పుస్తకంతో సారాంశం సాగిన తీరు ఆకట్టుకుంది.

ఈ పుస్తకం అనతికాలంలోనే పాఠకుల ఆదరణ దక్కించుకోవటంతో బుర్రా వెంకటేశం మరికొన్ని పుస్తకాలను వెలువరించేందుకు సిద్ధపడ్డారు. సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకాన్ని తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం, గుజరాతీ, బెంగాలీ, హిందీ భాషల్లోకి అనువదించబోతున్నారు. అది విశ్వజనీనమైన సబ్జెక్టు కావటంతో కొరియా, జపాన్, చైనా, పోర్చుగల్, పర్షియా, ఇండోనేషియా తదితర దేశాల్లో కూడా వారి భాషల్లో విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఓ వైపు ఈ తర్జుమా తంతు జరుగుతుండగానే, ఈ సక్సెస్‌ను సమాజంతో జోడించేలా మరికొన్ని పుస్తకాలను వెలువరించే కసరత్తు మొదలుపెట్టారు.

విజయంపై ఓ అవగాహన తెచ్చేలా చేసిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ తర్వాత ఉత్తేజం కలిగించే విజయగాథలతో కూడిన రెండో పుస్తకాన్ని తేనున్నట్టు బుర్రా వెంకటేశం చెప్పారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆరాధ్యులుగా మారిన వారి జీవిత గాథల సారాంశాలతో కూడిన పుస్తకాన్ని సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. 'నో వేర్ నవ్ అండ్ హియర్' శీర్షికతో ఉండే ఈ పుస్తకం మరో మూడు నెలల్లో పాఠకుల ముందుకు తేనున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రతికూలతలను కూడా అనుకూలంగా మలుచుకుని విజయాన్ని ఎలా సాధించారన్న విషయాన్ని ఆ పుస్తకం వివరిస్తుందంటున్నారు ఆయన.

**3 నెలల్లో..**

**2వ పుస్తకం..**

ఆ తర్వాత.. అసలు జీవితంలో సక్సెస్ ఎంత అవసరం అన్న విషయాన్ని చర్చించే 'హౌమచ్ సక్సెస్ యూ నీడ్ ఇన్ లైఫ్'పేరుతో సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించనున్నట్టు వెల్లడించారు. అనూహ్య విజయాలు సాధించిన తక్కువ మంది.. ఎక్కువ మందిని ప్రభావితం చేయటం, భారీ విజయాలు సాధించి ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించిన వారు, అనంతర వ్యవహారంలో ఎలాంటి ప్రభావానికి లోనయ్యారు... లాంటి విషయాలు ఇందులో వివరించనున్నట్టు పేర్కొన్నారు.

ఇక 'థాంక్యూ ఎనిమీ'పేరుతో మరో పుస్తకం వస్తుందని, మానవ పరిణామ వికాస క్రమంలో విజయాల పరంపరను ఇందులో వివరించనున్నట్టు వెల్లడించారు. ఇది 30 వేల ఏళ్ల నుంచి ఇప్పటి వరకు మనిషి పట్టుదలగా ఎలాంటి విజయాలు సాధించాడో వివరిస్తుందని పేర్కొన్నారు. ఆ విజయాలకు పురిగొల్పిన సవాళ్లను, అధిగమించిన తీరు ఇది వివరిస్తుందని పేర్కొన్నారు. ఆ తర్వాత సంతోషాన్ని నిర్వచించే మరో పుస్తకం 'షీ' పేరుతో వస్తుందన్నారు. స్టోరీ ఆఫ్ హ్యాపీనెస్ బై ఎవరెస్ట్ పేరుతో ఉండే పుస్తకం ఆ ఆంగ్ల పదాల తొలి అక్షరాల పొడి రూపమే షీ (ఎస్‌హెచ్‌ఈ)గా ఉంటుందన్నారు.

### సక్సెస్... అంటే ఏంటి?

ప్రారంభించిన పనిని విజయవంతంగా పూర్తి చేయటం అంటారెవరైనా.
మరి వ్యాపారాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకోగలిగినంత విజయం చవిచూసిన 'కాఫీ సిద్ధార్థ' ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు?
**నిజానికి సక్సెస్‌ని నిర్వచించటం కష్టం...**
మారుమూల పల్లె మొదలు అగ్రరాజ్యం అమెరికా వరకు... సక్సెస్ కోసం ఒకటే ఉరుకులు, పరుగులు. ఆటలో గెలుపు, అంకెలు సాధించటంతో సరి. కానీ జీవితంలో గెలుపు సంగతేంటి? ప్రపంచ మానవ సమూహం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఈ గెలుపు పరుగే కారణం. ఒక వ్యా పారం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి మరింతగా విస్తరించడం గెలుపే అయితే, ఆ త ర్వాత పతనం కావటం ఓటమిగా భావించాలా.. అసలు గెలుపు సూత్రమేంటి, గెలుపు పరుగు ముగిసేదెక్కడ, సాధించిన ఏ విజయాన్ని 'సక్సెస్'గా భావించవచ్చు? డబ్బు సంపాదించటమే విజయానికి నిదర్శనమైతే, పూరి గుడిసెలో ఉంటూ సంతోషంగా రోజులు వెళ్లదీసే వ్యక్తి 'సక్సెస్' చెందినట్టు కాదా.. ప్రశ్నల పరంపర.. సవాలక్ష సందేహాలకు సమాధానాలు విడమరిచి చెప్పేదెవరు?

### ఎవరెస్టే వివరించినట్టుగా...

ఎత్తయిన పర్వతంగా ఉన్న ఎవరెస్టు ప్రపంచాన్ని గంభీరంగా గమనిస్తూ ఉన్నట్టు అనిపిస్తుంది. అది అలా విశ్వాన్ని గమనిస్తూ విజయాల గాథను వివరిస్తే ఎలా ఉంటుందనే ఐడియాతో కొత్త పుస్తకాలు వస్తాయన్నారు. తొలి పుస్తకంలో విజయమే పాఠకులతో మాట్లాడుతున్నట్టు ఉండగా, తదుపరి పుస్తకాల్లో ఎవరెస్టు పర్వతం మాట్లాడుతున్నట్టు ఉంటుందని పేర్కొన్నారు. "ప్రపంచవ్యాప్తంగా పోటీ తత్వం నెలకొని విజయం కోసం పరుగులు పెట్టే క్రమంలో మానవ సంబంధాలు బాగా దెబ్బతింటున్నాయి. విజయం వైపు పయనంలో సంతోషమే పరమార్థం కావాలి. విజయకాంక్షలో సంతృప్తి ఎలా అవసరం, దాన్ని స్థిరీకరించుకునే తీరు, ఆ విజయం తనకే కాకుండా, తోటివారికి కూడా ఎలా ఆనందాన్ని పంచాలి అన్న విషయంలో ప్రజలకు కొంత అవగాహన అవసరం. ఆ ఆలోచనలోంచే పుస్తక రచన ప్రారంభించా. ఈ పుస్తకాల అమ్మకంతో వచ్చే లాభాలను నిస్సహాయ వృద్ధుల సంక్షేమం కోసం ఖర్చు చేస్తా. విజయం తెచ్చే అనర్థాలు కోణం నా తొలి పుస్తకంలో కొత్త విషయం. ఇప్పటివరకు ఎవరూ ఆ కోణంలో రచించలేదు. ఇక రూ.50 వేల కోట్లు ఆర్జించి పెట్టిన హ్యారీపోటర్ పుస్తకాలు కూడా బ్రెయిలీ లిపిలో విడుదల కాలేదు. కానీ నా తొలిపుస్తకాన్ని అంధులు కూడా చదివేలా బ్రెయిలీలో అందుబాటులోకి తెచ్చా'అని వెంకటేశం పేర్కొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

# శ్రీశైలానికి తగ్గిన వరద

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బేసిన్‌లో వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ముఖ్యంగా ఎగువ నుంచి ప్రవాహాలు తగ్గడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. నిన్నమొన్నటి వరకు ప్రాజెక్టులోకి 8 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహాలు ఉండగా, శనివారం 6.54 లక్షల క్యూసెక్కులకు తగ్గాయి. తుంగభద్ర, భీమా నదుల నుంచి వరద ఉధృతి తగ్గడంతో క్రమంగా ప్రవాహాలు తగ్గుతున్నాయి. బేసిన్ ప్రాజెక్టులన్నీ ఇప్పటికే నిండుకుండలుగా ఉండటంతో పులిచింతల నుంచి 6.65 లక్షల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ మీదుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇప్పటికే 250 టీఎంసీలకు పైగా వరద సముద్రంలో కలిసింది.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా.. (నిల్వ-టీఎంసీల్లో)**

| ప్రాజెక్టు | పూర్తి నీటి నిల్వ | ప్రస్తుత నీటి నిల్వ | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 106.83 | 4,45,200 | 4,20,000 |
| నారాయణపూర్ | 37.646 | 28.06 | 3,80,000 | 3,42,040 |
| జూరాల | 9.65 | 7.68 | 5,65,000 | 5,33,708 |
| శ్రీశైలం | 215.807 | 195.21 | 6,54,193 | 7,47,546 |
| తుంగభద్ర | 100.86 | 100.86 | 78,717 | 78,674 |
| ఉజ్జయినీ | 117.24 | 117.24 | 12,351 | 8,450 |
| నాగార్జునసాగర్ | 312.045 | 301.36 | 6,08,072 | 6,08,072 |
| పులిచింతల | 45.77 | 37.82 | 6,48,787 | 6,65,234 |
| కడెం | 7.6 | 6.88 | 1,384 | 818 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.09 | 0 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 17.18 | 0 | 389 |

### 25న రేషన్ డీలర్ల అడహక్ కమిటీ సమావేశం

**ఎజెండాగా నూతన కమిటీకి ఎన్నికల నిర్వహణ**

**హైదరాబాద్:** తెలంగాణలో ఉన్న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అడహక్ కమిటీ సమావేశం ఈ నెల 25న నగరంలో నిర్వహించనున్నట్లు అడహక్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్ తెలిపారు. నూతన కమిటీని ఎన్నుకునేందుకు ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో రాష్ట్రంలో రేషన్ డీలర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు డీలర్ల సంఘం బలంగా ఉండాలన్న ఆలోచనతో గత జూన్ 30న కొమురవెల్లిలో జరిగిన సమావేశంలో రెండు సంఘాలను రద్దు చేసి అడహక్ కమిటీని నియమించుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు అజీజ్ బాయ్, తిరుపతి, గణపురం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణమస్తు.. నిధులు మస్తు మస్తు

- 'గ్రీన్ చానల్'లోకి కల్యాణలక్ష్మి, షాదీముబారక్
- ప్రతిపాదించిన బీసీ సంక్షేమ శాఖ

**సాక్షి, హైదరాబాద్:** కల్యాణ కానుక జాప్యానికి త్వరలో తెరపడనుంది. ఇకపై పెళ్లైన వెంటనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం రూ.1,00,116 ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి ఆయా సంక్షేమ శాఖల ద్వారా దీన్ని పంపిణీ చేస్తోంది. గత కొంత కాలంగా కల్యాణ కానుక పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో ఏడాది దాటినా ఆర్థిక సాయం అందడం లేదు. ఇందుకు ప్రధానంగా దరఖాస్తుల పరిశీలన, అర్హుల నిర్ధారణలో జాప్యం జరుగుతుండటమే. మరోవైపు ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతోనూ ఈ పరిస్థితి నెలకొంటోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 62 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సంక్షేమ శాఖల లెక్కలు చెబుతున్నాయి.ఆర్థికసాయాన్ని అందించడంలో జాప్యం జరగడంతో లబ్ధిదారుల్లోనూ ఉత్సాహం తగ్గుతున్నట్లు యంత్రాంగం గుర్తించింది. దీంతో ఈ పథకాల కింద వచ్చిన దరఖాస్తుదారు అర్హత తేలిన వెంటనే సాయం అందించేలా ప్రభుత్వం కసరత్తు చేసింది. ఇందులో భాగంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను 'గ్రీన్‌చానల్'(నిరంతరాయ నిధులు) లోకి తీసుకురావాలని భావిస్తోంది.

**దరఖాస్తు ఓకే అయితే చాలు...**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోపే పరిష్కరించి అర్హులకు సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా చర్యలు చేపట్టిన యంత్రాంగం.. ఈ పథకాలను 'గ్రీన్‌చానల్'లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈమేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారులు పథకాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించి ప్రతిపాదనలు పంపారు. స్పందించిన ప్రభుత్వం అనుమతించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇది ఆచరణలోకి వస్తే ఈ పథకాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన వెంటనే నిధులను విడుదల చేసి లబ్ధిదారులకు అందించే వీలుంటుంది. త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# సెంచరీ కొట్టేశాయ్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని సర్వే ఫలితాల ఆధారంగా గరిష్ఠంగా వంద మార్కులు వేస్తారు. పూర్తి స్థాయి మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, నిర్వహణ, కమ్యూనిటీ సోక్ పిట్స్, కంపోస్టు పిట్స్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై అవగాహన పెంచడం, జియో ట్యాగింగ్ పరిశీలన వంటి అంశాలపై దేశంలోని మొత్తం 700 జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం ఈ సర్వే నిర్వహించింది. దేశంలోని ఎనిమిది జిల్లాలకు వందకు వంద మార్కులు వచ్చాయి. వీటిలో మన రాష్ట్రంలోని ఆరు జిల్లాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో గ్రామీణ కుటుంబాల సంఖ్య 42,33,614గా ఉంది. 2014 వరకు 11,56,286 కుటుంబాలకు మాత్రమే మరుగుదొడ్డి సౌకర్యం ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇప్పుడు వంద శాతం లక్ష్యం పూర్తయ్యింది. పెరిగిన కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా కొత్త మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని కేంద్ర ప్రభుత్వ సర్వేలో నమోదైంది.

**మిగతా జిల్లాల్లో అంతంతే...**

ఈ జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లలో 6 జిల్లాలు ప్రథమ స్థానంలో నిలవగా, మహబూబ్‌నగర్ 19, వనపర్తి జిల్లా 20 స్థానంతో సరిపెట్టుకున్నాయి. మిగతా జిల్లాల విషయానికొస్తే... ఖమ్మం–65, మేడ్చల్–75, జనగామ–86, గద్వాల–89, మంచిర్యాల–96, మెదక్–105, వరంగల్ రూరల్–108, సిద్దిపేట–143, నాగర్‌కర్నూల్–149, మిగతా జిల్లాలు 168 నుంచి 307 మధ్య ర్యాంకింగ్‌లు సాధించగా భూపాలపల్లి –530తో రాష్ట్రం నుంచి చివరిస్థానంలో నిలిచింది.

### అందరి కృషితోనే సాధ్యమైంది: ఎర్రబెల్లి



'స్వచ్ఛదర్పణ్'లో మన రాష్ట్రం మంచి పనితీరు కనబరిచినట్లు కేంద్ర ప్రభుత్వ సర్వేతో స్పష్టమైంది. జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఎనిమిది జిల్లాలు ఉంటే, వాటిలో తెలంగాణలోని ఆరు జిల్లాలు ఉండడం గర్వకారణం. సీఎం ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించాం. స్వచ్ఛదర్పన్‌లో తాజా ఫలితాలకోసం పనిచేసిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు , ఎంపీడీవోలు, ఉపాధి హామీ సిబ్బంది, డీఆర్డీఏ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అభినందనలు'అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు.

# 'ఆయుష్మాన్ భారత్'ను అడ్డుకోవడం తగదు

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్:** పేదలకు ఉచితంగా వైద్య ఆరోగ్య సదుపాయాన్ని కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకమైన 'ఆయుష్మాన్ భారత్'కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవడం తగదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పేదలకు రూ. 5లక్షల వరకు వైద్య ఖర్చులను భరించే ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు కాకుండా మోకాలడ్డుతోందని ఆరోపించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం కేంద్ర మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆరోగ్య శ్రీ కంటే మెరుగైన 'ఆయుష్మాన్ భారత్' ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలకు ఉచితంగా వైద్య సదుపాయాన్ని అందిస్తున్న ఈ పథకాన్ని అడ్డుకోవడం అంటే పేదలను వైద్యానికి దూరం చేయడమేనన్నారు. ప్రక్కనున్న ఏపీ, కర్ణాటక, తమిళనాడుతో పాటు అనేక రాష్ట్రాలు 'ఆయుష్మాన్ భారత్'అమలు చేస్తున్నాయన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే పేదలు ఆరోగ్యంగా జీవించడానికి వీలవుతుందన్నారు.



ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్‌లో పాల్గొని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కింద దేశంలో 10 కోట్ల మరుగుదొడ్లను కట్టించిందన్నారు. దేశంలో 18 వేల గ్రామాలకు కరెంట్ సదుపాయాన్ని కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని.. దీంతో పేదలు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యుద్ధప్రాతిపదిక పనులు పూర్తి చేయాలని కేంద్రమంత్రి అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానన్నారు. అంతకు ముందు కిషన్‌రెడ్డి చాచానెహ్రూనగర్‌లో మొక్కలు నాటారు. అనంతరం అక్కడి కమ్యూనిటీహాల్ వద్ద... బండమైసమ్మ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు టి.రాజశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్ పరువుపోయింది

## ఐరాసలో పాక్‌కు తోడురాని దేశాలు • కశ్మీర్ ద్వైపాక్షికమేనని స్పష్టీకరణ



ఐక్యరాజ్యసమితి

పాకిస్తాన్‌కు అంతర్జాతీయంగా మరోసారి భంగపాటు ఎదురైంది. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేయడంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి చెందిన 15 దేశాల రహస్య సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సంయుక్త ప్రకటన విడుదల చేయాలన్న చైనా ఒత్తిడిని యూఎన్ బేఖాతర్ చేసింది. భారత్, పాక్ దేశాల మధ్య ద్వైపాక్షికంగా పరిష్కారం కావల్సిన కశ్మీర్ అంశానికి అంతర్జాతీయ రంగు అద్దడానికి చైనాతో కలిసి పాక్ చేసిన కుయుక్తులు బెడిసికొట్టాయి. ఈ సమావేశం జరగడానికి ముందు ఐక్యరాజ్యసమితిలో చైనా రాయబారి ఝాంగ్ జన్, పాక్ రాయబారి మలీహా లోధిలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కశ్మీర్ అంశంపై ఒకదాని తర్వాత ఒకటి చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. కానీ సమావేశం ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆగస్టు మాసానికి భద్రతా మండలి అధినేతగా పోలండ్ అధ్యక్షుడు కొనసాగుతున్నారు. అందుకే కశ్మీర్ అంశంలో ఐరాస తరపున ఏదైనా ప్రకటన జారీ చేయాలని పోలండ్ అధ్యక్షుడిపై చైనా ఒత్తిడి తీసుకువచ్చింది. యూకే దానికి వంతపాడింది.



**ద్వైపాక్షిక సమస్యన్న మెజార్టీ దేశాలు..**

నాలుగ్గోడల మధ్య జరిగిన ఆ సమావేశం వివరాలు తెలిసిన కొన్ని వర్గాలు మీడియాతో పలు విషయాలు పంచుకున్నాయి. ఈ సమావేశంలో పాల్గొన్న మెజార్టీ సభ్య దేశాలు కశ్మీర్ అంశం ద్వైపాక్షిక అంశమని అందులో ఐరాస జోక్యం అనవసరమని అభిప్రాయపడ్డాయి. ఈ అంశంపై సమావేశాన్ని నిర్వహించమని చైనా చెప్పడాన్ని కొన్ని దేశాలు తప్పుపట్టాయి. 370 రద్దుతో భౌగోళికంగా మార్పులు చోటు చేసుకుంటాయన్న చైనా వాదనని కొట్టిపారేశాయి. చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడర్ (సీపీఈఎస్) ద్వారా మార్పులు వస్తున్నాయి కదాని దుయ్యబట్టాయి. చైనా తానేదైనా చేయదలచుకుంటే తమ దేశ అభిప్రాయంగా ప్రకటన అయినా ఇచ్చుకోవచ్చునని ఆ సమావేశంతో పాల్గొన్న ఇతర దేశాలు పేర్కొన్నాయి. కశ్మీర్ అంశంలో తలదూరిస్తే భారత్ వాదనలకు తమ దగ్గర సమాధానం లేదని యూఎన్ అభిప్రాయపడింది. సిమ్లా ఒప్పందానికి అనుగుణంగానే కశ్మీర్‌పై తాము నిర్ణయం తీసుకున్నామని భారత్ చెబుతోంది. అందుకే ఈ సమావేశానికి హాజరైన సభ్యదేశాలేవీ తమ వైఖరిని వెల్లడించడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. అందుకే ఈ సమావేశానికి సంబంధించి మినిట్స్ రికార్డు చేయలేదు. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దానినైనా పట్టించుకోవాలని సమావేశంలో చైనా వాదించింది. అయితే అమెరికా, ఫ్రాన్స్, రష్యా, డొమినికన్ రిపబ్లిక్, ఆఫ్రికా దేశాలన్నీ భారత్‌కు మద్దతుగా నిలిచాయి. ఫ్రాన్స్, రష్యాలు కశ్మీర్ సమస్య ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని సూచించాయి. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు ఆసియాకు మంచివి కావని ఇండోనేసియా సూచించింది.

### ఉగ్రవాదాన్ని నిరోధిస్తేనే చర్చలు

చైనా ఒత్తిడి మేరకు జరిగిన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం ముగిశాక యూఎన్‌లో పాక్, చైనా రాయబారులు మీడియాను తప్పించుకొని వెళ్లిపోయారు. కానీ యూఎన్‌లో భారత్ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ మాత్రం పాకిస్తాన్ జర్నలిస్టుల దగ్గరకు స్వయంగా వచ్చి స్నేహపూర్వకంగా కరచాలనం చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. ఒకవైపు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ భయోత్పాతం సృష్టిస్తూ ఉంటే ఏ దేశం కూడా చర్చలకు ముందుకు రాదని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద కార్యకలాపాలు మానుకుంటేనే భారత్ చర్చలకు ముందుకు వస్తుందని అక్బరుద్దీన్ స్పష్టం చేశారు. సిమ్లా ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని భారత్ ఎప్పుడో ప్రకటించిందని, పాక్ ప్రతిస్పందన కోసం వేచి చూస్తున్నట్టుగా ఒక ప్రశ్నకు సమాధానంగా సయ్యద్ చెప్పారు.



అక్బరుద్దీన్

# కశ్మీరంలో సడలుతున్న ఆంక్షలు

- పలుచోట్ల ప్రజల రాకపోకలు
- రేపటినుంచి పాఠశాలలు ప్రారంభం

**జమ్మూ/శ్రీనగర్:** కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. జమ్మూ, కశ్మీర్‌లోయలో ప్రజల రాకపోకలపై విధించిన ఆంక్షలను కేంద్రం శనివారం పాక్షికంగా సడలించింది. దీంతో పలువురు కశ్మీరీలు పక్క గ్రామాల్లోని తమ బంధువులు, కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఆంక్షలను సడలించినా భద్రతాబలగాలు అప్రమత్తంగా ఉన్నాయి. కశ్మీర్‌లోని 35 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆంక్షలను అధికారులు సడలించారు. కశ్మీర్ బయట ఉండే కుటుంబ సభ్యులతో ప్రజలు మాట్లాడేందుకు వీలుగా 17 టెలిఫోన్ ఎక్స్ఛేంజీల్లో సేవలను పునరుద్ధరించారు. ఈ విషయమై జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సాల్ మాట్లాడుతూ..‘కశ్మీర్ లోయలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి’ అని తెలిపారు. కాగా, ప్రభుత్వం ఆంక్షలు సవరించినా పలు పెట్రోల్ బంకులు, ఇతర మార్కెట్లు శనివారం కూడా మూతపడ్డాయి.



శ్రీనగర్‌లో ఫోన్ మాట్లాడుతున్న స్థానికులు

**ఇంటర్నెట్, టెలిఫోన్ సేవల పునరుద్ధరణ**

జమ్మూలో శనివారం 5జిల్లాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. ఈ విషయమై రాష్ట్ర డీజీపీ మాట్లాడుతూ..‘2జీ ఇంటర్నెట్ సర్వీసులను పునరుద్ధరించాం. ఈ సందర్భంగా ఇంటర్నెట్ సేవలను ఎవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం’ అని హెచ్చరించారు. ప్రస్తుతానికి త్రీజీ, 4జీ సేవలపై ఆంక్షలను సడలించడం లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఉగ్రవాదులు త్వరలోనే దాడిచేసే అవకాశముందని నిఘావర్గాల నుంచి తమకు సమాచారం అందిందని జమ్మూకశ్మీర్ సీఎస్ బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

**పాక్ కాల్పుల్లో జవాన్ మృతి**

కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో సరిహద్దులోని నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంట ఉన్న గ్రామాలు, భారత ఆర్మీ పోస్టులు లక్ష్యంగా పాక్ బుల్లెట్ల వర్షం కురిపించింది. ఈ దుర్ఘటనలో డెహ్రాడూన్‌కు చెందిన జవాన్ లాన్స్‌నాయక్ సందీప్ థాపా(35) తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. వెంటనే అప్రమత్తమైన భారత ఆర్మీ పాక్ దుశ్చర్యను దీటుగా తిప్పికొట్టిందని ఆర్మీ అధికార ప్రతినిధి శనివారం మీడియాకు చెప్పారు.

### భారత్ మాపై దాడి చేయొచ్చు

**ఇస్లామాబాద్:** కశ్మీర్ సమస్య నుంచి అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించేందుకు భారత్ తమపై దాడిచేసే అవకాశముందని పాకిస్తాన్ ప్రకటించింది. భారత్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా దీటుగా తిప్పికొడతామని హెచ్చరించింది. మొదటగా అణ్వాయుధాలను ప్రయోగించరాదన్న విధానానికి కట్టుబడి ఉన్నామనీ, అయితే భవిష్యత్తు పరిస్థితుల దృష్ట్యా ఇది మారవచ్చుని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్తాన్ ఈ మేరకు స్పందించింది. పాక్ విదేశాంగ మంత్రి, ఆర్మీ ప్రతినిధి ఆసిఫ్ గఫూర్ శనివారం సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ..‘భారత్ ఎలాంటి దాడిచేసినా తిప్పికొట్టేందుకు ఎల్వోసీ వెంట పాక్ బలగాలను సిద్ధంగా ఉంచాం’అని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఖురేషీ

**‘కశ్మీర్ సెల్’ ఏర్పాటు**

అణ్వాయుధాల ప్రయోగంపై రాజ్‌నాథ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ విమర్శించారు. ‘భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో రాజ్‌నాథ్ ఈ ప్రకటన చేయడం నిజంగా దురదృష్టకరం. భారత్ యుద్ధోన్మాదంతో ఉందనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. పాక్ విదేశాంగ శాఖలో కశ్మీర్ విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నాం. కశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా, సమాచారాన్ని చేరవేసేందుకు రాయబారుల్ని నియమిస్తాం’అని ఖురేషీ చెప్పారు.

## క్లుప్తంగా...

### ముగిసిన కోనేటిరాయుడి ఉత్సవం



**కాంచీపురం(తిరుత్తణి):** తమిళనాడులోని కాంచీపురంలో 48 రోజుల పాటు సాగిన అత్తివరదరాజస్వామి మహోత్సవ వైభవం శనివారంతో ముగిసింది. రాత్రి పది గంటల సమయంలో అత్తివరదరాజస్వామి అనంత సరస్సులోకి ప్రవేశించారు. మళ్లీ స్వామిని ప్రత్యక్షంగా దర్శించుకోవాలంటే మరో 40 ఏళ్లు వేచి ఉండాల్సిందే. స్వామి సరస్సులోనికి ప్రవేశించడాన్ని చూసేందుకు భక్తులు భారీ స్థాయిలో వచ్చారు.

### 261 కోట్ల ఆస్తుల అటాచ్

**న్యూఢిల్లీ:** హరియాణాకు చెందిన ఓ మల్టీ లెవల్ మార్కెటింగ్ సంస్థ ఫ్యూచర్ మేకర్ లైఫ్ కేర్ సంస్థ మనీల్యాండరింగ్ కేసులో ఆ సంస్థకు చెందిన రూ. 261 కోట్లను ఈడీ శనివారం అటాచ్ చేసుకుంది. ఈ సంస్థ పోంజి పథకం పేరుతో పెట్టుబడిదారులను మోసగించిందన్న ఆరోపణలపై ఈడీ విచారణ చేపట్టింది. సంస్థకు చెందిన ప్లాట్లు, వ్యవసాయ భూములు, ఇళ్లను అటాచ్ చేసుకుంటున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్లు రాధే శ్యామ్, బన్సీలాల్‌లకు ఈడీ నోటీసులు జారీ చేసింది. హిస్సార్, అదమ్‌పూర్, కులమ్, ఢిల్లీ, చండీగఢ్‌లో ఉన్న 16 స్థిరాస్తులతో పాటుగా సంస్థకు చెందిన బ్యాంకు అకౌంట్లలోని రూ.252 కోట్లను ఈడీ అటాచ్ చేసుకుంది.

### శబరిమల ప్రధాన అర్చకుడిగా సుధీర్



**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి కొత్త ప్రధానార్చకుడు నియమితులయ్యారు. మలప్పురం జిల్లాలోని తిరునవయాకు చెందిన ఏకే సుధీర్ నంబూద్రి కొత్త ప్రధానార్చకుడిగా ఎంపికయ్యారు. ఈయన నవంబర్ 17 నుంచి ఏడాదిపాటు కొనసాగనున్నారు. మలయాళ నెల చింగోమ్ సందర్భంగా శబరిమలలో ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలను శనివారం ప్రారంభించారు. 21న ఆలయం మూసేస్తారు.

### ఫిజీ సాహసయాత్రకు భారత కవలలు

**డెహ్రాడూన్:** రానున్న సంవత్సరం ఫిజీ ద్వీపాల్లో సాహసయాత్ర జరగనుంది. ఈ కఠినమైన ‘ఎకో చాలెంజ్ ఫిజీ’ యాత్రకు డెహ్రాడూన్‌కు చెందిన కవలలు, సాహస యాత్రికులు తషి మాలిక్, నుంగ్షి మాలిక్‌లు ఎంపికయ్యారు. వీరు ఇప్పటికే ఎవరెస్టుతో పాటు ఏడు పర్వతాలను అధిరోహించిన కవల సోదరీమణులుగా ఖ్యాతిచెందారు. దక్షిణాసియా నుంచి ఫిజీ యాత్రకు వ్యక్తులు ఎంపిక కావడం ఇదే ప్రథమం.

### సంస్కృతం సైంటిఫిక్ భాష అని నిరూపించండి

**న్యూఢిల్లీ:** సంస్కృతాన్ని సైంటిఫిక్ భాషగా నిరూపించే భారం ఇప్పుడు ప్రతిష్టాత్మక విద్య సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల మీద పడింది. మానవ వనరులు, అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ సంస్కృతాన్ని శాస్త్రీయ భాషగా నిరూపించాల్సిందిగా ఐఐటీ, ఎన్ఐటీల డైరెక్టర్లు, చైర్మన్లను కోరారు. దీన్ని కంప్యూటర్లలో కోడింగ్ చేయగలిగితే, ప్రపంచంలోనే అత్యంత సైంటిఫిక్ భాషగా నిలుస్తుందని నాసా తెలిపిందని అన్నారు.



ఇండోనేసియా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జకార్తాలోని ఓ సముద్రతీరంలో నిర్వహించిన బహుమతుల వెరైటీ పోటీ ఇది. చాలా నునుపైన పొడవాటి కర్రకు గ్రీజ్ పూసి.. కర్ర చివరన బహుమతులను వేలాడదీస్తారు. పైదాక ఎగబాకిన వారికే ఆ బహుమతులు

# కర్ణాటకలో హైఅలర్ట్!

**ఉగ్ర ముప్పుందని నిఘావర్గాల హెచ్చరిక**

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలోని ప్రధాన పట్టణాల్లో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో తీవ్ర విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు సిద్ధమయ్యారని నిఘావర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో కర్ణాటక పోలీసులు అప్రమత్తమయ్యారు. బెంగళూరుతో పాటు కలబురిగి, రాయచూర్, చిత్రదుర్గ, మంగళూరు, ఉడిపి, మైసూరు, తుమకూరు సహా ముఖ్యమైన పట్టణాల్లో భారీగా పోలీసులను మోహరించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, షాపింగ్‌మాల్స్, మార్కెట్లు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ విషయమై పోలీస్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ..‘ఉగ్రవాదులు కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా అలజడి సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు నిఘావర్గాలు హెచ్చరించాయి. ఇందులో భాగంగా జనసమ్మర్ద ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులుచేసే అవకాశముందని చెప్పాయి’ అని అన్నారు.



బెంగళూరులో అప్రమత్తంగా సైనికుడు

### కల్బుర్గీ హత్య కేసులో చార్జిషీట్

హేతువాదులు కల్బుర్గీ, గౌరీ లంకేశ్‌ల హత్య కేసులో కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ శనివారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. షూటర్ గణేశ్ మిస్కిన్, అమోల్ కాలే, ప్రవీణ్‌ప్రకాశ్, వసుదేవ్ భగవాన్, శరద్ కలస్కర్, అమిత్ రామచంద్ర వీరి హత్యలకు కుట్రపన్నారని సిట్ తెలిపింది. హిందూ అతివాద గ్రూపు ‘సనాతన సంస్థ’ ప్రచురించిన ‘క్షాత్ర ధర్మ సాధన’ అనే పుస్తకంతో వీరంతా స్ఫూర్తి పొందారంది. 2014, జూన్ 9న మూఢనమ్మకాలపై కల్బుర్గీ ఇచ్చిన ప్రసంగంతో ఆయన్ను చంపాలని ఈ బృందం నిర్ణయించుకుందని పేర్కొంది. అనుకున్నట్లుగానే ఓ తుపాకీని సేకరించి తర్ఫీదు పొందారనీ, దాడికోసం బైక్‌ను దొంగిలించారని సిట్ చెప్పింది. కల్బుర్గిని ఇంట్లోనే మిస్కిన్ కాల్చిచంపాడని తెలిపింది.

# విషమంగానే జైట్లీ ఆరోగ్యం

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు అరుణ్ జైట్లీ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన లైఫ్ సపోర్ట్ సిస్టంపై ఉన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ఆయన్ను పర్యవేక్షిస్తున్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శనివారం జైట్లీని పరామర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ సింఘ్వీ, జ్యోతిరాదిత్య సింధియా, ఎయిర్ ఫోర్స్ చీఫ్ ధనోవా ఆసుపత్రికి వచ్చారు. శ్వాసకోశ సంబంధిత అనారోగ్యంతో ఈ నెల 9న ఆయన ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఆగస్టు 10 తర్వాత ఆయన ఆరోగ్యం గురించి ఎయిమ్స్ ఎలాంటి బులెటిన్ విడుదల చేయలేదు. ఇప్పటికే రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాన మంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా జైట్లీని పరామర్శించారు.

**ఎయిమ్స్‌లో అగ్ని ప్రమాదం..**

ఎయిమ్స్‌లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. 34 అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పేందుకు శ్రమించాయి. ప్రమాద సమయంలో ఎయిమ్స్‌లో ఉన్న రోగులు, వారి బంధువులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని ఎమర్జెన్సీ సర్వీసులకు విఘాతం కలిగిందని రోగుల బంధువులు అన్నారు. మంటలు చెలరేగిన పై అంతస్తులో ఉన్న కొందరు రోగులను వేరే భవనానికి తరలించారు. టీచింగ్ భవనంలో విద్యుత్ సంబంధిత పనులు జరుతుగున్న మైక్రోబయాలజీలోని వైరాలజీ యూనిట్‌లో మంటలు ప్రారంభం అయినట్లు అధికారులు గుర్తించారు.



ఎయిమ్స్ నుంచి వెలువడుతున్న పొగ

### 20న యెడ్డీ కేబినెట్ విస్తరణ



**బెంగళూరు:** కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణకు సిద్ధమైంది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మంత్రివర్గ విస్తరణకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ నెల 20న మంత్రివర్గ విస్తరణ చేపడతామని కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప తెలిపారు. ‘విధానసౌధలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు బీజేపీ శాసన సభాపక్ష భేటీ జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం కేబినెట్ విస్తరణ ఉంటుంది’ అని యడియూరప్ప చెప్పారు. కర్ణాటక అసెంబ్లీలో సభ్యుల సంఖ్యను బట్టి మొత్తం 34 మందిని మంత్రులుగా నియమించేందుకు వీలుంది. అయితే యెడ్డీ తన తొలి కేబినెట్‌లో 13 మంది మంత్రులను మాత్రమే తీసుకునే అవకాశముందని బీజేపీ వర్గాలు తెలిపాయి. మిగతా ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని వెల్లడించాయి. కర్ణాటక ముఖ్యమంత్రిగా జూలై 26న ప్రమాణస్వీకారం చేసిన యడియూరప్ప ఇప్పటివరకూ కేబినెట్‌లోకి ఎవ్వరినీ తీసుకోలేదు.

# న్యాయవ్యవస్థలో స్థిరపడాలి

- ‘లా’ విద్యార్థులు ఇతర రంగాలవైపు చూస్తున్నారు
- సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్

**న్యూఢిల్లీ:** న్యాయవిద్య అభ్యసించిన చాలామంది యువతీయువకులు న్యాయవ్యవస్థలో కాకుండా ఇతర రంగాల్లో స్థిరపడుతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తెలిపారు. ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముందని జస్టిస్ రంజన్ గొగోయ్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో శనివారం జరిగిన నేషనల్ లా యూనివర్సిటీ 7వ స్నాతకోత్సవంలో జస్టిస్ గొగోయ్ ప్రత్యేక ప్రసంగం చేశారు. ‘లాయర్ల పాత్ర, పనితీరును మనం పరిశీలించాల్సిన అవసరముంది. న్యాయ రంగంలో గొప్ప అవకాశాలు, ఆకర్షణ ఉన్నప్పటికీ న్యాయవిద్యను అభ్యసించినవారిలో చాలామంది ఇతర రంగాల్లో స్థిరపడుతున్నారు. చాలామంది న్యాయవాదులు మధ్యవర్తులుగా, ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చేవారిగా, న్యాయాధికారులుగా, సలహాదారులుగా సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతకాలంలో కార్పొరేట్ న్యాయవాదుల కెరీర్ చాలా ఆకర్షణీయంగా మారింది. ఇందులోని ఆర్థిక మూలాలకు నేను పోదల్చుకోలేదు. అదే సమయంలో బార్, బెంచ్‌లోని ఆసక్తికరమైన బాధ్యతలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరముంది. నేను బార్, బెంచ్‌లో 20 ఏళ్ల పాటు పని చేశా. ఇక్కడ పని కారణంగా దొరికే సంతృప్తి చాలాఎక్కువ. ప్రస్తుతం మనం అందిస్తున్న ఐదేళ్ల ‘లా’ డిగ్రీ కోర్సును సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ పద్ధతి అనుకున్నంతగా విజయవంతం కాలేదు. అదే సమయంలో పూర్తిగా విఫలం కూడా కాలేదు. బార్ వ్యవస్థను పటిష్టం చేసేందుకే ‘లా’ స్కూళ్లను ఏర్పాటుచేశాం. ప్రస్తుతం ఎన్ని ‘లా’ స్కూళ్లు తమ ఏర్పాటు వెనుకున్న లక్ష్యాన్ని అందుకుంటున్నాయి? ఈ విషయమై బార్ విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి’ అని వ్యాఖ్యానించారు.



# భూటాన్ విశ్వసనీయ పొరుగుదేశం

- ఆ దేశాభివృద్ధికి భారత్ కట్టుబడి ఉంది: ప్రధాని మోదీ
- పది ఒప్పందాలపై సంతకాలు

**పారో/థింపూ:** భూటాన్ భారత్‌కు ఎప్పుడూ విశ్వసనీయ పొరుగుదేశమేనని ప్రధాని మోదీ చెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మోదీ శనివారం భూటాన్ చేరుకున్నారు. ఆ దేశ ప్రధాని లోటే షెరింగ్, మంత్రివర్గ సభ్యులతో కలసి మోదీకి పారొలోని విమానాశ్రయంలో స్వాగతం పలికారు. తర్వాత ఇరువురు ప్రధానులు కలసి పలు అంశాలపై విస్తృత చర్చలు జరిపారు. అనేక రంగాలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని విస్తరించే దిశగా చర్చలు కొనసాగించారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత మెరుగుపరచడానికి గొప్ప అవకాశాలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. ‘భూటాన్ అభివృద్ధిలో భారత్ ప్రధాన భాగస్వామి కావడం ఒక విశేషం. భూటాన్ పంచవర్ష ప్రణాళికలలో భారత్ సహకారం ఇకపైన కూడా కొనసాగుతుంది’ అని మోదీ అన్నారు. అంతరిక్ష పరిశోధన, విమానయానం, ఐటీ, విద్యుత్, విద్యారంగానికి సంబంధించి ఇరు దేశాలు 10 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. మోదీ దేశ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్‌తో కూడా భేటీ అయ్యారు.

**రూపే కార్డును ప్రారంభించిన మోదీ**

భూటాన్‌లో దక్షిణాసియా ఉపగ్రహ వినియోగం కోసం ఇస్రో సహాయంతో అభివృద్ధి చేసిన గ్రౌండ్ ఎర్త్ స్టేషన్, సాట్కామ్ నెట్‌వర్క్‌ను మోదీ, షెరింగ్ కలిసి ప్రారంభించారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా భూటాన్ అభివృద్ధికి భారతదేశం కట్టుబడి ఉందని మోదీ చెప్పారు. సిమ్తోఖా జొంగ్ వద్ద భూటాన్‌లో రూపే పే కార్డును మోదీ ప్రారంభించారు. ‘భూటాన్‌లో రూపే పే కార్డును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధానం డిజిటల్ చెల్లింపులు, వాణిజ్యం, పర్యాటక రంగంలో ఇరుదేశాల సంబంధాన్ని మరింత మెరుగుపరుస్తుందని భావిస్తున్నాను’ అని వెల్లడించారు. మాంగ్దేచు జలవిద్యుత్ కర్మాగారాన్ని ప్రారంభించిన మోదీ, ఐదు దశాబ్దాల భారత–భూటాన్ జలవిద్యుత్ సహకారాన్ని గుర్తుచేసే స్టాంపులను కూడా విడుదలచేశారు. మోదీ ఎయిర్‌పోర్ట్ నుంచి రాజధాని థింపూకి వెళ్తున్నప్పుడు ప్రజలు త్రివర్ణ పతాకాలు ఊపుతూ దారిపొడవునా మోదీకి స్వాగతంపలికారని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చెప్పారు.



ఎయిర్‌పోర్టులో మోదీకి ఘన స్వాగతం పలికి వెంట తీసుకెళ్తున్న భూటాన్ ప్రధాని షెరింగ్

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి, బ.తదియ రా.10.08 వరకు తదుపరి, చవితి, నక్షత్రం పూర్వాభాద్ర ప.3.21 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర వర్జ్యం రా.1.54 నుంచి 3.41 వరకు దుర్ముహూర్తం సా.4.41 నుంచి 5.32 వరకు, అమృతఘడియలు.. ఉ.6.28 నుంచి 8.03 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఇమ్రాన్ ఖాన్ (పాక్ ప్రధాని)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తలనొప్పిగా ఉంది! అరవై ఆరేళ్ల వయసులో తలనొప్పి రావడం సహజమా అసహజమా కనుక్కొని రమ్మని డాక్టర్ దగ్గరికి మనిషిని పంపాను. ఆ మనిషి ఇంతవరకు రాలేదు.

"ఎవరి కోసం చూస్తున్నారు ఇమ్రాన్‌జీ" అంటూ వచ్చారు షా మెహమూద్ ఖురేషీ.

"మీరు ఫారిన్ అఫైర్స్ మినిస్టర్ కదా షాజీ.. ఇంటర్నల్ ఇష్యూస్ చెప్పుకోవడం బాగుంటుందా మరి?" అన్నాను.

"నేను చూసేది ఫారిన్ అఫైర్సే అయినా, అవన్నీ ఇంటర్నల్ అఫైర్స్ కోసమే ఇమ్రాన్‌జీ.. పర్వాలేదు చెప్పండి" అన్నారు.

"అరవై ఆరేళ్ల వయసులో తలనొప్పి రావడం సహజమా అసహజమా కనుక్కొని రమ్మని డాక్టర్ దగ్గరికి మనిషిని పంపాను షాజీ. ఇంతవరకు ఆ మనిషి రాలేదు. రాని మనిషి గురించి ఆలోచిస్తూ, వచ్చిన తలనొప్పిని మర్చిపోగలుగుతున్నాను కానీ.. మనిషి రాలేదేమిటన్న ఆలోచనతో తిరిగి నా తలనొప్పి నాకు గుర్తుకువచ్చేస్తోంది" అన్నాను.

నాకంటే మూడేళ్లు చిన్నవాడు ఖురేషీ. కానీ నాకన్నా పదేళ్లు చిన్నవాడిలా ఉంటాడు. అది కాదు ఆశ్చర్యం, ఫారిన్ మంత్రిగా అతడు ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఎలా ఉన్నాడో, పన్నెండు నెలల తర్వాత ఇప్పుడూ అలానే ఉన్నాడు! ఆరోజే అడిగాను.. 'షాజీ.. మీరింత ఫిట్‌గా ఎలా ఉండగలుగుతున్నారు?' అని. పెద్దగా నవ్వాడు. 'ఇమ్రాన్‌జీ, ఒకటి చెప్పమంటారా.. క్రికెట్ ఆడేవాళ్ల కన్నా క్రికెట్ చూసేవాళ్లే ఎప్పుడూ ఫిట్‌గా ఉంటారు. ఇప్పటికీ నేను ఇండియా మీద మీరు ఆడిన పాత మ్యాచ్‌లన్నిటినీ రీప్లే చేసుకుని మరీ చూస్తుంటాను' అన్నాడు! మనసుని రంజింపజేయడంలో ఖురేషీ గొప్ప ఆటగాడు.



"తలనొప్పి కశ్మీర్ వంటిది ఇమ్రాన్‌జీ. ఉందని గుర్తు చేసుకుంటే వస్తుంది. లేదని గుర్తు పెట్టుకుంటే గాయబ్ అవుతుంది" అన్నారు ఖురేషీ.

"ఈ గుర్తుపెట్టుకోవడమే పెద్ద తలనొప్పిగా ఉంది షాజీ. అయినా లేని దానిని ఉందని గుర్తుపెట్టుకోగలం కానీ, ఉన్నదానిని లేదని ఎలా గుర్తుపెట్టుకోగలం చెప్పండి?" అన్నాను.

"తలనొప్పి కశ్మీర్ వంటిది అంటే, కశ్మీర్ తలనొప్పి వంటిదని కాదు ఇమ్రాన్‌జీ. ఉన్నదానిని లేదని గుర్తుపెట్టుకునే అవసరం లేకున్నా, లేనిదానిని ఉందని గుర్తుపెట్టుకోవడం మర్చిపోలేదన్న సంగతిని గుర్తు చేస్తుండడం అవసరం. కశ్మీర్‌ను మన తల అనుకున్నప్పుడు ఆమాత్రం తలనొప్పి సహజమే. నా ఉద్దేశం మీ తలనొప్పి మీ అరవై ఆరేళ్ల వయసు వల్ల వస్తున్నది కాదు. డెబ్బయ్ రెండేళ్ల కశ్మీర్ వల్ల వస్తున్నది" అన్నారు ఖురేషీ!

'హహ్హహా' అని పెద్దగా నవ్వాను.

"అంటే నేను వయసుకు మించిన భారాన్ని మోస్తున్నాననే కదా షాజీ" అన్నాను.

"మీరు గుండెల నిండా నవ్వడం చాలా రోజుల తర్వాత చూస్తున్నాను ఇమ్రాన్‌జీ! మీకు గుర్తుందా.. ఏడాది క్రితం సరిగ్గా ఇదే నెలలో మీరు ప్రధాని అయ్యారు. ఆరోజు చూడ్డమే చిన్న చిరునవ్వునైనా మీలో! మళ్లీ లేదు" అన్నారు ఖురేషీ.

"ధన్యవాదాలు షాజీ" అన్నాను.

ఎప్పుడూ కశ్మీర్ గురించే కాకుండా, పాక్ ప్రధాని సంతోషం గురించి కూడా కాస్త ఆలోచించే ఒక పౌరుడిని నా దేశంలో నేను మొదటిసారిగా చూస్తున్నాను!

డాక్టర్ దగ్గరికి వెళ్లిన మనిషి ఇంకా రాలేదు! ఖురేషీతో మాట్లాడుతుంటే తలనొప్పి తగ్గినట్లే ఉంది కానీ, ఖురేషీ వెళ్లిపోయాక మళ్లీ తలనొప్పి వస్తే?!

"మీరే డాక్టర్ దగ్గరికి వెళ్లవలసింది ఇమ్రాన్‌జీ. లేదా, డాక్టర్‌నే మీ దగ్గరికి రప్పించుకోవలసింది. మీరు పంపిన మనిషికి మీ తలనొప్పి సంగతి గుర్తుంటుందని ఎలా చెప్పగలం? అతడికేం తలనొప్పులున్నాయో.." అన్నారు ఖురేషీ.

కశ్మీర్ విషయం ఐక్యరాజ్య సమితితో మాట్లాడమని నేను చైనాను పంపడం గురించి కాదు కదా ఖురేషీ మాట్లాడుతున్నది!!

# బివేర్ ఆఫ్ ఫిల్టర్ న్యూస్!

## జనతంత్రం


వర్ధెల్లి మురళి




బహుపరాక్!

ఇందుమూలముగా యావన్మంది తెలుగు ప్రజలకు, మిక్కిలి విశేషించి ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులకు చేయంగల విన్నపముతో కూడిన హెచ్చరిక. పూర్వ కాలములో కలరా, మశూచి, ప్లేగు వంటి వ్యాధులు ప్రబలిన చందంగా, ఇప్పుడు డెంగీ, చికున్‌గున్యా వగైరా గాలిరోగాలు, అంటురోగాలు వ్యాపిస్తున్న తీరుగా, వాటి కంటే వేగంగా, ప్రమాదకరంగా ఇప్పుడు 'ఫిల్టర్ వార్తల' మహమ్మారి దేశాన్ని చుట్టబెడుతున్నది. మిగతా దేశంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలకు సంబంధించి ఈ వ్యాధి ప్రమాదకర స్థాయిలో ప్రయాణిస్తున్నది. సుప్రసిద్ధ అమెరికన్ తత్వవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి నోమ్ చామ్‌స్కీ దాదాపు మూడు దశాబ్దాలకు పూర్వం ఒక సిద్ధాంతాన్ని రూపొందించాడు. అదే మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ కన్సెంట్ (manufacturing of consent). అప్పటి ప్రసార సాధనాలు ప్రభుత్వాలకు అనుకూలంగానో, లేదా కొన్ని వ్యవస్థలకు అనుకూలంగానో ప్రజాభిప్రాయాన్ని మలచడానికి వ్యవహరిస్తున్న తీరును వర్ణిస్తూ 'ప్రసార మాధ్యమాలు ప్రజల అంగీకారాన్ని ఉత్పత్తి చేస్తున్నాయ'నే నిర్ధారణకు ఆయన వచ్చారు. వార్తలనూ విశేషాలనూ ఐదు రకాల ఫిల్టర్ల ద్వారా వడబోసి ప్రజలకు అందజేస్తున్నాయని ఆయన నిరూపించారు. ఇప్పుడా విద్యను గొప్ప కళాత్మకంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేసిన ఘనత మాత్రం తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. అమెరికాలో ఫిల్టర్ న్యూస్ బండారాన్ని నోమ్ చామ్‌స్కీ బయటపెట్టే నాటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ దానిని ఆచరణలో పెట్టింది. బీజేపీ వంటి జాతీయ పార్టీ కూడా తెలుగుదేశం స్ఫూర్తితోనే ఆ విద్య నేర్చుకుని ఇప్పుడు జాతీయ స్థాయిలో తనదైన శైలిలో జనసమ్మతిని ఉత్పత్తి చేసే కార్యక్రమం అమలు చేస్తున్నదని అభిజ్ఞులు చెబుతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటినుంచీ ప్రసార మాధ్యమాలు తెలుగుదేశం పార్టీ రంగును అది పుట్టినప్పటినుంచీ పులుముకున్నాయి. తెలుగు పత్రికల సంఖ్యలోనూ, వార్తా చానళ్లలోనూ, ఇంటర్నెట్ ఎడిషన్లలోనూ భీముని వాటా తెలుగుదేశం పార్టీదే. ప్రసార సాధనాలు ఉత్పత్తి చేసిన ప్రజాభిప్రాయం ఆధారంగానే మనుగడ సాగించిన అనుభవం కారణంగా, సోషల్ మీడియా విప్లవాన్ని కూడా అందరికంటే ముందుగానే ఆ పార్టీ అందిపుచ్చుకుంది. వందలాదిమంది పనిచేసే ఒక కార్ఖానానే తెరిచి 'ఫిల్టర్' న్యూస్ ప్రచార కార్యక్రమాన్ని ఆ పార్టీ చేపట్టినట్టు భోగట్టా. మొన్నటి ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లు, 22 లోక్‌సభ సీట్లు గెలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకీ – 23 అసెంబ్లీ సీట్లూ, 3 లోక్‌సభ సీట్లూ గెలిచిన తెలుగుదేశం పార్టీకి ఏ నిష్పత్తిలో ప్రసార సాధనాల్లో ప్రచారం లభిస్తుందో చూస్తే చాలు. యెల్లో ఫిల్టర్ల ప్రభావం మన మీడియా మీద ఎంతుందో చెప్పవచ్చు. జరిగింది జరగనట్టుగా, జరగనిది జరిగినట్టుగా చూపగలిగే ఫిల్టర్లనూ వాడుతున్నారు. వాస్తవాలను 180 డిగ్రీల కోణంలో చూపే ఫిల్టర్లు తెలుగు మీడియాలో సర్వసాధారణం. తొలిపొద్దు సిగలో పూచిన సిందూర వర్ణాన్ని ఆకాశంలో జరిగిన రక్తపాతంగా ఈ ఫిల్టర్లు చూపగలవు. చినుకు తడికి పులకించిన మృత్తిక వెలువరించే సుగంధ పరిమళాన్ని దుర్గంధంగా వ్యాప్తి చేయగల ప్రతిభ ఈ ఫిల్టర్ల సొంతం.

ఒకసారి నిన్నటి కరకట్ట సీన్ సంగతి చూద్దాం. హరిశ్చంద్ర నాటకంలో 'కాటికాపరి' సీన్ స్థాయిలో రక్తికట్టించేందుకు తెలుగుదేశం పార్టీ చేసిన ప్రయత్నం, అందుకు అవిశ్రాంతంగా తోడ్పాటునందించిన మీడియా ఫిల్టర్ న్యూస్ వల్ల అసలు దోషి అటకెక్కి దాక్కోగలిగాడు. హరిశ్చంద్ర నాటకంలోనే ఒక పద్యం ఉంటుంది. విధి ఎంత బలీయమైనదో వర్ణిస్తూ 'రాజే కింకరుడగున్... కింకరుడే రాజగున్' అంటూ కొండంత రాగంతో హరిశ్చంద్రుడు ఆలపిస్తాడు. నిన్నటి కరకట్ట సీన్, అందులో మీడియా పోషించిన పాత్ర చూసిన తర్వాత 'ఔరా... మీడియా ఎంత బలీయమైనది? రాజే కింకరుడాయెను... కింకరుడే రాజాయెను' అనే రాగం అందుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పశ్చిమ కనుమలతోపాటు, కర్ణాటక, మహారాష్ట్రలలో కురిసిన భారీ వర్షాల పుణ్యమా అని పదేళ్ల తర్వాత బిరబిరా కదిలేటి నిండైన కృష్ణవేణిని చూడగలిగాము. ఈ సందర్భంగా ప్రధాన వార్తాంశం కావలసిన విషయం మన ఇంజనీర్లు, అధికారులు పోషించిన అద్భుతమైన పాత్ర. రెండు రాష్ట్రాలూ సమన్వయంతో వరదను నియంత్రించిన తీరు ప్రశంసనీయం. వరద కారణంగా ఎక్కడా భారీ నష్టాలు కలుగకుండా ఒకపక్క జాగ్రత్త పడుతూనే, వరదనీటిని గరిష్ట స్థాయిలో ఒడిసిపట్టడంకోసం వ్యూహాత్మకంగా వ్యవహరించారు. శ్రీశైలం నుంచి రాయలసీమకు నీటిని అందించే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ క్రస్ట్ లెవల్ 840 అడుగుల వద్ద ఉంది. 854 అడుగులకు నీరు చేరితేనే రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లివ్వడం కుదురుతుంది. ఆగస్టు ఆరో తేదీనాడు నీటిమట్టం ఆ ఎత్తుకు చేరింది. అదేరోజున హంద్రీ–నీవా కాలువకు మల్యాల లిఫ్ట్ ద్వారా నీరందించారు. ఏడో తేదీ నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా తెలుగుగంగ, ఎస్సార్‌బీసీ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 860 అడుగులకు చేరగానే విద్యుదుత్పత్తి చేస్తూ ఆరో తేదీనుంచే నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేయడం ప్రారంభించారు. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు. 510 అడుగుల మట్టాన్ని దాటితేనే కుడి, ఎడమ కాల్వలకు నీళ్లిచ్చే పరిస్థితి ఉంటుంది. ఆగస్టు ఎనిమిదో తేదీనాడు వరద అక్కడిదాకా వచ్చింది. ఎన్నో ఏళ్లుగా సాగర్ నీళ్లకోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న రైతులకోసం రెండు కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తూనే పైనుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని సాగర్ గేట్లను తెరిచారు. పులిచింతల దిగువన ముంపు సమస్య పెరగకుండా నియంత్రిస్తూనే తొలిసారిగా భవిష్యత్తు అవసరాలకోసం ఆ ప్రాజెక్టులో సుమారు 30 టీఎమ్‌సీలను నిలబెట్టే విధంగా చాకచక్యంగా వ్యవహరించారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి ప్రవాహం లెక్కలు తెప్పించుకుంటూ ప్రకాశం బ్యారేజీ ఎగువన, దిగువన వున్న పరిస్థితులను అంచనా వేసుకుని ముంపు ప్రాంత ప్రజలకు రక్షణ ఏర్పాట్లు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు నిర్వహించిన చురుకైన పాత్ర మీడియాలో ప్రధానాంశం కావలసింది. కానీ ఈ కోణాన్ని పూర్తిగా విస్మరించిన మీడియా, వరద పరిస్థితిని చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరాపై తెలుగుదేశం పార్టీ ప్రదర్శించిన కరకట్ట వీధి నాటకాన్ని రోజంతా అలుపు లేకుండా చూపెట్టింది. ఆ డ్రోన్ కెమెరా చంద్రబాబు ఇంటి సమీపంలో కూడా ఎగిరిందట. అదీ రాద్ధాంతం. నదిలో వరద పరిస్థితిని ఫోటోలు తీస్తున్న డ్రోన్, నది అంచున ఇళ్ల ముందు ఎగరదా మరి? చంద్రబాబు నివసించే ఇంటితోపాటు మరో 32 అక్రమ నిర్మాణాలు అక్కడున్నాయని చెబుతున్నారు. ఆ ఇళ్ల ముందునుంచి కూడా డ్రోన్ వెళ్లే వుంటుంది. ఈ ఒక్క సాకుతో చంద్రబాబు ఇంటిపై దాడి చేసేందుకు కుట్ర జరుగుతోందనే స్థాయిలో ఓ దృశ్యమాలికను తెలుగుదేశం పార్టీ రచించడం, 'నా భద్రతనే ప్రశ్నార్థకం చేస్తారా' అని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆక్రోశించడం మీడియాలో ప్రధానాంశాలయ్యాయి. ప్రభుత్వం కావాలనే తన ఇంటిపైకి వరదను పురికొల్పిందనే మరో విచిత్రమైన ఆరోపణను తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చేశారు. రెయిన్ గన్‌లతో కరువును జయించే సాంకేతిక సామర్థ్యం, తరుముకొచ్చే తుపానులను ఆగిపొమ్మని ఆదేశించే తపోబలం అందరికీ ఉండదు. అలాగే, ఒక ఇంటిమీద దాడికోసం వరదను మళ్లించడం కూడా అందరికీ సాధ్యమయ్యే పని కాదు. లక్షలాది మంది రాయలసీమ రైతులకు నీళ్లివ్వకుండా వారి కడుపుకొట్టి సాగర్ ఆయకట్టు రైతులను ఎండబెట్టి తన అక్రమ నివాసాన్ని కాపాడే చర్యలను ప్రభుత్వం చేపట్టి ఉండాలన్నది చంద్రబాబు ఆవేదన సారాంశంగా కనిపిస్తున్నది. ఆయన ఆవేదనను రాష్ట్ర ప్రజలందరూ పంచుకోవాలన్న రీతిలో మీడియా ఫిల్టర్లు పనిచేశాయి. కానీ, ఆయన వుంటున్నది అక్రమ నిర్మాణమనీ, ఆమేరకు రివర్ కన్సర్వేషన్ అథారిటీ నోటీసులు కూడా ఇచ్చిందనీ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌దీ అదే అభిప్రాయమనీ, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అటు వంటి నివాసంలో ఉండటం తగదని ఏ మీడియాలోనూ పొరపాటున కూడా రాలేదు. ప్రకాశం బ్యారేజీ గుండా ఎనిమిది లక్షల క్యూసెక్కుల ప్రవాహం వెళ్తున్న ఈ స్థితిలో రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు కురిసి వైరా, మున్నేరు, బుడమేరు, కొండవీటి వాగులు కూడా ఉగ్ర రూపం దాలిస్తే పరిస్థితేమిటి? కరకట్టే కాదు, ఆయన కట్టాలనుకున్న రాజధాని ప్రాంతం కూడా వరద ముంపులో ఉండేది. ఫిల్టర్ న్యూస్‌కు ఈ కరకట్ట సీన్ ఒక తాజా ఉదాహరణ మాత్రమే. రెండున్నర మాసాల వయసున్న కొత్త ప్రభుత్వం మీద బురద చల్లడానికి ఇలాంటివెన్నో ఫిల్టర్లను ఇప్పటికే మన మీడియా వాడేసింది. అందులో రాజధాని చుట్టుపక్కల భూముల ధరలు ఢమాల్‌మన్నాయని, రాష్ట్ర అభివృద్ధి ఆగిపోయిందనీ దీర్ఘాలు తీస్తూ ఈమధ్యనే ఒక వార్తను వదిలారు. ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని స్థాయి భారీ స్కామ్ బయటకు కనపడకుండా దాచేసే కుట్ర ఈ కథనం వెనుక అసలు కథ. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని చేసిన చట్టంపై కూడా చిత్తశుద్ధిలేని వ్యతిరేక ప్రచారం గుప్పించారు. ఆస్థాన రచయితలను ప్రయోగించి జాతీయ వార్తా పత్రికల్లో కూడా వ్యతిరేక చర్చకు తెరలేపారు. కానీ, తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని మాత్రం సౌకర్యవంతంగా మరిచిపోతున్నారు. మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండని బొట్టుపెట్టి మరీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేదీ, సకల సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్రాలు పోటీపడి మరీ హామీలు ఇచ్చేదీ ఎందుకోసం? స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకా లేక ప్రభుత్వ పెద్దలు ముడుపులు మింగేందుకా? ఈ ప్రశ్న మన మీడియాలో ఉత్పన్నం కాదు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడొక కొత్తచరిత్ర చిగురు తొడుగుతున్నది. పేద బతుకుల్లో చిచ్చుపెడుతున్న మద్యం రక్కసిపై యుద్ధంలో తొలిఅడుగు పడింది. కనీవినీ ఎరుగని విధంగా ఒకేసారి నాలుగు లక్షల ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక ప్రారంభమైంది. నిరుపేద కుటుంబాలకు కూడా విద్యకు, వైద్యానికి ధీమా ఏర్పడింది. ప్రైవేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగింది. రైతుకు భరోసా దొరికింది. 12 వేల ప్రభుత్వ పాఠశాలలు ఈ సంవత్సరం అన్ని హంగులతో కూడిన కొత్త రంగులను ధరించబోతున్నవి. ఇవేవీ కూడా మీడియా వార్తల్లో కాగడా వేసి చూసినా కనిపించే పరిస్థితి లేదు. ఫిల్టర్ న్యూస్ సమాజానికి హానికరం అనే అవగాహనకు ప్రజలు రావలసిన పరిస్థితి ఏర్పడింది. సత్యాన్వేషులు హంసల వలె నీర, క్షీర న్యాయ నేర్పరులు కావలసిన అగత్యం ఏర్పడింది.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఆగండాగండి!



"రేపటినుంచి కశ్మీరులో ఆంక్షలు సడలిస్తున్నాం. ప్రజలు ఎవరూ కంగారు పడొద్దు. షాపింగ్ కోసం పరుగులు పెట్టవద్దు. నిత్యావసరాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ అన్నీ అందేందుకు చర్యలు తీసుకుంటాం' అంటూ శ్రీనగర్ మేజిస్ట్రేట్ షహీద్ చౌధురి చేసిన ట్వీట్ ఆశ్చర్యం కలిగించింది. అయ్యా...చౌధురి గారూ ఇంకో రెండురోజులు ఆగి ఆ ట్వీట్ చేసి ఉంటే బాగుండేది. ఎందుకంటే మీ ఆంక్షల కారణంగా దాన్ని చూసే భాగ్యం కశ్మీర్ పౌరులకు లేకుండా పోయింది"

– ఖుష్బూ, సినీ నటి, కాంగ్రెస్ నేత

### ఉమ్మడి ఏకాకులు



"పాకిస్తాన్‌కూ, చైనాకూ ఉమ్మడి సిద్ధాంతాలు కొన్ని ఉన్నాయి. ఇద్దరూ జాతుల పట్ల ఆటవికంగా ప్రవర్తిస్తారు. ఆ ప్రజలను చిత్ర హింసలు పెడతారు. మైనారిటీలను ఊచకోత కోస్తారు. వీరి అకృత్యాలకు అంతూ దరీ లేదు. పాక్ భూభాగంలోని బలూచిస్తాన్, చైనా అధీనంలోని జిన్ జియాంగ్ ఇందుకు రుజువు. అందుకే ఇద్దరూ భద్రతామండలి గదిలో ఏకాకులయ్యారు"

– సమీర్ శరణ్, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

### వేదన



"ఇండియా టుడే ఇంటర్వ్యూలో జమ్మూ–కశ్మీర్ దళిత యువకుడి వేదన వింటే 35 ఏ అధికరణ రద్దు ప్రయోజనం ఏమిటో తెలుస్తుంది. ఆ అధికరణ వల్ల ప్రభుత్వంలో స్వీపర్ ఉద్యోగానికి తప్ప దేనికీ తమకు అర్హత ఉండేది కాదని ఆయన చెబుతున్నాడు. ఇప్పటికైనా దీని రద్దును వ్యతిరేకిస్తున్నవారు నిజాలు గ్రహిస్తారా?"

– కేటీ హాప్‌కిన్స్, బ్రిటన్ మహిళోద్యమ నేత

### నకిలీ



"భారత్‌లోని జైళ్లలో ఉగ్రవాద ఆరోపణలతో నిర్బంధించినవారిపట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ జాతీయ భద్రతా సలహాదారుకు రాసినట్టు సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రచారంలో ఉన్న లేఖ బోగస్. అది దాదాపు 17 ఏళ్ల క్రితం అమెరికాలో ఒకరు సృష్టించిన వ్యంగ్య రచన"

– ప్రతీక్ సిన్హా, సీనియర్ పాత్రికేయుడు

### మధుర జ్ఞాపకం



"90వ దశకంలో దూరదర్శన్ చూస్తూ పెరిగిన మాకు నీలం శర్మ ఎంతోగానో స్ఫూర్తిదాయకమైనవారు. పద ఉచ్చారణలో, ఏ వార్తనైనా భావస్ఫోరకంగా ప్రకటించడంలో, వీక్షకులను మెప్పించడంలో ఆమెకు సాటిరాగలవారు లేరు. నీలంశర్మ గారూ... కేవలం మీ కోసమే, మీ వస్త్రధారణ తీరును గమనించడానికే నేను డీడీ వార్తలు చూసేదాన్ని. నాజూగ్గా, హుందాగా నిత్యం కనబడే మీ రూపమే నా కళ్లలో రూపుకడుతోంది"

– మేఘప్రియ మిశ్రా, రచయిత

## తాలిబన్‌లతో శాంతి

ఎవరెన్నివిధాల చెప్పినా తాలిబన్‌లతో ఒప్పందానికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. త్వరలో తాలిబన్‌లతో జరగబోయే చర్చల్లో ప్రస్తావనకు రావలసిన అంశాలు ఖరారవుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో చెప్పారు. తాలిబన్‌ల గత పోకడలు చూడకుండా, అఫ్గాన్ భవితవ్యం గురించి ఆలోచించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోకూడదని చాలామంది చెబుతున్నా అమెరికాకు ఇవేమీ పట్టడం లేదు. తననూ, తన మిత్ర దేశాలనూ భవిష్యత్తులో లక్ష్యంగా చేసుకొనరాదని, హింసాత్మక కార్యకలాపాలకు అంగీకరించరాదని తాలిబన్‌లకు అమెరికా షరతు పెట్టింది. అంతా సవ్యంగా జరిగితే ఆ దేశం నుంచి తమ దళాలను గణనీయంగా తగ్గిస్తామని ప్రకటించారు. ఈ అంశంలో మరిన్ని చర్చలు జరగాల్సి ఉందని పాంపియో చెప్పారు. అయితే ఒప్పందం దాదాపు ఖరారైందని, మరో దఫా ఇరు పక్షాలూ చర్చించుకుంటే తుది సమావేశం తేదీ నిర్ణయమవుతుందని తాలిబన్ ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం అఫ్గాన్‌లో ఉన్న 14,000 అమెరికా సైన్యంలో 5,000 మందిని వెనక్కు పంపుతారు. అలా చేస్తే అల్ కాయిదాతో తమ సంస్థ సంబంధాలు తెంచుకుంటుందని తాలిబన్‌లు హామీ ఇస్తున్నారు. అలాగే తమ దేశాధ్యక్షుడు అష్రాఫ్ ఘనీతో శాంతి ఒప్పందం కుదుర్చుకుంటామని చెబుతున్నారు.

# సైనిక వ్యూహంలో మూలమలుపు 'కమాండ్'

అభిప్రాయం


అలోక్ భన్సాల్

స్వాతంత్య్ర దినాన ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనల్లో కీలకమైనది చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) ఏర్పాటు ప్రకటన. మన త్రివిధ సైనిక దళాల మధ్య మెరుగైన సమన్వయం కోసం దీన్ని ఏర్పాటు చేయనున్నారు. భారత సైనిక బలగాలు ఎప్పటినుంచే చేస్తూ వస్తున్న ఈ డిమాండును 1999లో కె. సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని కార్గిల్ రివ్యూ కమిటీ, జనరల్ డీబీ షేకాత్కర్ అధ్యక్షతన ఏర్పడిన రక్షణ మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ కూడా సిఫార్సు చేశాయి. నాలుగు నక్షత్రాలున్న మిలిటరీ అధికారి కేంద్రప్రభుత్వానికి సైనిక వ్యవహారాల్లో సింగిల్ పాయింట్ సలహాదారుగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉంది.

ఆధునిక యుద్ధాలను సైనిక బలగాలు స్వతంత్రంగా నిర్వహించలేవు. ప్రస్తుత భారత సైనిక బలగాలు వలసపాలనా నిర్మాణంతో కూడి ఉన్నాయి. మహా యుద్ధాల సమయంలో తమ యజమానుల ప్రయోజనాల కోసమే వీటిని నెలకొల్పారు. కాబట్టి, సాయుధ బలగాల పునర్నిర్మాణం ప్రస్తుతం చాలా అవసరం. భవిష్యత్ యుద్ధాలు స్వల్పకాలిక తీవ్రస్థాయి వ్యవహారాలుగా సాగనున్నందున రాజ్య వ్యవస్థలన్నీ తదనుగుణంగా నిర్మాణం కావాలి. ఇదే యూనిటీ ఆఫ్ కమాండ్‌ను నిర్దేశిస్తోంది. చీఫ్ ఆఫ్ స్టాఫ్ నేతృత్వంలో ఏకీకృత కమాండ్ వ్యవస్థ మాత్రమే ఈ అవసరాలను నెరవేర్చగలదు. కానీ రక్షణ మంత్రిత్వ శాఖలో రాజకీయ అభద్రత, ఉన్నతాధికారుల ప్రభావం ఇంత కీలక నిర్ణయాన్ని తీసుకోకుండా అడ్డుపడుతూ వచ్చింది.

చీఫ్ ఆఫ్ స్టాఫ్ నియామకంపై కార్గిల్ రివ్యూ కమిటీ సిఫార్సు చేసిన తర్వాత, నాటి ఉపప్రధాని ఎల్‌కే అడ్వాణీ నేతృత్వంలోని డిఫెన్స్ స్టాఫ్ వైస్ చీఫ్ దీన్ని పరిశీలించి త్రివిధ దళాల జాయింట్ ప్లానింగ్ స్టాఫ్‌తో సీడీఎస్‌ని నెలకొల్పాలని సిఫార్సు చేసింది. తదనుగుణంగా 2001 అక్టోబర్‌లో సమీకృత డిఫెన్స్ స్టాఫ్ హెడ్‌క్వార్టర్‌ని ఏర్పర్చారు. కానీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సైనిక కుట్రకు తలపెట్టడం సులభం అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ద్వారా బ్యూరోక్రాట్లు సీడీఎస్ నియామకాన్ని నిలిపివేయడంలో విజయం పొందారు. దీంతో సీడీఎస్ వ్యవస్థను స్థాపించినప్పటికీ గత 18 ఏళ్లుగా అధిపతి లేని పరిస్థితి ఏర్పడింది.

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం భారత రక్షణ వ్యవస్థలో ఏర్పడిన వెలితిని పూరిస్తుంది. కానీ కార్యాలయాన్ని మాత్రమే స్థాపించడంతో సరిపోదు. మొత్తం రక్షణ మంత్రిత్వ శాఖను పునర్నిర్మించడం, సమీకృత యుద్ధరంగ కమాండ్‌లను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. త్రివిధ దళాల పనిని చక్కగా అర్థం చేసుకోవడంలో సీడీఎస్ మేధో సమరయోధుడిగా ఉండాలి. దీన్ని ఒక రొటేషన్ పద్ధతిలో మారుస్తూ ఉండకూడదు.

అయితే ప్రధాని ప్రకటించినంత మాత్రాన ఇది సజావుగా జరిగే వ్యవహారం కాదు. తమ పలుకుబడిని కోల్పోయిన బ్యూరోక్రాట్లు అడ్డంకులను సృష్టించవచ్చు. మరోవైపున తమ పట్టు కోల్పోతామన్న భయంతో త్రివిధ దళాలు కూడా తమ వ్యవహారాల్లో సీడీఎస్ జోక్యాన్ని అడ్డుకోవచ్చు. అందుకే ప్రభుత్వం రక్షణ బలగాల కార్యాలయాలు, కేపిటల్ బడ్జెట్‌ని సీడీఎస్ అధికార పరిధిలోకి తేవాలి. సీడీఎస్ కూడా రక్షణమంత్రిని నేరుగా కలుస్తూ, తన ద్వారా ప్రధానమంత్రిని కలిసే అధికారాలను కలిగివుండాలి.

అంతర్జాతీయ శక్తిగా రూపొందాలనే భారత్ ఆకాంక్షలను నెరవేర్చేలా సాయుధ బలగాల పునర్నిర్మాణానికి అనువైన సంస్కరణలను తీసుకువచ్చేందుకు సీడీఎస్ నియామకం అత్యవసరం.

వ్యాసకర్త మాజీ నావికాధికారి, డైరెక్టర్, ఇండియా ఫౌండేషన్

# ఛత్రపతికి సైదోడు సర్వాయి పాపన్న

ఏవి తల్లీ ! నిరుడు కురిసిన హిమసమూహములే? అని ప్రశ్నించినా, పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోయిన జాడలేవని ''చరిత్ర చిత్తడి''పై రాజులు, సామంతులు వారిపై మట్టిమనుషుల తిరుగుబాటు గెలుపు, ఓట ముల పాదముద్రలకై వెతుకులాడినా ఎందరో సర్వాయి పాపన్నలు, పండుగ సాయన్నలు, కొమరం భీమ్‌లు, చాకలి ఐలమ్మలు సాక్షాత్కరిస్తారు.



1630లో పూనేలో కుంబ్ వ్యవసాయిగా పుట్టి మొఘల్ సామ్రాజ్య విస్తరణకు అడ్డుకట్ట వేయాలని చిన్న సామంతుడిగా ఉన్న షాజీ బోంస్లే కొడుకు శివాజీ ఎట్లా కల గన్నాడో 1650లో తెలంగాణలో పుట్టి, కల్లు గీయగ ఏమి వచ్చు? గోల్కొండ ఖిల్లానే కొట్టాలని మంగలి మాసన్న, కుమ్మరి గోవిందం, చాకలి సర్వన్న, మేదరి వెంకన్న, జక్కుల పెరుమాండ్లు, హన్మంతు, దూదేకుల పీర్ మహ్మద్, హుస్సేన్, హసేన్‌ల 12 మందిని తోడు తీసుకొని తాటికొండ, ఖిలేషాపురం, సర్వాయిపేట, వరంగల్ నుండి గోల్కొండ దాక జైత్రయాత్రకు 12 వేల మంది సైన్యాన్ని ముందుకు నడిపించిన పాపన్న. తన రాజ్యంలో జాగీర్దార్ల ఆగడాలను, దోపిడీని, అక్రమ పన్నును ఆపి రైతు, బహుజనుల అభివృద్ధికి పాలనాపర ప్రణాళికలు రచించి శెబాష్! అనిపించుకున్న పాపన్న.. గోల్కొండను చూస్తే, కొన్ని వర్గాలు కుట్ర పన్ని, యుద్ధానికి కాలు దువ్వి, పాపన్నను చంపి మొండెం వేలాడగట్టిన కిరాతకం గుర్తుకు రావాలి.

తెలంగాణ చరిత్రను కొల్లగొట్టిన ఎందరో విగ్రహాల ప్రతిష్టాపన జరిగింది.... కానీ పాపన్న ఇంకా స్ఫూర్తిమూర్తి అయి గోల్కొండను, భాగ్యనగరాన్ని విద్యుదీకరించలేదు. అందుకే ఈ రాష్ట్రం కోసం పోరాడిన వాళ్ళుగా దళిత, బహుజన బిడ్డలుగా 73వ స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలు గోల్కొండ కోటలో జరుగుతున్నప్పుడు దక్కన్ వీరుడు పాపన్న విగ్రహం అక్కడే ఉండాలని, ఈ రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ఆయన నడిపిన సబ్బండవర్ణాల సైన్యమే కొండ గుర్తు కావాలని మనం ఆశించాల్సిందే. పాపన్న మహాభారతంలో బర్బరీకుడు కాదు... ఆధునిక రాజ్యాధికార భారతంలో ధిక్కార సర్వాయి... ఆ దారిలో బడుగులు విజయం సాధించినప్పుడు పాపన్న తెగిన శిరస్సు ముస్కు రాయిస్తూనే ఉంటుంది.

(నేడు మోకుదెబ్బ ఆధ్వర్యంలో, సర్వాయిపేటలో సర్వాయి పాపన్న 369వ జయంతి సభ)

డా౹౹ చెరుకు సుధాకర్, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు । 90006 00744

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
18-8-2019



పవర్‌ఫుల్ రాణి
- సినిమా పేజీలో

# వీక్‌నెస్ నుంచే బలం రావాలి

**అనుకుంటే ఏదైనా చేయొచ్చు.
ఆడపిల్ల అయితే అంతకన్నా ఎక్కువ చేయొచ్చు.
సాధారణంగా ఆడపిల్ల అంటే 'వీక్' అంటారు.
కానీ మన వీక్‌నెస్ తెలిస్తేనే కదా మనం స్ట్రాంగ్ అయ్యేది.
శక్తి ఒకరు ఇచ్చేది కాదు. బయట నుంచి తీసుకునేది కాదు.
లోపల నుంచి ఎదగాలి.
నీతూచంద్ర చెబుతున్న మాటలు ప్రతి అమ్మాయి చదవాలి.**



● నీతూచంద్ర

**● విష్ణు, గోదావరి, సత్యమేవ జయతే వంటి తెలుగు సినిమాలు చేశారు. ఆ తర్వాత కనిపించలేదేం?**

**నీతు:** అప్పుడేం జరిగిందో చాలామందికి తెలుసు అనుకుంటాను. ఇప్పుడా విషయం గురించి మళ్లీ చెప్పాలనిపించడంలేదు. నా స్టాఫ్‌తో సహా ఉదయం 4 గంటలకే హైదరాబాద్ నుంచి హడావిడిగా వెళ్లిపోవాల్సి వచ్చింది. భయంకరమైన సంఘటన అది. అప్పుడు మా నాన్నగారు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటు ప్రొఫెషనల్‌గా ఘోరమైన పరిస్థితి, అటు వ్యక్తిగతంగా పెద్ద బాధ. ఇక్కడ నిలబడి ఫైట్ చేద్దామంటే నా పర్సనల్ లైఫ్ అందుకు స్కోప్ ఇవ్వలేదు. నాన్నగారి కోసం వెళ్లిపోవాల్సి వచ్చింది.

**● మీకెదురైన చేదు అనుభవం ఒకే ఒక్క సినిమాతో. మరి.. ఇండస్ట్రీ మొత్తానికి దూరం కావడమెందుకు?**

ఆ తర్వాత నేను 'మనం' సినిమా చేశాను కదా? కంటెంట్ ఓరియంటెడ్ సినిమాలు చేయాలనుకున్నాను. కానీ స్పెషల్ సాంగ్స్ ఆఫర్స్ మాత్రమే వచ్చేవి. నాకు తెలిసి ఎవరైనా ముందు సాంగ్స్, స్పెషల్ డ్యాన్స్‌లు చేసి ఆ తర్వాత క్యారెక్టర్లు చేస్తుంటారు. నేను దానికి విరుద్ధంగా చేశాను. నా దృష్టిలో హిందీ సినిమాకు సౌత్ సినిమా వెన్నెముకలాంటిది. స్పెషల్‌గా తెలుగు, తమిళం. ఈ రెండు ఇండస్ట్రీలు నాకు గుర్తింపును ఇచ్చాయి.

**● తెలుగులో కనిపించడంలేదు. ఇతర భాషల్లో నటించి కూడా రెండు మూడేళ్లయినట్లు ఉంది కదా?**

క్వాలిటీ వర్క్ చేయాలనుకుంటాను. 'విష్ణు, గోదావరి, సత్యమేవ జయతే'లో చేసిన పాత్రలు దేనికదే విభిన్నంగా ఉంటాయి. నాలుగేళ్లుగా థియేటర్స్ మాత్రమే చేస్తున్నాను. దాని వల్ల 'నీతూ యాక్టింగ్ మానేసింది' అని రాస్తున్నారు. సినిమాలు చేసిన తర్వాత థియేటర్ చేయాలంటే చాలా ధైర్యం కావాలి. మన దగ్గరకు వచ్చే సినిమాలు ఎలానూ వస్తాయనే ఉద్దేశంతో ఉన్నాను. మా నాన్నగారు పోవడంతో అమ్మను చూసుకుంటున్నాను. ఒకవేళ మంచి కంటెంట్ ఉన్న కథ వస్తే అందులో 17 ఏళ్ల అమ్మాయిగా, 85 ఏళ్ల వయసున్న బామ్మలా కనిపించాలన్నా అలానే మౌల్డ్ అయిపోతాను. రెండు గంటలు బ్రేక్ లేకుండా నటించగలను.

**● ఇప్పుడు మీరు యాక్టర్, ప్రొడ్యూసర్, స్పోర్ట్స్ పర్సన్, డ్యాన్సర్.. అసలు చిన్నప్పుడు ఏమవుదాం అనుకున్నారు?**

చిన్నప్పుడు పిల్లలు అది అవ్వాలి.. ఇది అవ్వాలి అనుకోరు. వాళ్ల తల్లిదండ్రులు అనుకుంటారు. అటు వెపుగా పిల్లల్ని వెళ్లమంటారు. నేను ఇలా ఉన్నానంటే కారణం మా అమ్మగారు. తను నన్ను మార్షల్ ఆర్ట్స్ చేయమన్నారు. కథక్ నేర్చుకోమన్నారు. స్కూల్‌లో జరిగిన ఫంక్షన్స్‌లో యాక్ట్ చేశాను. నన్ను యాక్టర్‌ని చేసేలోపు నాలో ఈ స్కిల్స్ పెరిగేలా చూసుకున్నాడు దేవుడు. 12వ తరగతిలో నాన్నగారికి యాక్సిడెంట్ అయింది. దాంతో నాకు చదువుకుంటూనే పని చేయాల్సిన పరిస్థితి వచ్చింది. మా తమ్ముడు కూడా వాళ్ల క్లాస్ వాళ్లకు ట్యూషన్ చెప్పేవాడు. అంత టాలెంట్. ఇప్పుడు డైరెక్టర్, రైటర్ అయ్యాడు. ఇదంతా స్ట్రగుల్ అనుకోను. 'స్ట్రగుల్' అనే పదం నా డిక్షనరీలోనే ఉండదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఉండటం వల్ల చివరిదాకా పోరాడాలనే తత్వం నాలో ఏర్పడింది.

**● సినిమాల సంఖ్య తగ్గడంతో ఇండస్ట్రీకి దూరం అయినట్లు అనిపించిందా?**

సోషల్ మీడియా వల్ల దూరం అయినట్టుగా లేదు. ఫిల్మ్స్‌కి దూరంగా ఉన్నా సోషల్ ప్లాట్‌ఫామ్స్‌లో కనిపిస్తున్నాను. నాకు ఇష్టం లేని సినిమాల్లో భాగం అవ్వడం లేదు.. అంతే. మనకు నచ్చని పనిని 'చేయను' అని తెగేసి చెప్పడం కూడా సక్సెసే. 'యస్' అని చెప్పి పిచ్చి పిచ్చి సినిమాలు చేయలేం కదా. అలాగని డ్యాన్స్‌లు చేయనని కాదు. అవీ చేస్తాను. అలాగే 'బాహుబలి' సినిమాలో హీరోయిన్లు చేసినట్లు యాక్షన్ మూవీ చేయాలని ఉంది.

**● అవునూ... లాస్ ఏంజిల్స్‌లో యాక్టింగ్ కోర్స్‌కి వెళుతున్నారట. పదిహేనేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నారు. మళ్లీ యాక్టింగ్ కోర్స్ ఎందుకు?**

ఏ ఆర్టిస్ట్ అయినా రోజూ ప్రాక్టీస్ చేయాల్సిందేనని నా అభిప్రాయం. అనుభవం సంపాదించుకున్నా కూడా ప్రాక్టీస్ చేస్తూనే ఉండాలి. అందుకే ఓపిక ఉన్నంత వరకూ థియేటర్, వర్క్‌షాప్స్ చేస్తూనే ఉంటాను.

**● ఓకే.. మార్షల్ ఆర్ట్స్‌లో నాలుగు బ్లాక్ బెల్టులు సాధించారు. ఈ ఆర్ట్ మీ లైఫ్‌కి ఎలా ఉపయోగపడింది?**

స్పోర్ట్స్‌ని నా ఫ్రెండ్‌లా భావిస్తాను. స్పెషల్‌గా మార్షల్ ఆర్ట్స్. దీని వల్ల మనం ప్రశాంతంగా ఉంటాం. లేకపోతే నేనున్న ప్రొఫెషన్‌కి డిప్రెషన్, బ్రెయిన్‌హెమరేజ్ వచ్చేస్తాయి. ఈ సినిమా నాకు కాకుండా ఆ అమ్మాయికి వెళ్లిపోయింది. అది అలా జరిగింది? ఇలాంటివి ఆలోచిస్తుంటాం. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు స్పోర్ట్స్ నేర్పించాలి. అది ఏ స్పోర్ట్ అయినా ఫర్వాలేదు. క్రమశిక్షణ, బాధ్యత, పోరాడే లక్షణం అలవడతాయి. అదో డిఫరెంట్ ఎనర్జీ. స్పోర్ట్స్ చాలా నేర్పింది.

**● స్పోర్ట్స్‌ని ఫ్రెండ్‌లా అనుకుంటా అన్నారు. మరి మీ జీవితంలో స్పెషల్ పర్సన్ ఎవరూ లేరా?**

రిలేషన్‌షిప్‌లో ఉండటం కూడా ఓ పని లాంటిదే. యాక్ట్ చేస్తున్నాను, నిర్మిస్తున్నాను, మార్షల్ ఆర్ట్స్‌లో ఉన్నాను, పట్నా పైరెట్స్ కబడ్డీ జట్టును ప్రమోట్ చేస్తున్నాను. నాలుగేళ్ల రిలేషన్‌లో (బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడాతో ఒకప్పుడు ప్రేమలో ఉన్న నీతు) ఉన్నాను. అది కొనసాగని పరిస్థితి. ఆ బాధలోంచి బయటకు రావడానికి ఒకటిన్నర సంవత్సరం పట్టింది. ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌లో ఉంటున్నాను. ప్రపంచం మొత్తం తిరిగి పని చేయాలనుకుంటాను. తెలుగులో సినిమా ఉంటే ఇక్కడికి వచ్చి సినిమా చేస్తాను. ప్రేమలో పడే టైమ్ దొరికి, మనసుకి నచ్చిన అబ్బాయి దొరికితే అప్పుడు పడతాను.

**● మార్షల్ ఆర్ట్స్ వల్ల అడ్వాంటేజ్, డిస్ అడ్వాంటేజ్ రెండూ ఉంటాయి కదా?**

అవును. ఈ ఆర్ట్ వల్ల నేను రూడ్ అనుకునే అవకాశం ఉంది. అయితే నేను చాలా సాఫ్ట్. నన్ను గౌరవించండి.. నేను మిమ్మల్ని గౌరవిస్తాను అనే తత్వం నాది. గౌరవంలో తేడా వచ్చినప్పుడు ఇంకో కోణం చూపిస్తా (నవ్వుతూ). నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నానని పాత్రకు సరిపోయినా చాలామంది నన్ను సినిమాల్లో తీసుకోలేదు. మార్షల్ ఆర్ట్స్ వల్ల ఫెమినైన్ (స్త్రీత్వం)గా ఉండను అనుకుంటారు. అది ఒక డ్రాబ్యాక్. ఊరికే ఫైట్ చేస్తుంది అనుకుంటారు. మార్షల్ ఆర్ట్స్ అనేవి మనిషిని క్రమశిక్షణగా ఉంచడానికి, ఆత్మవిశ్వాసం పెంచడానికి, స్వీయ రక్షణకు ఉపయోగపడతాయి. దానివల్ల ఫెమినిటీ తగ్గదు. ఊరికే ఫైట్ చేయరు. చాలా బ్యాలెన్స్‌గా ఉంటారు.

**● బీహార్‌లో పుట్టి, హాలీవుడ్ ప్రాజెక్ట్ దాకా ఎదిగిన ఈ జర్నీ గురించి?**

బీహార్ అమ్మాయిలు హీరోయిన్ అవ్వాలని కలలు కనడమే ఎక్కువ. ఆ కలను నెరవేర్చుకున్నా. నాది సక్సెస్‌ఫుల్ జర్నీయే.

**● హీరోయిన్ అవడంతో పాటు సినిమాలు నిర్మిస్తున్నారు... పైగా సందేశాత్మక సినిమాలు తీస్తున్నారు..**

నా తమ్ముడు నితిన్‌తో కలిసి ఓ నిర్మాణ సంస్థను మొదలుపెట్టా. బీహార్‌కు అప్పటివరకూ నేషనల్ అవార్డ్ వచ్చింది లేదు. మా మొదటి సినిమా ('దేశ్వా')కే వచ్చింది. ఇంకా వెనక్కి వెళ్దాం. నా తొమ్మిదో తరగతిలో స్పోర్ట్స్‌లో ఇండియాను రిప్రజెంట్ చేశాను. జాకీచాన్ చేతుల మీదుగా అవార్డ్ వచ్చింది. నితిన్‌కు డైరెక్టర్‌గా హిందీ సినిమా చేసే అవకాశం వచ్చినా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని భోజ్‌పురి సినిమా చేశాడు. బీహార్‌లో ఐదు భాషలు చనిపోయే స్థితిలో ఉన్నాయి. 'భోజ్‌పురీ, మైథిలీ, మగ్గై, అంగికా, బజ్జికా'... ఇవి బీహార్ భాషలు. భోజ్‌పురిలో చాలావరకు చీప్‌గా, బీ గ్రేడ్ సినిమాలు చేస్తున్నారు. అలాంటి సినిమాలు మేం చేయాలనుకోలేదు. ఫ్యామిలీ అందరితో కలసి ఓ మాతృభాష సినిమా చూడలేని పరిస్థితి అక్కడ ఉంది. ఓ రెవల్యూషన్ తీసుకురావాలనుకున్నాం. మేం తీసే సినిమాల్లో రవి కిషన్, మనోజ్ తివారి వంటి స్టార్లు కనిపించరు. బీహార్‌లోనే షూటింగ్ చేస్తాం. అలా అయితే అక్కడివాళ్లకి కొంత పని కల్పించవచ్చు, ట్యాక్స్ కట్టవచ్చు అని. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారు? బీహార్ సినిమా పరిస్థితి మారాలంటే ఐదు 'బాహుబలి'లు కావాలి.

**● మార్షల్ ఆర్ట్స్ ఉపయోగాల గురించి అమ్మాయిలకు ఏమైనా చెబుతారా?**

శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతాం. ఐదుగురు అబ్బాయిలు వీధిలో ఉన్నారనుకోండి.. మామూలు అమ్మాయిలైతే 'వామ్మో అబ్బాయిలు' అని బిక్కుబిక్కుమంటూ నడుస్తారు. మీ నాన్న, అన్నయ్య, తమ్ముడు, భర్త.. ఇలా అందరూ ఎప్పుడూ మీతో ఉండలేరు కదా. అందుకని మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. అబ్బాయిలు కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. ఎందుకంటే యవ్వనంలో వాళ్లు చాలా అగ్రెసివ్‌గా ఉంటారు. కానీ మార్షల్ ఆర్ట్స్ వల్ల సెన్సిబుల్‌గా మారిపోతారు. చుట్టూ ఉన్నవాళ్లను రక్షించాలనే మైండ్ సెట్ ఏర్పడుతుంది.

**● ప్రస్తుతం ఏ ప్రాజెక్ట్స్ చేస్తున్నారు?**

రెండు హాలీవుడ్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. త్వరలోనే అనౌన్స్ చేస్తా. ఓ మ్యూజిక్ వీడియో చేశాను. దాని రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాను.

– డి.జి. భవాని
ఫొటో: శివ మల్లాల












epaper.sakshi.com

# సాక్షి ఫ్యామిలీ సినిమా

నల్లగొండ ॥ ఆదివారం
18-8-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



దొరగారి సొగసరీ సిరి దోటలో
దొరసాని సిలకమ్మ ఉందిరో
గలబాలా గడసరీ పెడ మూకతో
సెలిమే అది జేసెరో
పొగమంచే పడే తడిపొడి ఏళ్లల్లో
తలవంచేసినా సిటారు సేలో
సిగురించే సిరు సావాసాలే నిండేరో
కథకే ముడేపడెరో

ఓ సిలకా అలుపంటూ లేక
వాగూ వంక ఎనకా పరుగిడాలే
కాదనకా పైకెగరడమే అందాక
నీ బెరుకే బెమె పడేలే
॥దొరగారీ॥

ఓహో.. ఆహా.. గదుముతుంది చూడు
ఓహో.. ఆహా.. గడబిడ గూడు
ఓహో ఆహా.. కలబడింది తోడు
ఓహో.. ఆహా.. కువకువలాడు
ఊరొక తీరు వీరొక తీరు
గందరగోళం సందడి మీరు
ఎహె ఏళపాళ దేనికంటా
ఏళాకోళం సేసుకుంటా
కొండకోన దాటుకుంటా
ఎంచక్క సాగిపో ఎంచక్క సాగిపో
రేసుక్క నావలో నింగెక్కి తేలిపో

సన్నజాజి కులుకు సల్లగాలి సురుకు
సందమామ వరకు ఏదేమైనా సేరాలే
అల్లిబిల్లి పరుగు సాగెటంత వరకూ
ఏగుసుక్క ఎలుగు నీ సెంతకే రావాలే
నీ తోటి తిరగాలంటూ
మబ్బులే ఎంట పడిపోవా
నీ బుగ్గ నిమరాలంటూ
సుక్కలే నేల దిగిరావా
॥ఏళపాళ దేనికంటా॥

**చిత్రం : బ్రోచేవారెవరురా**
**రచన : భరద్వాజ్**
**గానం : మనీషా ఎరబత్తిని, వివేక్ సాగర్**
**సంగీతం: వివేక్ సాగర్**

కట్‌చేయ్... దాచేయ్...

# ఒక జానర్‌కి ఫిక్స్ అవ్వను

**“ఒక జానర్‌కి, ఒక స్టైల్‌కి ఫిక్స్ అవడానికి ఇష్టపడను. సినిమా సినిమాకు జానర్స్ మార్చుకుంటూ వెళ్లడానికి ఇష్టపడతాను. ప్రతి స్క్రిప్ట్ విభిన్నంగా ఉండాలి. ఎప్పుడూ ఒకటే చేసుకుంటూ వెళ్తే ఆడియన్స్‌కు బోర్ కొట్టేస్తాం” అన్నారు శర్వానంద్. సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా, కల్యాణీ ప్రియదర్శన్, కాజల్ అగర్వాల్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం ‘రణరంగం’. నాగవంశీ, పీడీవీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం గత గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా శర్వానంద్ చెప్పిన విశేషాలు.**



● శర్వానంద్

- సినిమాకు వస్తున్న ఫీడ్‌బ్యాక్ బావుంది. రిలీజ్ రోజు ఉదయం డివైడ్ టాక్ వచ్చింది. తర్వాత యావరేజ్ అన్నారు. ఇప్పుడు ఎబౌ యావరేజ్ అంటున్నారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎవ్వరూ కూడా బాగాలేదు అనడం లేదు. ‘చాలా బావుంటుంది’ అంటారనుకున్నాం. ఈ రిజల్ట్ ఊహించలేదు. రివ్యూలు ఒకలా ఉన్నాయి. ప్రేక్షకులు చెబుతున్నది ఒకలా ఉంది. ఏం జరిగిందో అని విశ్లేషించుకుంటున్నాను. ఒక విధంగా హ్యాపీగా ఉంది. ఇంకో విధంగా చిన్న అసంతృప్తి. కలెక్షన్స్ పరంగా సూపర్ హ్యాపీ. రివ్యూలు కూడా ఇంకొంచెం బావుంటే కలెక్షన్స్ ఇంకా బావుండేవేమో? అని చిన్న ఆశ (నవ్వుతూ).
- విమర్శ అనేది ప్రతి ఆర్టిస్ట్‌కు అవసరం. అది విలువైనది అయితే దాన్ని తీసుకొని మనల్ని మనం మెరుగుపరచుకోవాలి. ఫ్యామిలీ సినిమాలు, కామెడీ సినిమాలు చేశాను. జానర్ మార్చుదామని ఈ సినిమా చేశాను. సుధీర్, నేను ఓ స్టైలిష్, యాక్షన్ సినిమా చేయాలనుకున్నాం. సినిమాలో స్క్రీన్‌ప్లే నాకు బాగా నచ్చింది. రెండుషేడ్స్ ఉన్న పాత్రలు ఉన్నాయి. యాక్టర్‌గా చాలెంజింగ్‌గా ఉంటుందనిపించింది. ‘ప్రస్థానం. రన్ రాజా రన్’ సినిమాల తర్వాత ‘ప్రతి ఫ్రేమ్‌లో బావున్నాను’ అని ఈ సినిమాకు అనిపించింది.
- సినిమాలో ఓల్డ్ లుక్‌కి కష్టపడలేదు. ఆ గెటప్ వేయగానే హుందాతనం వచ్చింది. యంగ్ లుక్‌లో నేను చిరంజీవి ఫ్యాన్‌లా నటించాను.

**ప్రేక్షకుడికి కొత్త కథను ఇవ్వాలంతే. కచ్చితంగా చూస్తారు. కథను ఎంత చక్కగా చెప్పగలం అన్నదే ముఖ్యం. ఈ ప్రాసెస్‌లో మేం (యాక్టర్స్) కూడా చాలా నేర్చుకుంటున్నాం. కొన్ని సినిమాలు వర్కౌట్ అవుతాయి. కొన్ని అవ్వవు. మా సినిమా చూడలేదంటే అది వాళ్ల తప్పు కాదు. మన తప్పు ఉంది. మంచి కథలు ఎంచుకుంటూ వాళ్లను ఎంటర్‌టైన్ చేయాలి. మంచి కథలు చెబుతూ, ‘యాక్టర్‌గా అన్నీ చేయగలడు’ అనిపించుకోవాలనుకుంటున్నాను.**

**‘రణరంగం’కి వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటంటే సురేఖ ఆంటీ (చిరంజీవి సతీమణి) ఫోన్ చేసి ‘చాలా అందంగా ఉన్నావు. ఎంత బావున్నావో. 80స్ లుక్ భలే కుదిరింది’ అన్నారు. నాక్కూడా పర్సనల్‌గా సినిమాలో ఆ లుక్ చాలా ఇష్టం.**

‘ఘరానా మొగుడు, అల్లుడా మజాకా’ సినిమాల్లో మేనరిజమ్స్‌ని నా స్టైల్లో ఇమిటేట్ చేశాను.
- ‘మాకు మంచి సినిమా తీసి ఇవ్వండి’ అన్నారు నిర్మాత చిన బాబు గారు. సినిమా కోసం నాగవంశీ కూడా చాలా కష్టపడ్డాడు. ఈ బ్యానర్ నుంచి మంచి సినిమాలే వస్తాయి. కుదిరితే ఈ బ్యానర్‌లో మళ్లీ చేస్తా.
- నెక్ట్స్ ‘96, శ్రీకారం’ సినిమాలు చేస్తున్నాను. తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేస్తున్నాను. ‘96’ షూటింగ్ సగం వరకూ వచ్చింది.

## చలో జైపూర్



● ఫ్లయిట్‌లో నయనతార, రజని

రజనీకాంత్ హీరోగా ‘దర్బార్’ అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జైపూర్‌లో ఆరంభం కానుంది. ఈ కొత్త షెడ్యూల్ ఆదివారం ప్రారంభం అవుతుంది. ఇందుకోసం నయనతార, రజనీ తదితరులు జైపూర్ ప్రయాణమయ్యారు. ఈ చిత్రంలో రజనీ పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఇప్పటివరకు జరిపిన షెడ్యూల్స్‌లో పరిశోధనలు, ఫైట్లు.. వీటికి సంబంధించిన సీన్స్ తీశారు. జైపూర్‌లో సాంగ్‌తో పాటు, కీలక సన్నివేశాల చిత్రీకరణకు ప్లాన్ చేశారు. కేసులు, నేరస్థులు, తుపాకులు, పరిశోధనలు.. వీటికి బ్రేక్ ఇచ్చారు రజనీకాంత్. కాస్త రిలీఫ్ కోసం ప్రేయసితో కలిసి డ్యూయెట్ పాడటానికి రెడీ అయిపోయారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో

## అంధ పాత్రపై కన్నేశారా?



● నాని

బాలీవుడ్ సూపర్‌హిట్ మూవీ ‘అంధాధున్’ తెలుగు రీమేక్‌పై నాని కన్ను పడిందని ఇండస్ట్రీ టాక్. ‘అంధాధూన్’లో చూపు లేని పాత్ర చేసిన ఆయుష్మాన్ ఖురానాను అన్ని ఇండస్ట్రీలు తొంగి చూశాయి. ఆయుష్మాన్ పెర్ఫార్మెన్స్‌కు జాతీయ అవార్డు కూడా లభించింది. ఇప్పుడు ఈ చిత్రం తెలుగు రీమేక్‌లో హీరోగా నాని నటిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. హిందీ చిత్రాన్ని శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కించారు. మరి తెలుగు చిత్రాన్ని ఎవరు డైరెక్ట్ చేయనున్నారు అనే విషయం తెలియాల్సి ఉంది.

## పవర్ ఫుల్ రాంగీ



● త్రిష

‘రాంగీ’ అనే తమిళ లేడీ ఓరియంటెడ్ సినిమాలో ఫుల్ యాక్షన్ మోడ్‌లో త్రిష కనిపించనున్నారని తెలిసింది. ఈ సినిమాలో స్టంట్స్ అన్నీ స్వయంగా త్రిషానే చేస్తున్నారు. అది మాత్రమే కాదు.. ఈ సినిమా కోసం బులెట్ నడపడం కూడా నేర్చుకున్నారట. యం. శరవణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఉజ్బెకిస్తాన్‌లో జరగనుంది. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ఎక్కువ యాక్షన్ సన్నివేశాలనే చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది చివర్లో సినిమా రిలీజ్ కానుంది.

## మళ్లీ అశ్చర్యపరుస్తారట



● ప్రశాంత్ వర్మ

ఆశ్చర్య కదా.. ‘అశ్చర్య’ అని ఉందేంటి అనుకుంటున్నారా? అయితే చదవండి. గత ఏడాది ‘అ!’తో అందర్నీ ఆశ్చర్యపరిచారు ప్రశాంత్ వర్మ. ఇప్పుడు ఇంకోసారి అశ్చర్యపరచడానికి ప్రశాంత్ వర్మ సిద్ధమయ్యారని తెలిసింది. నాని నిర్మాణంలో కాజల్ అగర్వాల్, నిత్యా మీనన్, రెజీనా, అవసరాల శ్రీనివాస్ ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం ‘అ!’. ఈ సినిమాకు సీక్వెల్ ప్లాన్ చేశారు ప్రశాంత్ వర్మ. స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని తెలిసింది. ఇందులో కాజల్, తమిళ నటుడు విజయ్ సేతుపతి నటిస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఇంకా నటీనటుల గురించి ఏమీ అనుకోలేదని యూనిట్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.



● పాయల్ రాజ్‌పుత్

**ఆర్‌డీఎక్స్ భారీ పేలుడు పదార్థం. కనిపిస్తున్న స్టిల్ చూస్తుంటే పాయల్ రాజ్‌పుత్ ఆర్‌డీఎక్స్ బాంబ్‌ని తలపిస్తున్నారు కదూ? తేజస్ కంచెర్ల, పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న కొత్త చిత్రం ‘ఆర్‌డీఎక్స్ లవ్’. శంకర్ భాను దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది.**

## వినోదం కోసం పరుగు



● యోగేశ్వర్, మినాల్

యోగేశ్వర్ హీరోగా నటించిన చిత్రం ‘పరారి’. ‘రన్ ఫర్ ఫన్’ అనేది ఉపశీర్షిక. సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో శివానీ షైనీ, అతిథి హీరోయిన్లుగా నటించారు. శ్రీ శంకర ఆర్ట్స్ పతాకంపై ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ ‘గరమ్ గరమ్ మురిగి మసాల..’ అనే ప్రత్యేక పాటతో ముగిసింది. ఈ పాటలో యోగేశ్వర్, మినాల్ నటించారు. రవి అంబట్ల రచించిన ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రాఫర్. ‘‘మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. టీమ్ సహకారం మరవలేనిది’’ అన్నారు యోగేశ్వర్. ‘‘ఫుల్ లెంగ్త్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ చిత్రమిది. యువతకు చిన్న సందేశం ఇచ్చాం. హైదరాబాద్, బ్యాంకాక్‌లో చిత్రీకరణ జరిపాం’’ అన్నారు సాయి శివాజీ. ‘‘ఇందులో సుమన్‌గారు పోలీసాఫర్ పాత్రలో నటించారు. అలీగారు కీలకమైన పాత్రధారి. వినోదం మాత్రమే కాదు.. సస్పెన్స్, థ్రిల్ అంశాలను కూడా జోడించాం’’ అన్నారు గిరి. ‘‘మంచి అనుభవం ఉన్న యాక్టర్‌లా నటించాడు యోగేశ్వర్’’ అన్నారు ప్రత్యూష. ‘‘ఈ సినిమాలో ఆరు పాటలు ఉన్నాయి. ప్రతి పాట బాగా వచ్చింది’’ అన్నారు సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2 | | | | 1 | 6 | | |
| 4 | 9 | 1 | 8 | | | 5 | | |
| | | 3 | 7 | 4 | | 2 | 9 | |
| | | 2 | 4 | | 6 | | | 5 |
| | 1 | | | | | | 2 | |
| 5 | | | 1 | | 7 | 3 | | |
| | 8 | 6 | | 3 | 9 | 7 | | |
| | | 9 | | | 4 | 8 | 5 | 6 |
| | | 4 | 6 | | | | 1 | |

నియమాలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 8 | 1 | 2 | 5 | 7 | 9 | 4 | 3 |
| 7 | 9 | 4 | 3 | 8 | 6 | 2 | 1 | 5 |
| 2 | 3 | 5 | 4 | 1 | 9 | 7 | 6 | 8 |
| 8 | 1 | 6 | 5 | 7 | 3 | 4 | 2 | 9 |
| 5 | 4 | 9 | 1 | 2 | 8 | 6 | 3 | 7 |
| 3 | 7 | 2 | 6 | 9 | 4 | 8 | 5 | 1 |
| 1 | 6 | 8 | 7 | 4 | 5 | 3 | 9 | 2 |
| 9 | 2 | 3 | 8 | 6 | 1 | 5 | 7 | 4 |
| 4 | 5 | 7 | 9 | 3 | 2 | 1 | 8 | 6 |










సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
18-8-2019

స్త్రీ వైశిష్ట్యం -4

# ప్రతి ఇంటా గంట మోగాలంటే

**ఆడపిల్ల మెట్టినింట కాలుమోపిన క్షణం నుంచే అదే తన స్వస్థలం అయినట్లు అక్కడి వారితో మమేక మయి పోతుంది. అది ఒక్క స్త్రీకే సాధ్యం. పరమేశ్వరుడి సృష్టిలో ఉన్న అద్భుతం. అలా ఆమె అక్కడికి చేరుకోకపోతే ఈ సృష్టి లేదు. ఆమెది మహాత్యాగం. అటువంటి స్థితి కాబట్టే.. "యత్రనార్యస్తు పూజ్యంతే.." ఎక్కడయితే స్త్రీలు పూజింపబడతారో, 'రమంతే తత్ర దేవతాః"... అక్కడ దేవతలు సంతోషిస్తూ సంచరిస్తుంటారని అన్నారు.**

పుట్టుకతోటే ఆప్యాయతకు, త్యాగానికి మారుపేరు ఆడపిల్ల. తనని కన్న తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎంత పొగిడినా తెగిడినా అంతగా పట్టించుకోని ఆడపిల్ల కట్టుకున్నవాడు కసురుకున్నంత మాత్రాన కన్నీరు పెడుతుంది. 'నువ్వే నా ఐశ్వర్యానివి' అన్నంత మాత్రం చేత ఉబ్బితబ్బిబ్బయి పోతుంది. అంత ఆర్ద్రత కలిగిన హృదయం పురుషుడికి ఉండదు.

మగపిల్లవాడు ఏ వంశంలో పుట్టాడో ఆ ఒక్క వంశాన్ని మాత్రం తరింప చేయగలడు లేదా ఏడుతరాలో, పదితరాలో తరింపచేయగలడు. అదే ఒక స్త్రీ రెండు వంశాలను ఉద్ధరింప చేయగలదు. ఉత్తమమైన నడవడి కారణంగా ఆ పిల్లను కన్న తల్లిదండ్రులు, వాళ్ళ వంశం తరిస్తుంది. మెట్టినింటికి వెళ్ళి ఆ వంశాన్ని తరింప చేస్తుంది.

పురుషుడి ధర్మం అంతా స్త్రీ మీదనే ఆధారపడి ఉంటుంది. అందుకే ఆర్షధర్మంలో 'పత్ని' అనే మాట వాడతారు. పత్ని అంటే తనతో కలిసి యజ్ఞయాగాది క్రతువుల్లో పీటమీద కూర్చునే అధికారాన్ని పొందిన స్త్రీని పత్ని అంటారు. భార్య–అంటే తన చేత భరింపబడునది అన్న అర్థం కారణంగా ఆ మాటను ఎక్కువగా ఉపయోగించరు. ఒక దేవాలయానికి వెళ్ళి పూజచేసినా, హోమం చేసినా, యజ్ఞం చేసినా... 'ధర్మపత్నీ సమేతస్య..' అంటారు. 'ధర్మపతీ సమేతస్య...' అనరు. ఆమెయే ధర్మానికి మారుపేరు. ఆమె లేని నాడు పూజ లేదు. శాస్త్రం ఆధారంగానే మాట్లాడుతున్నా... ఇవి నా సొంతమాటలు కావు. శాస్త్రం...


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ప్రతి ఇంటా గంట తప్పనిసరిగా మోగాలంటుంది. అంటే పూజ జరగాలి – అని. అది ధర్మపత్ని ఉంటేనే సాధ్యం. ధర్మమే రాశీభూతమై ధర్మస్వరూపిణిగా వస్తుంది. ఆమె మళ్ళీ వేరుగా పూజ చేయాల్సిన అవసరం లేదు. తాను ఉదాత్త సంస్కారవతియై సంసారాన్ని ఉద్ధరిస్తుంది. ఆమె లేకుండా భర్త చేసిన పూజ నిష్ప్రయోజనం అవుతుందంటుంది శాస్త్రం. బ్రహ్మచర్యం దాటాడు, గృహస్థాశ్రమంలోకి వెళ్ళాడు. ఆ తరువాత ఆచమనీయానికి నీళ్ళను ఎడమ చేత్తో వేసుకోకూడదు. పూజాప్రారంభంలో ఆమె వచ్చి ఆయన ఎడమ పక్కన నిలుచుని ఆచమనీయం వేస్తేనే అతడి పూజ ప్రారంభం. అందుకే దేశకాల సంకీర్తనం లో 'ధర్మపత్నీ సమేతస్య...' అని చెప్పేది.

పైగా ఆమె ఉన్నది కనుక కామం ధర్మం చేత ముడిపడుతుంది. కామం విశృంఖలత్వాన్ని పొందితే లోకంలో ధార్మికమైన సంతానోత్పత్తి ఉండదు. వావి వరుసలు ఉండవు. అందుకే తన కామాన్ని ధర్మంతో ముడివేస్తున్నాడు. 'నాతి చరామి' అంటే... 'నేనీమెను అతిక్రమించను' అని ఇద్దరూ అంగీకరించుకున్న తరువాతనే ఆమె చెయ్యిపట్టుకుంటున్నాడు. ఇప్పుడు ఆయన తేజస్సును ఆమె భరిస్తుంది. అలా కామాన్ని ధర్మంతో ముడిపెట్టడంతో సమాజం సుఖశాంతులతో సజావుగా ధార్మికంగా సాగుతున్నది. అర్థం, ధర్మం, కామం ముడిపడ్డాయి.



# కలియుగ కల్ప వృక్షం

**తెలుగువారు గొప్ప పుణ్యం చేసి ఉంటారు. కాకపోతే మరేంటి! దేశమంతా గోవిందా గోవిందా అని తల్చుకుంటూ చేరుకునే ఏడుకొండల శ్రీనివాసుడు మన దగ్గరే ఉన్నాడు. వైష్ణవులంతా అవతార పురుషునిగా భావించే రాఘవేంద్రుడూ ఇక్కడే ఉన్నాడు. ఈ శ్రావణ బహుళ విదియనాటికి (ఆగస్టు 17), రాఘవేంద్రస్వామివారు సజీవ సమాధిని పొంది సరిగ్గా 348 ఏళ్లు పూర్తి కావస్తున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి గురించి...**

మానవ కళ్యాణం కోసం వెలిసిన మహిమాన్విత మహనీయుడు శ్రీరాయలు. బృందావనం నుంచే సజీవుడిగా వుండి భక్తుల మొర ఆలకిస్తున్న దేవుడు రాఘవేంద్రస్వామి. ''నేను, దేవుడు ఒకటికాము మేమిరువురము వేరువేరు. అతడు ఈశుడు, నేనా తని దాసుడను మాత్రమే'' అని చెప్పే ద్వైత సిద్ధాంతాన్ని ప్రవచించిన మధ్వాచార్యుల బోధనల వ్యాప్తి కోసం ప్రచారం చేసిన వారే శ్రీ రాఘవేంద్రస్వామి. మధ్వ సిద్ధాంతం ప్రకారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పూజలు సాగుతున్నాయి. మధ్వ సిద్ధాంత ప్రచారం సాగిస్తూ మానవ కళ్యాణం కోసం యోగిగా మారిన మహానుభావుడు శ్రీ రాయలు.

క్రీ.శ.1595 సంవత్సరం, మన్మథ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ సప్తమీ మృగశిరా నక్షత్రంలో తిమ్మన్నభట్టు, గోపాంబ దంపతులకు కలిగిన సంతానమే సన్యాసం తీసుకున్న తరువాత రాఘవేంద్రునిగా మారిన రాజయోగి.



శ్రీ రాఘవేంద్ర తీర్థులు తంజావూరు, వెల్లూరు, శ్రీరంగం, రామేశ్వరం, మధుర మొదలగు ప్రాంతాలలో పర్యటన చేసి మధ్వప్రచారం గావించి వేదాంత చర్చలు జరిపి అనేకమంది పండితులను ఓడించాడు. రాఘవేంద్ర తీర్థులు శ్రీ వ్యాస తీర్థులు వ్రాసిన 'చంద్రిక' అనే గ్రంథానికి 'ప్రకాశం' అనే వివరణ రాశారు. న్యాయముక్తావళి, 'తంత్రీ దీపిక'సుధ, పరిమళ అనే మున్నగు గ్రంథాలను వ్రాసారు. భక్తులకు అనేక మహిమలు కూడ చూపాడు. ఆదోని పర్యటనలో స్వామి వున్నప్పుడు, ఆదోనిని పాలించే సిద్ధి మసూద్‌ఖాన్ అనే రాజు రాఘవేంద్రుని సభకు ఆహ్వానించారు.



స్వామిని పరీక్షించటానికి పళ్ళెంలో మాంసం ముక్కలు పెట్టి దానిపై గుడ్డకప్పి స్వీకరించమని చెప్పారు. స్వామి వెంటనే ఆ పళ్ళెంపై మంత్రజలం చల్లగా మాంసం పువ్వులుగా మారాయి. దాంతో సిద్ధిమసూద్‌ఖానే స్వామి మహత్యం తెలుసుకొని రాఘవేంద్రుని కోర్కె మేరకు 'మంచాల' గ్రామాన్ని దత్తతగా ఇచ్చారు. మంచాలమ్మ దేవత కొలువై వున్న మంచాల గ్రామంలోనే శ్రీ రాఘవేంద్రులు మఠం ఏర్పాటుచేసుకొని భక్తులకు మహిమలు చూపుతూ, మరోవైపు మధ్వప్రచారం సాగిస్తూ శ్రీ రాఘవేంద్రులు క్రీ.శ.1671, విరోధికృత్ శ్రావణ బహుళ ద్వితీయరోజున రాఘవేంద్రులు సశరీరంతోనే బృందావనం ప్రవేశం చేసారు.

స్వామి బృందావనం చేసిన మంచాల గ్రామం మంత్రాలయ నేడు ఒక మహా పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. ఆనాటి నుంచి ఈ బృందావనం నుంచే స్వామి భక్తుల కోర్కెలు తీర్చుతూ రాఘవేంద్రస్వామిగా పూజలు అందుకుంటున్నాడు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా, సాహితీవేత్తగా, మహిమలు చూపే మహనీయుడుగా పూజలు అందుకున్న రాఘవేంద్రులు భక్తుల హృదయాలలో కొలువై ఉన్నారు. కలియుగ కల్పవృక్షంగా భక్తులు కొలుస్తారు.

**అందుకే ఆయన దేవుడయ్యాడు...**

శ్రీ గురు రాఘవేంద్రుల వారి పాదాలను స్మరించుకుంటూ భక్తి ప్రపత్తులతో గురుస్తోత్రాన్ని పఠించే వారికి దుఖాలు దూరమౌతాయి. గురువుల అనుగ్రహం కలుగుతుందని విశ్వాసం.

రాఘవేంద్ర స్వామివారి మూల మంత్రం

***పూజ్యాయ రాఘవేంద్రాయ***
***సత్యధర్మ రతాయచ***
***భజతాం కల్పవృక్షాయ నమతాం కామ ధేనవే***

***ఆ అక్షతలే లక్షింతలుగా...***

పూజ్య రాఘవేంద్ర స్వామి వారి బృందావన దర్శనానికి వచ్చిన భక్తులకు మఠాధిపతులు పరిమళ భరితమైన మంత్రాక్షతలను లేదా మృత్తికను ఇచ్చి ఆశీర్వదిస్తుంటారు. స్వామివారు భౌతిక శరీర ధారులై ఉన్నప్పటినుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. స్వామి తన భక్తులకు స్వయంగా ఇచ్చిన మృత్తిక కూడా ఎంతో మహిమాన్వితమైనదిగా పేరొందింది. పవిత్రమైన ఈ కుంకుమాక్షతలను భక్తులు ఇళ్లకు తీసుకువెళ్లి శుభకార్యాలలోనూ, ఇతరత్రా ఏమైనా ఆపత్సమయంలోనూ శిరస్సున ధరిస్తుంటారు.

***మహా రథోత్సవం***

ప్రతి యేటా శ్రావణ మాసంలో జరిగే రాఘవేంద్రుల ఆరాధనోత్సవానికి భక్తులు భారీ ఎత్తున హాజరవుతారు. ఇప్పటికే బుధవారం నాడు అంకురార్పణతో ఆరంభమైన ఈ ఉత్సవాలు శుక్ర, శని వారాలలో జరిగే పూర్వారాధన, మధ్యారాధన, నేడు జరగనున్న ఉత్తరారాధనగా జరుగుతాయి. ఈ రోజున మంత్రాలయంలో జరిగే మహా రథోత్సవం అత్యంత వైభవంగా... కన్నుల పండువగా జరుగుతుంది. ఆఖరిరోజైన 20వ తేదీన అనుమంత్రాలయంగా పేరొందిన తుంగభద్ర గ్రామంలో జరిగే రథోత్సవంతో స్వామివారి ఆరాధనోత్సవాలు ముగుస్తాయి.

గురు సన్నిధి

# ఉడియా బాబాజీ

నేను ఎవరిని? భగవంతుడు ఎవరు? ఈ ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు? ఇలాంటి ప్రశ్నల పరంపర వారి మెదడును తొలిచేస్తుంటే సమాధానం కోసం తిరగని ప్రదేశం లేదు. వెతకని ఆశ్రమం లేదు. కానీ సందేహం తొలగదు. మార్గం దొరకదు. ఇక మరణమే శరణ్యమని నిశ్చయించిన స్థితిలో సాక్షాత్తూ పరమేశ్వరుడే కలలో కనబడి మార్గనిర్దేశం చేయడంతో వారి ఆందోళన శాంతించింది. జ్ఞాన రసధార ప్రవహించింది. అనంతర కాలంలో మహామహులకు సైతం తన బోధలతో విజ్ఞానసుధలను పంచిన ఆ మహానుభావులే శ్రీ ఉడియాబాబాజీ.

ప్రఖ్యాత జగన్నాథ క్షేత్రమైన పూరి వీరి జన్మస్థలం. నిష్ఠాగరిష్ఠులైన తల్లిదండ్రులు పెట్టినపేరు ఆర్తత్రాణమిశ్ర. చిన్నతనంలో మిగతా పిల్లలంతా హుషారుగా ఆటలలో మునిగితే తనుమాత్రం అనాసక్తంగా ఉండేవారు. చదువుపై మాత్రం శ్రద్ధ చూపేవారు. విద్యనభ్యసించేందుకు కొంతకాలం ఇల్లు విడిచిన సందర్భంలో ఒకనాడు వీరి చెవినబడిన ఆదిశంకరుల వివేకచూడామణి వీరిలో వైరాగ్య భావనలను పెంచింది. దాంతో పూరీ జగద్గురువులవద్ద సన్యాసాశ్రమ స్వీకారం చేసి పూర్ణానందతీర్థ అనే ఆశ్రమ నామధేయాన్ని పొందారు. కానీ ప్రజలంతా పిలుచుకునే ఉడియా బాబాజీ అనే పేరుతో ప్రసిద్ధమయ్యారు.



కోరికలు లేకపోతే శాంతి సన్యాసదీక్ష స్వీకరణతో తృప్తి చెందలేదు. వరించి వచ్చిన పీఠాధిపత్యాన్ని వలదనుకున్న ఉడియాబాబాజీ యోగ సాధన కోసం ఎంతోమంది గురువులను ఆశ్రయించారు. పరమేశ్వరుడి అనుగ్రహం కలిగి చివరకు కోరికలు లేని జీవనమే శాంతిని ప్రసాదిస్తుందని తెలుసుకుని సాధన ప్రారంభించారు. జ్ఞాన సముపార్జన చేసారు.

**మనస్సును ఖాళీగా ఉంచొద్దు**

కొంతకాలం తరువాత శ్రీ కృష్ణుని పుణ్యక్షేత్రమైన బృందావనంలో ఆశ్రమాన్ని స్థాపించి భక్తులకు సత్సంగాలను ఉపదేశిస్తుంటే భక్తులు తన్మయత్వంతో రాత్రిపగలు తేడా మరచి వింటుండేవారు ''మనస్సు భగవంతుడిపై లగ్నమవకపోతే ఇతర విషయాలపై ఆలోచిస్తుంది. అందుకని దానిని ఖాళీగా ఉంచకుండా సదా భగవంతుడిపై నిమగ్నమయ్యేలా చేస్తే ఇతర విషయాలకు మనస్సులో చోటుండదని ఉపదేశించేవారు. హింస, అసత్యం మొదలైన వాటిని విడవడంవల్ల శరీరశుద్ధి అవుతుంది. నామ జపంతో వాక్కు, దానంవల్ల ధనం, ధ్యానంవల్ల అంత:కరణ శుద్ధి అని ఉడియాబాబాజీ అంటారు.

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని,**
వేదపండితులు

# చిరస్మరణీయులు

పూర్వం ఇరాక్ దేశంలో నమ్రూద్ అనే చక్రవర్తి ఉండేవాడు. పరమ దుర్మార్గుడు. తనది సూర్య చంద్రాదుల వంశమని, తాను దైవాంశ సంభూతుడినని ప్రకటించుకొని నిరంకుశంగా పరిపాలన చేస్తుండేవాడు. రాజు మాట వేదవాక్కుగా పరిగణించబడేది. ప్రజలంతా బానిసలుగా బతకాల్సిన పరిస్థితి. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మాట్లాడడం కాదుగదా, కనీసం అలా ఊహించడానికే ప్రజలు గడగడలాడేవారు.

అలాంటి పరిస్థితుల్లో రాజ దర్బారులో పూజారిగా పని చేస్తున్న 'అజర్' ఇంట ఓ బాబు జన్మించాడు. అతని పేరే ఇబ్రాహీం. ఆయన్ని దేవుడు తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. నమ్రూద్ దైవత్వానికి, రాచరికపు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పారు. ఆనాడు సమాజంలో పాతుకుపోయి ఉన్న వివిధ రకాల దురాచారాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. విగ్రహారాధనను ఖండించారు. తనయుని వైఖరి తండ్రికి నచ్చలేదు.మందలించాడు. చంపేస్తానని బెదిరించాడు. అయినా ఇబ్రాహీం అలైహిస్సలాం తన వైఖరి మానుకోలేదు. విషయం తెలుసుకున్న నమ్రూద్ ఇబ్రాహీం గారిని తన దర్బారుకు పిలిపించాడు. 'నా దైవత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నావట. ఎవరో కనబడని దేవుణ్ణి గురించి చెబుతున్నావట. ఎవరా దేవుడు చెప్పు?'అని గర్జించాడు.



ప్రశాంతచిత్తంతో మౌనంగా నిలబడి ఉన్న ఇబ్రాహీం ఏమీ మాట్లాడలేదు.

దీంతో.. 'మాట్లాడవేం.. నీ దేవుడెవరో చెప్పు?' అంటూ మళ్ళీ గాండ్రించాడు.

అప్పుడు ఇబ్రాహీంగారు, 'మహారాజా..! ఎవరి ఆధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నా ప్రభువు, ఆయనే మనందరి దేవుడు.' అన్నారు.

'..అలాగా..! అయితే చూడు..' అంటూ ఒక ఉరిశిక్ష పడిన ఖైదీని, నిరపరాధి అయిన మరొక అమాయకుడిని పిలిపించాడు. మరణ శిక్ష విధించబోయే ఖైదీని విడుదల చేస్తూ, అమాయక యువకుణ్ణి చంపేశాడు.' తరువాత..,

'ఇప్పుడు చెప్పు. చావబోయేవాడికి జీవితం ప్రసాదించాను, బతకవలసిన వాణ్ణి చంపేశాను. అంటే జీవన్మరణాలు నా చేతిలో ఉన్నాయి.. మరి నేను దేవుణ్ణి కానా..?' అంటూ చూశాడు గర్వంగా..

ఓహో.. జీవన్మరణాల అర్థాన్ని ఈవిధంగా అన్వయించుకున్నావా..? అని మనసులో అనుకున్న ఇబ్రాహీం, 'సరే అయితే, దేవుడు సూర్యుణ్ణి తూర్పున ఉదయింపజేసి, పశ్చిమాన అస్తమింపజేస్తాడు. మరి నువ్వు, పశ్చిమాన ఉదయింపజేసి, తూర్పున అస్తమించేలా చేయి.' అని సవాలు విసిరారు. దీంతో దైవద్రోహి అయిన నమ్రూద్ కు నోట మాట రాలేదు. గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

'ఇతణ్ణి తీసుకెళ్ళి భగభగ మండే అగ్నిగుండంలో వేసి కాల్చిచంపండి.' అని ఆదేశించాడు.

రాజాజ్ఞ క్షణాల్లో కార్యరూపం దాల్చింది. పెద్ద అగ్నిగుండం రాజేసి, కణకణ మండుతూ ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అగ్ని కీలల్లో ఆయన్ని విసిరేశారు. కాని దేవుని ఆజ్ఞతో అగ్ని తన కాల్చే గుణాన్ని కోల్పోయింది. ఇబ్రాహీం పాలిట పూల పానుపుగా మారిపోయింది. ఆయన సురక్షితంగా బయట పడ్డారు.

తరువాత ఇబ్రాహీం ప్రవక్త స్వదేశాన్ని విడిచి పెట్టి ఇతరప్రాంతాలకు వెళ్ళిపోయారు. సత్యధర్మాన్ని, దేవుని ఏకత్వాన్ని బోధిస్తూ, మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ వివిధ ప్రాంతాలు పర్యటించారు. ఈ క్రమంలో ఆయన అనేక కష్టనష్టాలు, పరీక్షలు ఎదుర్కొన్నారు. దైవాజ్ఞ మేరకు భార్యాబిడ్డల్ని నిర్జన ఎడారి ప్రాంతంలో వదిలేయడం, కన్నకొడుకును దైవమార్గంలో త్యాగం చేయడం మానవ జాతి చరిత్రలో చిరస్మరణీయ పరిణామాలు. దైవాదేశ పాలనలో తన సమస్తాన్నీ సమర్పించిన త్యాగధనుడు కనుకనే ఐదువేల సంవత్సరాలు గడిచినా చరిత్ర ఆయన్ని స్మరించుకుంటూనే ఉంది. ప్రతియేటా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజం జరుపుకునే 'ఈదుల్ అజ్ హా' పర్వదినం ఆ మహనీయుని త్యాగస్మరణే.

ఆయన నిలిచిన ప్రదేశం, నిర్మించిన కాబాలయం, జమ్ జమ్ జలం, సఫా, మర్వాల సయీ, ఆయన, ఆయన కుటుంబం నడయాడిన నేల, వారి ఒక్కోఆచరణ ప్రళయకాలం వరకూ, సందర్శనీయ, స్మరణీయ ఆచరణలుగా దేవుడు నిర్ధారించాడు. ఈ అన్నిటికీ అసలు ప్రేరణ అల్లాహ్ సంతోషం, శాశ్వత సాఫల్యం. ఎవరికైనా అంతకన్నా కావలసింది ఇంకేముంటుంది? సత్యం కోసం, ధర్మం కోసం, ధర్మ సంస్థాపన కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని ప్రకటించిన ఆ మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం కావాలి.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

ధర్మ జిజ్ఞాస

**విజయవాడ కనకదుర్గమ్మ ముక్కు పుడకను కృష్ణమ్మ అందుకుంటే కలియుగం అంతమవుతుందంటారు. నిజమేనా?**

**– బొమ్మారెడ్డి సునీత, సత్తుపల్లి**

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం గారు కాలజ్ఞానంలో ఎన్నో విషయాలు చెప్పారు. ధూమశకటాలు నడుస్తాయని, ముఖానికి రంగేసుకున్న వారు దేశనాయకులవుతారనీ, భర్తలేని స్త్రీ రాజ్యమేలుతుందనీ, తాగే మంచినీళ్ళు కొనుక్కుంటారనీనీ. ఆయన చెప్పిన వన్నీ జరిగాయి. విజయవాడ కనకదుర్గమ్మ ముక్కు పుడకను కృష్ణమ్మ అందుకుంటే కలియుగం అంతమయిపోయినట్టే. లౌకికంగా ఆలోచించి చూస్తే అంత ఎత్తున కృష్ణమ్మ ఎగిస్తే ఇక భూమి మీద ఏం మిగులుతుంది?

***

**మంగళ, శుక్రవారాలు ఇతరులకు డబ్బు ఎందుకివ్వరు?**

**– పి. సోములు, కాటేపల్లి**

నిజానికి ఇందులో శాస్త్ర ప్రమాణం ఏమీ లేదు. మంగళ వారాన్ని మంగళ గౌరికి, శుక్రవారాన్ని మహాలక్ష్మికి ప్రీతికరమైనవిగా పెద్దలు చెబుతారు. డబ్బు లక్ష్మీస్వరూపంగా భావిస్తారు కాబట్టి ఆ రెండు రోజులలోనూ మన చేతి నుండి డబ్బు బయటికి పోవడం మంచిది కాదేమో ననే భావనే ఆ విధమైన నమ్మకానికి నాంది పలికి ఉండవచ్చు. ఇందులో లౌకికంగా ఉన్న విషయమేమంటే... సంపాదించేవాడు సంపాదిస్తుంటే ఖర్చు చేసేవాళ్ళు ఖర్చు చేస్తారు. కనీసం ఆ రెండు రోజులైనా ఆ సోమరితనాన్ని ఆపాలన్న ప్రయత్నం. అలాగే అమావాస్యనాడు కూడా అప్పు ఇవ్వరు. ధనాన్ని అదుపు చేయటానికి ఇది మంచి పద్ధతే అయినా మనకి గానీ, ఇతరులకు గానీ ఆపద సమయాల్లో ఈ నియమం పనికి రాదు. ఇలా చెయ్యటం వల్ల మరింత ధనం పోతుంది.

***

**దేవతలు మనం పెట్టే నివేదనలు ప్రత్యక్షంగా తినరు కదా! మరి వారికి ఎందుకు నివేదించాలి?**

**– జి. శకుంతల, హైదరాబాద్**

ఇంటిలోని పూజామందిరంలో కాని ఆలయంలో కాని దేవత అంటూ ఉన్నాక నివేదన తప్పనిసరి. అతిథిని ఇంటికి పిలిచాక భోజనం పెట్టకుండా ఊరుకుంటామా? ఎవరైనా మహాత్ముడో, సిద్ధ పురుషుడో ఇంటికి వస్తే భోజనం పెట్టకుండా ఉండగలమా? అదేవిధంగా ఇదీనూ. అన్నాన్ని నివేదన చేసేటప్పుడు దానికొక శక్తి వస్తుంది. మామూలుగా వండుకు తింటే వేరే విషయం. అయితే దేవతలు దర్శనమాత్ర సంతుష్టులు. మానవుడు తింటే సంతోషిస్తాడు, దేవత దర్శిస్తే సంతోషిస్తుంది. అందుకే దేవతకి పదార్థం నివేదిస్తాం. దేవతా దృష్టి పడగానే అన్నగత దోషాలు తొలగి, అన్నం పవిత్రమౌతుంది. అలా తిన్న అన్నం మనలో మంచి సంస్కారాలను పెంచుతుంది. అందుకే దేవతకి నివేదించేటప్పుడు చాలా శుచిగా, జాగ్రత్తగా వండాలి.

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

తాత్త్వికథ

# గురువైన పింగళ

పింగళ ఒక గణిక . గణికలు ప్రేమనుపెంచుకుంటారు, మనుషులమీదకాదు, ధనంమీద. పింగళ ఇందుకు అతీతంకాదు. ఒకరోజు శూలభద్రుడనే ఆచార్యులు గణికవాడలో పింగళను చూసి మోహించాడు. ఆ విషయాన్ని ఆమెకు తెలియజేశాడు కూడా. అందుకు పింగళ సమ్మతించలేదు. ''ఆచార్యా' నా ఇంటి తలుపులు అందరికీ తెరిచే వుంటాయి. వచ్చే వారెవరయినా, వారికి సుఖాన్ని యివ్వడం నా ధర్మం. నాకు ప్రేమలేదు. నాకు మూల్యముంది. నా మూల్యం రోజుకు వంద స్వర్ణముద్రలు.'' అని నిర్మొహమాటంగా చెప్పింది. సరేనని చెప్పి వెళ్ళిపోయాడు ఆచార్యులు. పింగళ వేచి చూస్తుంటుంది. శూలభద్రాచార్యులు రావడం ఆలస్యమవుతుంది. పింగళకు తన ఎదురుచూపులకు తనపై తనకే అసహ్యం కలుగుతుంది. ఆమె ఆలోచించడం మొదలుపెట్టింది. ''నేనెందుకు ఎదురు చూడాలి? ఎవరికోసం ఎదురు చూడాలి? నా శరీరాన్ని కోరుకొనే వారి కోసమా? ప్రతిక్షణం చస్తూ కోరికలతో బతకడం ఏమంత భాగ్యం? ఈ కామాగ్నిలో నా శరీరం ముక్కలైపోతుంది. అందులోనే సుఖాన్ని వెదుక్కొంటున్నాను. నాపై నాకే అసహ్యంగా వుంది.'' అనుకుంటుండగా అప్పుడే వచ్చి వెనుక నిలబడి, ఆచార్యులు విన్నారు. అప్పుడాయన పింగళకు వంద స్వర్ణముద్రలిస్తూ, ''ఇవి నీ శరీరానికి కాదు. నన్ను నేను తెలుసుకున్నందుకు. కామాగ్నితో సతమతమౌతున్న నాకు నీమాటలు ఆత్మ జ్ఞానాన్ని కలిగించాయి. ఈ స్వర్ణముద్రలు నీకు గురుదక్షిణగా యిస్తున్నాను'' అంటూ ఆమె కాళ్ళకు నమస్కరించి, స్వర్ణముద్రలు ఆమె పాదాల వద్ద వుంచారు. అలా పింగళ ఆయనకు గురువయింది. అవును, ఎవరినుంచి అజ్ఞానం తొలగిపోతుందో, ఎవరు అజ్ఞానాన్ని తొలగిస్తారో, వారే గురువులు కదా! దత్తాత్రేయుని 24 మంది గురువులలో పింగళ ఒకతె. ఆమె గురించి దత్తాత్రేయులవారు కూడా ఘనంగా చెప్పారు.



**– విశ్వేశ్వరవర్మ భూపతిరాజు**

సువార్త

# దైవజ్ఞానమే దీవెన

నీకున్నదంతా వదిలేసి నేను చూపించబోయే దేశానికి వెళ్ళమని దేవుడు ఆజ్ఞాపిస్తే, అబ్రాహాము మరో ప్రశ్న దేవునికి వెయ్యకుండా సంపూర్ణ విధేయతతో తానున్న గొప్ప మెసొపొటేమియా ప్రాంతాన్ని వదిలి అదేమిటో కూడా తెలియకుండానే కనాను దేశానికి వెళ్లి అక్కడ స్థిరపడ్డాడు. దాదాపు ఏడొందల ఏళ్ళ తర్వాత ఆయన సంతానమైన ఆరు లక్షలమంది ఇశ్రాయేలీయులు ఐగుప్తు వదిలి అదే వాగ్దాన దేశానికి అరణ్యం గుండా మళ్ళీ వెళ్తున్నపుడు, 'కనాను దేశమెలా ఉంటుందో, అక్కడి పరిస్థితులేమిటో తెలుసు కునేందుకు మొదట మన వాళ్లలో కొందరిని అక్కడికి పంపిద్దాం' అని సూచిస్తే, దేవుని సమ్మతితో గోత్రానికి ఒక్కరు చొప్పున 12 మందిని కనాను దేశానికి మోషే పంపాడు. దేవుని నిర్ణయాలకు నిర్ద్వంద్వంగా తలవంచిన అబ్రాహాము విశ్వాసానికి, 'ముందు ఆ దేశాన్ని చూద్దాం ఆ తర్వాతే అక్కడికెళదాం' అన్న ఇశ్రాయేలీయుల అవిశ్వాసానికి అసలేమైనా పోలిక ఉందా? మరేం జరిగింది?' అంత గొప్ప దేశాన్ని, అంతటి బలవంతులను మనలాంటి బలహీనులు ఎలా స్వాధీనం చేసుకుంటారంటూ అవిశ్వాసంతో గుండెలు బాదుకొంటూ మాట్లాడిన పదిమందిని బట్టి, యెహోషువ, కాలేబు తప్ప మిగిలిన ఆరు లక్షలమందీ దేవుని ఉగ్రత వల్ల అరణ్యంలోనే రాలిపోగా, అరణ్యంలో జన్మించిన వారి సంతానమైన కొత్త తరం మాత్రమే వాగ్దాన దేశాన్ని చేరింది (ద్వితీ 1:22–40).



అందుకే జీవం, మరణం కూడా మన నాలుక వశంలోనే ఉంటాయని బైబిల్ బోధిస్తోంది (సామె 18:21). తనను తాను ఓడించుకోవడంలో, తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవడంలో మనిషి తనకు తానే సాటి. కారు చీకట్లో తదుపరి అడుగు ఎక్కడ పడబోతోందో తెలియకున్నా, తనను నడిపించే దేవుని నమ్మి అద్భుతంగా, అత్యంత భద్రంగా విశ్వాస ప్రయాణాన్ని పూర్తి చేసి గమ్యాన్ని చేరిన అబ్రాహాము కోవకు చెందిన విశ్వాసులు కొందరైతే, జీవితంలో ప్రతి అడుగు ఆచి తూచి వేస్తూ,'గొప్ప ప్లానింగ్'తో ముందుకు సాగాలన్న లోకజ్ఞానంతో ప్రయాణించి గమ్యం తప్పి, అగాధమైన గుంటలో పడే అవిశ్వాసులు చాలా మంది. దేవుని వాగ్దానాలు, నిర్ణయాలు ఎప్పటికీ నమ్మదగినవే, శిరోధార్యమే!! విశ్వాసానికి లోకజ్ఞానాన్ని జోడిస్తే అదే అవిశ్వాసమవుతుంది. ఆ అవిశ్వాసం వల్లనే చాలా జీవితాల్లో శాపాలు, అపజయాలు, అనర్థాలు. అందుకే విశ్వాస ప్రయాణం మన పంచేంద్రియాల పర్యవేక్షణలో కాకుండా, పరిశుద్ధాత్ముని నేతృత్వంలో సాగాలన్నది మనపట్ల దేవుని నిత్య సంకల్పం (2 కొరింథీ 5:6). పంచేంద్రియాల శక్తినే మహా జ్ఞానమనుకొంటున్న నేటి 'భ్రష్ట సంస్కృతి'కి పూర్తిగా భిన్నమైనది దేవుని సన్నిధి, వాగ్దానాలతో కూడిన దైవజ్ఞానం. దైవజ్ఞానం అనే పవిత్రమైన తైలంతో నిండిన విశ్వాసిలో లౌక్యం, లాభార్జన, స్వార్థం, పేరుప్రఖ్యాతులతో కూడిన 'లోకజ్ఞానం' అనే నీళ్ల ఏ మాత్రం ఇమడవు. దైవజ్ఞానానికి, లోకజ్ఞానానికి మధ్య, తోటకూరకు, కలుపుమొక్కకు, తేనె చుక్కకూ, ఆముదానికీ మధ్య ఉన్నంత తేడా ఉంటుంది. తన జ్ఞానంతో మనిషి అత్యున్నత శిఖరాలకు ఎదగడం దేవునికి కూడా ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. అయితే ఆ జ్ఞానం మనిషిని దేవుని నుండి, మానవీయ, నైతిక విలువల నుండి వేరు చేస్తేనే సమస్యలొస్తాయి. పరలోకాన్ని, అపారమైన ఆశీర్వాదాలనూ పొందేందుకు దేవుని విశ్వసించాలి, దైవజ్ఞానాన్నిచ్చే బైబిల్ను విశ్వాసి శ్రద్ధగా చదవాలి. ఆ దైవజ్ఞానం లేనందువల్లే ఆనాడు లక్షల మంది ఎంతో తెలివున్నా అవిశ్వాసులై అరణ్యంలో రాలిపోయి, పరలోకానికి సాదృశ్యమైన వాగ్దాన దేశాన్ని స్వతంత్రించుకోలేక పోయారు.

**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్,**
prabhukirant@gmail.com

ప్రశ్నోత్తర భారతం



314. కుంతి కనులు తెరిచి చూసేసరికి ఏమైంది?
315. సూర్యుని వరంతో ఏం జరిగింది?
316. కర్ణుడు ఎలా ఉన్నాడు?
317. కర్ణుడిని కుంతి ఏం చేసింది?
318. కుంతి ఏమని నిశ్చయించుకుంది?
319. గంగలో కొట్టుకుపోతున్న పెట్టెను ఎవరు చూశారు?

**పాండురాజు కథ**

320. కుంతి భోజుడు కుంతికి వివాహం చేయదలచి ఏం చేశాడు?
321. పాండురాజు ఎటువంటివాడు?
322. లొంగిపోయిన రాజులంతా ఏమేమి బహుమతిగా ఇచ్చారు?
323. పాండురాజు తన శక్తితో ఏమేమి సాధించాడు?
324. పాండురాజు తను తెచ్చిన సంపదలను ఏం చేశాడు?

**– నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ**

జవాబులు: 314) సూర్యుడు వెళ్లిపోయాడు. చుట్టూ అడవి ఉంది. జరిగిన విషయం తెలుసుకుని, కుంగిపోయింది. 315) కుంతి గర్భవతి అయ్యింది. కర్ణుడికి జన్మనిచ్చింది. 316) సహజ కవచకుండలాలతో తేజోవంతుడిగా ప్రకాశించాడు. అందంగా ఉన్నాడు. 317) లోకం పోకడ గుర్తుకు వచ్చి, కుంతి బిగ్గరగా ఏడ్చింది. 318) బిడ్డను ఒక పేటికలో ఉంచి, ముద్దాడి, గంగలో విడిచి, కన్నీరుమున్నీరుగా విలపించి ఇంటికి చేరింది. 319) ఒక సూతుడు ఆ బాలుడిని చూసి ముద్దాడి, తన భార్య ఒడిలో ఉంచాడు. నాటి నుంచి ఆ బాలుడు రాధేయుడయ్యాడు. 320) స్వయంవరం ప్రకటించాడు. ఆ స్వయంవరంలో పాండురాజు భీష్ముని అనుమతితో కుంతిని పొందాడు. 321) మహావీరుడు. చతురంగబలాలను సమకూర్చుకున్నవాడు. అతడి దిగ్విజయ యాత్రలో అతని ప్రతాపాగ్ని ముందు రాజులు నిలువలేకపోయారు. నలుదిక్కుల రాజులు అతనికి లొంగిపోయి, ఆశ్రయం పొందారు. 322) గుర్రాలు ఇచ్చారు. ఏనుగులు అర్పించారు. బంగారం, కన్యకలను బహూకరించారు. ధన రాసులను కానుకలుగా అర్పించారు. కోట్ల ధనం కప్పంగా ఇచ్చారు. 323) పాండురాజు సకల భూమండలాన్ని ఆక్రమించాడు. ఇంద్రునిలా ప్రకాశించాడు. సకల ధన రాసులతో హస్తినకు వచ్చాడు. 324) కొంత సంపదను భీష్మునికి, కొంత సత్యవతికి ఇచ్చాడు, తల్లులైన అంబిక, అంబాలికలకు కొంత, మరి కొంత విదురునికి ఇచ్చాడు. పాండురాజు తెచ్చిన ధనంతో ధృతరాష్ట్రుడు వంద అశ్వమేధ యాగాలు నిర్వహించాడు.

ఆలయం ఆగమం

# అద్భుత సదనం అష్టాంగ విమానం

ఆలయంలో దేవుడి విగ్రహం ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. విమానంపై దేవతా విగ్రహాలు ఉండటం కూడా మనకు తెలుసు. కానీ గర్భగుడిలో ఒక మూర్తి, గర్భగుడి పైభాగంలో ఉండే విమానం లోపల మరోమూర్తి, దానిపై ఇంకో మూర్తి ఇలా ఒకదానిపై ఒకటిగా మూడు విగ్రహాలుండటం చాలా విశేషం. ఆ మూడు విగ్రహాలూ మూడు స్థితులలో ఉండటం మరో విశేషం. ఇన్ని విశేషాలకు కారణమైన ఆ ఆలయాన్ని అష్టాంగ విమానం అంటారు.



వైష్ణవ సంప్రదాయంలో మాత్రమే ప్రచారంలో ఉన్న ఈ అష్టాంగవిమాన ఆలయంలో శ్రీమహావిష్ణువు కింద గర్భగుడిలో స్థిత (నిల్చుని) రూపంలో ఉంటాడు. ఆపై విమానంలో శయన(పడుకుని) రూపంలో, ఆపైన ఆసీన (కూర్చుని) భంగిమలో దర్శనమిస్తాడు. నిలుచుని ఉన్న రూపం విభవ మూర్తికి ప్రతినిధి. పడుకుని ఉన్న రూపం వ్యూహతత్త్వానికి ప్రతీక. కూర్చుని ఉన్నరూపం పరతత్త్వానికి ఉదాహరణ. ఈ మూడు స్థితులు అర్చామూర్తులుగా దర్శనమివ్వడం చాలా విశేషమైనవి. జాగ్రత్స్వప్న సుషుప్తులనే అవస్థాత్రయాన్ని తెలుపుతూ ఇవి అదే స్థితిలో దర్శనమివ్వడం మనమిక్కడ చూడవచ్చు. భక్తులు ఈ మూడు స్థితులలోని ముగ్గురు దేవతలను దర్శించి ఒక్కో స్థితిని బట్టి తన జీవనగతిని మార్చుకుంటూ పరమపదం చేరుకోవడమనే గొప్ప సంప్రదాయాన్ని ఈ ఆలయం ద్వారా మానవాళికి తెలియజెప్పే ఏర్పాటు జరిగింది. తమిళనాడులోని కంచి వరదరాజస్వామి ఆలయం, మధురై కూడలళగర్ దేవాలయం, ఉత్తరమేరూర్ సుందర వరదస్వామి ఆలయం ఇలా ఓ ఐదారు ఆలయాలు అష్టాంగవిమాన ఆలయానికి ఉదాహరణగా కనపడుతున్నాయి. అయితే తెలుగునేలపై శంషాబాద్ చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలోని దివ్యసాకేత ఆలయం ఒక్కటే అష్టాంగ విమాన సంప్రదాయానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తుంది. మన సంప్రదాయంలో మూడు అనే సంఖ్యకు చాలా ప్రాముఖ్యత ఉంది. అందుకే మూర్తి త్రయం, ఆచార్య త్రయం ఇటువంటి కోవలో విగ్రహ త్రయం కలిగిన ఈ అష్టాంగవిమాన ఆలయం అష్టాక్షరీ మంత్రమంత గొప్పదిగా భావించబడుతోంది. భగవద్రామానుజులవారు బహిరంగంగా అష్టాక్షరీ మహామంత్రాన్ని అందరికీ ఉపదేశించింది ఈ అష్టాంగ విమానం పై నుండే అని చరిత్ర చెబుతోంది. సంపూర్ణ భగవత్తత్త్వాన్ని దర్శించాలనుకునే భక్తులు ఈ ఆలయాన్ని దర్శిస్తే చాలు.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఆదివారం
18-8-2019


# అందరికీ అందితేనే ఫలితం

గెస్ట్ కాలం

**'ప్రభుత్వాలు కొత్త విధానాలు రూపొందిస్తున్నాయి. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే, ఆ విధానాలు లక్షిత వర్గాలకు క్షేత్రస్థాయిలో సమర్థంగా అందేలా చర్యలు తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. అప్పుడే సమాజం ప్రగతి పథంలో నడుస్తుంది' అంటున్నారు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'బేర్‌ఫుట్ అకాడమీ ఆఫ్ గవర్నెన్స్' డైరెక్టర్ ప్రొఫెసర్ వి.సురేశ్. గత కొన్నేళ్లుగా విద్య, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం తదితర విభాగాలకు సంబంధించి ప్రభుత్వ పథకాలు, విధానాలు ఆయా వర్గాలకు చేరేలా కృషిచేస్తూ.. అంతర్జాతీయంగా ప్రశంసలు పొందుతున్న బేర్‌ఫుట్ అకాడమీ ఆఫ్ గవర్నెన్స్ డైరెక్టర్ వి.సురేశ్‌తో ఈ వారం గెస్ట్‌కాలం..**

- ప్రభుత్వ పథకాలు, విధానాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బేర్‌ఫుట్ అకాడమీ ఆఫ్ గవర్నెన్స్ డైరెక్టర్ వి.సురేశ్

### క్షేత్రస్థాయి అమలే ప్రధాన సమస్య

మన దేశం సామాజికంగా, భౌగోళికంగా విభిన్న సంస్కృతులు, పరిస్థితులకు నిలయం. ఇలాంటి పరిస్థితుల్లో ఏ పథకాన్నైనా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం, లక్షిత వర్గాలకు అందేలా చేయడం ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పల్లె ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ఉన్నప్పటికీ.. వాటి గురించి వారికి తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి తెలియజేసేందుకు ప్రభుత్వ శాఖల్లోని కిందిస్థాయి అధికారులు ఆశించిన రీతిలో వ్యవహరించడం లేదు. ఫలితంగా నేటికీ మన సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయి.

### చక్కటి ప్రణాళిక ఉంటే

ముందుచూపుతో వ్యవహరించి,చక్కటి ప్రణాళికను రూపొందించుకొని అమలు చేస్తే.. ఎలాంటి సమస్యనైనా సులువుగా అధిగమించొచ్చు. ఉదాహరణకు ఇటీవల చెన్నైలో కనిపిస్తున్న నీటి కొరత. ఈ సమస్యను ముందుగానే గుర్తించి.. ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తే.. పరిష్కారం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి విషయాల్లో మన దేశంలో పరిపాలనలో ప్రణాళిక లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా వైద్యం, పారిశుద్ధ్యం, గ్రామీణ ప్రాంతాలకు విద్యావకాశాలు వంటి విషయాల్లో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. వీటిని ఆయా వర్గాలకు అందేలా చేయడంలో సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకం. అందుకే మేము బేర్‌ఫుట్ అకాడమీ ఆఫ్ గవర్నెన్స్‌ను ప్రారంభించాం.


డైరెక్టర్ వి.సురేశ్

### నూతన విద్యా విధానం.. సిఫార్సులు

విద్యా రంగం విషయానికొస్తే నూతన విద్యా విధాన ముసాయిదాలో.. కమిటీ పలు కీలక సిఫార్సులు చేయడం.. వాటిపై వ్యతిరేకత రావడం తెలిసిందే. మన దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఈ సిఫార్సుల అమలుకు ముందుగా మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం చాలా అవసరం. సెకండరీ ఎడ్యుకేషన్ దశలో తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు.. తప్పనిసరిగా కొన్ని ఉమ్మడి సబ్జెక్ట్‌లను బోధించాలనే సిఫార్సు మంచిదే. అయితే సెమిస్టర్ విధానంపై పునరాలోచించాలి.

### అప్పుడే ఆర్‌టీఈ విజయం

విద్యా హక్కు చట్టాన్ని ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు అమలు చేయాలనే సిఫార్సు ఆహ్వానించదగిందే. అదే సమయంలో పేద వర్గాలకు జీవనోపాధి మార్గాలు కూడా చూపాలి. కనీస ఆదాయ హామీ కల్పించాలి. అప్పుడే విద్యా హక్కు చట్టం సమర్థవంతంగా అమలుచేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికీ మన దేశంలో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న ప్రజలకు పూట గడవని పరిస్థితి. అలాంటి కుటుంబాలు జీవనం కోసం తమ పిల్లలను పనికి పంపిస్తున్నాయి. అందుకే ఇప్పటి వరకు ఆర్‌టీఈ సరైన ఫలితాలు ఇవ్వలేదు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజన పథకం వంటి వాటితోనే అందరికీ విద్య అందుతుందనుకోవడం సరికాదు. పేద కుటుంబాలకు కనీస ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. అది కూడా దీర్ఘకాలిక విధానంలో ఉండాలి. ఉచిత రేషన్ వంటి సంక్షేమ పథకాలకంటే..సుస్థిరాదాయం కల్పించే దీర్ఘకాలిక విధానాలు అమలు చేయాలి.

### 'విద్య'లోనూ అదే పరిస్థితి

విద్యా రంగంలోనూ మౌలిక వసతుల కొరత ఉంది. చాలా వరకు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. కానీ, పలు గ్రామాల్లో అప్పర్ ప్రైమరీ, సీనియర్ సెకండరీ చదవాలంటే.. కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికో, డివిజన్ కేంద్రానికో వెళ్లాల్సి వస్తోంది. ఇది ఉన్నత విద్యలో ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదలకు అవరోధంగా మారుతోంది. కాబట్టి అన్ని గ్రామాల్లోనూ కనీసం సీనియర్ సెకండరీ వరకైనా పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

### అవగాహన పెంచాలి

ఆయా పథకాల అమలు పరంగా ప్రజల్లో అవగాహన పెంచడం ఎంతో ముఖ్యం. ఓపెన్ డెఫకేషన్ ఫ్రీ కార్యక్రమాన్నే పరిగణనలోకి తీసుకుంటే.. గత మూడు, నాలుగేళ్లుగా దీని గురించి ప్రచారం జరుగుతోంది. సరైన అవగాహన లేకపోవడం వల్లే ఇప్పటికీ ఓపెన్ డెఫకేషన్ సమస్య కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ముఖ్యంగా నిరక్షరాస్యుల్లో దీని గురించి అవగాహన కల్పించాల్సిన అవసరముంది. జరిమానాలు విధించడం లేదా ఇతర చర్యలు తీసుకోవడం వల్ల ఈ సమస్యకు పరిష్కారం లభించదు. అవగాహన కల్పించడంతోపాటు సదుపాయాలు కల్పించాలి.

### మౌలిక సదుపాయాల కొరత

ఏ పథకమైనా సమర్థంగా అమలవ్వాలంటే.. ఆ పథకం ఉద్దేశానికి అనుగుణంగా ముందుగా సంబంధిత విభాగాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి. ఉదాహరణకు ప్రజారోగ్యాన్నే పరిగణనలోకి తీసుకుంటే.. కిందిస్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, ఇతర సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రథమ చికిత్స చేసే సదుపాయాలు కూడా లేవు. ఇలాంటి విషయాలను తీవ్రంగా పరిగణించాలి.

### 'సామాజిక' దృక్పథం

విద్యార్థులకు సామాజిక దృక్పథం ఎంతో అవసరం. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడం, వాటికి పరిష్కార మార్గాల గురించి ఆలోచించడం వల్ల సామాజిక అభివృద్ధికి తోడ్పడినవారవుతారు. దీన్ని గుర్తించే ఇటీవల ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు తమ సమీప గ్రామాల్లో ఔట్‌రీచ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ పరిస్థితి అన్ని ఇన్‌స్టిట్యూట్‌లలోనూ కనిపిస్తే.. సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు సులువుగా పరిష్కారం లభిస్తుంది!!




- ఫొటోగ్రఫీని కెరీర్‌గా ఎంచుకుంటున్న యువత
- సృజనాత్మకత ఉంటే ఉపాధికి చక్కటి వేదిక

# అభిరుచే విజయ సూత్రం

**వర్తమాన విశేషాలను భవిష్యత్తుకు అందించే సాధనం.. కెమెరా. నడిచే చరిత్రను దృశ్యరూపంలో నిక్షిప్తం చేసే మాధ్యమం.. ఫొటోగ్రఫీ. జ్ఞాపకాల దొంతర్లను చిరస్థాయిగా నిలిపే ఛాయాచిత్రం.. జీవిత కాలానికి సరిపడా స్మృతులను మన లైబ్రరీలో చేరుస్తుంది. పండగలు, వేడుకలు, ఆనందాలు, విజయాలు, విషాదాలు, పరిణామక్రమం, దేశాల మధ్య ఒప్పందాలు, యుద్ధాలు, ప్రకృతి సోయగాలు, జంతుజాలం, పశుపక్ష్యాదులు.. ఇలా ఎన్నో అపురూపమైన, విశిష్ట సంఘటనలను యాదికి తెచ్చే కెమెరా పనితనం ఫొటోగ్రఫీ. వర్తమానానికి భవిష్యత్తులో 'సాక్షి'గా నిలుస్తున్న ఫొటోగ్రఫీ యువతకు చక్కటి ఉపాధి వేదికగా మారుతోంది. సంప్రదాయ వివాహాలు, ఈవెంట్ దశలు దాటి.. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌ల ట్రెండ్ కొనసాగుతున్న తరుణంలో అవకాశాలకు భరోసాగా నిలుస్తున్న "ఫొటోగ్రఫీ" కెరీర్‌పై ఫోకస్...**

సందర్భం ఏదైనా ఒక ఫొటో వెయ్యి పదాల కంటే బలమైన భావాన్ని వ్యక్తంచేస్తుంది. ఒకప్పుడు ఫొటోగ్రఫీ వివాహ వేడుకలు, ఈవెంట్స్‌కు మాత్రమే పరిమితమయ్యేది. కానీ, ఇప్పుడు పరిధి పెరిగింది. నేటి డిజిటల్ యుగంలో ఫొటోగ్రాఫర్లకు అవకాశాలకు కొదవలేదు. యువత హాబీగా ఫొటోగ్రఫీ నైపుణ్యాలు నేర్చుకొని.. ఆఫ్‌బీట్ కెరీర్‌గా మలచుకుంటోంది. ఈ-కామర్స్, ఫ్యాషన్, అడ్వర్‌టైజింగ్, మాస్ మీడియా, స్పోర్ట్స్, వైల్డ్‌లైఫ్, జర్నలిజం, ట్రావెల్, టూరిజం వంటి అనేక రంగాలో సృజనాత్మకత కలిగిన ఫొటోగ్రాఫర్లకు డిమాండ్ పెరుగుతోంది.

### విద్యార్హతలు-వేతనాలు

ఫొటోగ్రాఫర్లుగా రాణించేందుకు ప్రత్యేకమైన విద్యార్హతలు అవసరం లేదు. కానీ, సృజనాత్మకత ముఖ్యం. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతతో డిప్లొమా, షార్ట్‌టర్మ్ సర్టిఫికెట్ కోర్సులకు నమోదు చేసుకోవచ్చు. బ్యాచిలర్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఫొటోగ్రఫీ ఆప్షన్ సబ్జెక్టులుగా ఉన్నాయి. ఇవి పూర్తిచేస్తే పీజీ స్థాయి కోర్సుల్లోనూ చేరొచ్చు. ఫొటోగ్రఫీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవల కాలంలో ప్రైవేటు విద్యాసంస్థలు, ఇన్‌స్టిట్యూట్లు ఫొటోగ్రఫీ కోర్సులను అందిస్తున్నాయి. పదోతరగతి అర్హతతోనూ షార్ట్‌టర్మ్ కోర్సుల్లో చేరే వీలుంది.

### ఈ నైపుణ్యాలుంటే

ఫొటోగ్రాఫర్‌గా రాణించాలనుకునే వారికి స్వతహాగా సృజనాత్మకత, ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ల పరిజ్ఞానం అవసరం. దాంతోపాటు కెమెరా పనితీరులో ముఖ్యమైన లైటింగ్, షేప్స్ ప్యాటర్న్స్, కంటిచూపు, ఫొటోగ్రాఫిక్ దృష్టి లాంటి నైపుణ్యాలు ఉండాలి. ఫొటోలను అందంగా చూపడంలో కీలక పాత్ర పోషించే బ్యాక్‌గ్రౌండ్ కలర్స్, లైటింగ్, అపెర్చర్ వంటి అంశాల్లో చక్కని అవగాహన అవసరం. సాంకేతికంగా ఈ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

### అవకాశాలు

- ఫొటోగ్రఫీ కోర్సుచేసిన వారికి అవకాశాలకు కొదవలేదు. సృజనాత్మకత, నైపుణ్యాల ఆధారంగా వేగంగా వృత్తిలో ఎదిగే వీలుంది. ఫొటో జర్నలిస్ట్‌లకు వివిధ పత్రికలు, టీవీ ఛానెళ్లల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- ఎంచుకున్న స్పెషలైజేషన్స్‌ను బట్టి ఎలక్ట్రానిక్ మీడియా, సినిమా నిర్మాణ సంస్థలు, టీవీ ప్రొడక్షన్ హౌజెస్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు, కార్పొరేట్ సంస్థలు, సైంటిఫిక్ జర్నల్స్, ఫ్యాషన్ హౌస్‌లు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో అవకాశాలు అందుకోవచ్చు.
- ప్రధానంగా వన్యమృగాల(వైల్డ్‌లైఫ్) ఫొటోగ్రఫీకి ఎక్కువ ఆదరణ ఉంది. ప్రకృతి ఒడిలో జంతు, పక్షిజాలాన్ని అందంగా.. వివిధ కోణాల్లో ఎవరూ తీయని విధంగా ప్రత్యేకంగా 'క్లిక్'మనిపిస్తే ఎంతో గుర్తింపు లభిస్తుంది. అరుదైన పక్షులు, జంతువుల ఫొటోలు తీయగలిగితే ఎనలేని పేరు సంపాదించుకోవచ్చు. ఇందు కోసం కొండంత సహనం అవసరం.
- జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న పార్కులు, కీకారణ్యాలు, అభయారణ్యాల్లో అద్భుతమైన ఫొటోలు తీసి జర్నల్స్‌లో ప్రచురించటం, ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శించడం ద్వారా పేరుతోపాటు డబ్బు గడిస్తారు.
- సాహసోపేతమైన జీవితం గడపాలనుకునే వారికి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ సరిగ్గా నప్పుతుంది. వీరు నేషనల్ జియోగ్రాఫిక్ ఛానెల్, డిస్కవరీ ఛానెల్, యానిమల్ ప్లానెట్ వంటి అంతర్జాతీయ మీడియా హౌస్‌లలో సైతం పనిచేసే సౌలభ్యం ఉంటుంది.

### సొంతంగా రాణించవచ్చు

- ఫొటోగ్రాఫర్స్‌గా ఉద్యోగంలో కంటే సొంతంగా రాణించే వారి సంఖ్యే ఎక్కువ. వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లుగా మంచి పేరు సంపాదించుకుంటే.. సొంతంగా స్టూడియో నిర్వహించుకుంటూ ఆర్జించొచ్చు.
- ఇటీవల కాలంలో డిజిటల్ మీడియా వినియోగం బాగా పెరిగిపోవడంతో ప్రొడక్ట్ ఫొటోగ్రఫీకి డిమాండ్ కనిపిస్తోంది. దుస్తులు, షూస్, బ్యాగులు, కార్లు, వాహనాలు, అలంకరణ వస్తువులు.. తదితర ఈ-కామర్స్ వెబ్‌సైట్స్‌లో ఉత్పత్తుల ఫొటోలు తీయడానికి ప్రొడక్ట్ ఫొటోగ్రాఫర్ల అవసరం ఎక్కువగా ఏర్పడింది.
- ఫ్యాషన్ ఫొటోగ్రఫీలో భాగంగా మోడల్స్ సంఖ్యకు అనుగుణంగా ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్లకూ డిమాండ్ పెరుగుతోంది. వీరికి ఆకర్షణీయమైన వేతనాలు ఇస్తున్నారు. ఆదర్శ్ ఆనంద్, అకాశ్ దాస్, అమిత్ మెహ్రా, ఆనంద్ శరణ్ మొదలైన ఎంతో మంది ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్స్‌గా పేరొందారు.
- సోషల్ మీడియాలో సెలబ్రిటీల హడావుడి పెరుగుతున్న నేపథ్యంలో నిపుణులైన ఫొటోగ్రాఫర్ల అవసరం నెలకొంది. అలానే, ఫ్యాషన్ మ్యాగజైన్స్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్లను నియమించుకుంటున్నాయి.
- ముఖ్యంగా ఫ్రీలాన్సింగ్ ప్రముఖ కెరీర్ ఆప్షన్లల్లో ఒకటి. బిజినెస్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఉన్న వారు ఫ్రీలాన్సింగ్‌లో స్థిరపడొచ్చు. ప్రముఖ వెబ్‌సైట్లకు ఫొటోలు తీసి పంపించడం ద్వారా రాయల్టీ ఆదాయం పొందవచ్చు.

### వివిధ రకాల ఫొటోగ్రఫీలు

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ, ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ల్యాండ్‌స్కేప్ ఫొటోగ్రఫీ, ఏరియల్ ఫొటోగ్రఫీ, యాక్షన్/స్పోర్ట్స్ ఫొటోగ్రఫీ, ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీ, వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, మాక్రో ఫొటోగ్రఫీ, ఫ్యామిలీ ఫొటోగ్రఫీ, పెట్ ఫొటోగ్రఫీ, ఈవెంట్ ఫొటోగ్రఫీ, ఆస్ట్రో ఫొటోగ్రఫీ, ఫొటో జర్నలిజం, ప్రొడక్ట్ ఫొటోగ్రఫీ, స్టాక్ ఫొటోగ్రఫీ... వంటి విభిన్న రకాలు ఫొటోగ్రఫీ కెరీర్‌లు ఎంచుకోవచ్చు.

### వేతనం

ఫొటోగ్రాఫర్ల వేతనం వివిధ రంగాల్లో వేర్వేరుగా ఉంటుంది. ప్రారంభంలో రూ.2 లక్షలు నుంచి రూ.3.5 లక్షల వార్షిక వేతనం అందుకోవచ్చు. అనుభవం, నైపుణ్యంతో వేతనాల్లో పెంపు ఉంటుంది. సొంతంగా ఆర్జించే అవకాశముంది.



### ఫొటోగ్రఫీ కోర్సులు - అందిస్తున్న సంస్థలు

- జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ, హైదరాబాద్.
- సత్యజిత్‌రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ – కోల్‌కతా.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)–న్యూఢిల్లీ.
- సెయింట్ జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్–ముంబై.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ, ముంబై.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్.
- ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఫొటోగ్రఫీ.
- సర్ జేజే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్, ముంబై.
- జామియా మిలీయా ఇస్లామియా, సెంట్రల్ యూనివర్సిటీ, న్యూఢిల్లీ.
- ఫిలిం, టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, పుణె.
- సింబయాసిస్ స్కూల్ ఆఫ్ ఫొటోగ్రఫీ, పుణె.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ ఆర్ట్స్ అండ్ యానిమేషన్, కోల్‌కతా.

# 20 గంటల్లో నైపుణ్యాలు

## స్కిల్ డెవలప్‌మెంట్

– ఏఐసీటీఈతో కలిసి 'కెరీర్ స్కిల్స్'లో శిక్షణ ఇస్తున్న టీసీఎస్

**ఏటా ఇంజనీరింగ్ విద్యార్థులను పెద్ద సంఖ్యలో నియమించుకునే దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్).. తాజాగా డిజిటల్ లెర్నింగ్ కోర్సుకు శ్రీకారం చుట్టింది. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)తో కలిసి ఆన్‌లైన్‌లో ఉచితంగానే విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు అందిస్తోంది. తద్వారా కంపెనీలకు అవసరమైన కోర్ ఐటీ స్కిల్స్‌తోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి సాఫ్ట్‌స్కిల్స్ సైతం సొంతమవుతాయని టీసీఎస్ భావిస్తోంది. టీసీఎస్ కెరీర్ స్కిల్స్ వివరాలు...**

టీసీఎస్ గతేడాది నుంచి జాతీయ అర్హత పరీక్ష(నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్) పేరుతో ఫ్రెషర్స్‌ను నియమించుకునే ప్రక్రియ చేపట్టింది. గత సంవత్సరం జాతీయ అర్హత పరీక్షకు 2.8లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకుంటే.. 63వేల మంది అర్హత పరీక్ష దాటి తదుపరి దశలకు ఎంపికయ్యారు. వీరిలో 30వేల మంది ఉద్యోగాలు పొందారు. అకడెమిక్ అర్హతలు, సబ్జెక్టు పరిజ్ఞానం ఉన్నప్పటికీ.. చాలామంది విద్యార్థుల్లో కంపెనీలకు అవసరమైన 'కెరీర్ నైపుణ్యాలు' లేవని గుర్తించి... 'కెరీర్ స్కిల్స్' శిక్షణకు టీసీఎస్ శ్రీకారం చుట్టింది. అందుకోసం అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

### స్కిల్ గ్యాప్

విద్యార్థులు అకడమిక్‌గా బాగా రాణిస్తున్నారు. కానీ, కెరీర్ నైపుణ్యాల లేమితో ఉద్యోగావకాశాలు అందుకోలేకపోతున్నారు. వీరికి సాఫ్ట్‌స్కిల్స్‌పై శిక్షణ ఇస్తే ప్రతిభావంతులుగా తయారవుతారు. ఫలితంగా స్కిల్ గ్యాప్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

### ఎవరు అర్హులు

- ఏఐసీటీఈ అనుమతితో నడుస్తున్న కాలేజీలు ఈ డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌కు నమోదు చేసుకోవచ్చు. కోర్సులో చేరాలనుకునే ఫ్రెషర్స్, అండర్‌గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ కాలేజీల్లో సంప్రదించాలి.

### ఆన్‌లైన్ విధానంలో

టీసీఎస్ డిజిటల్ లెర్నింగ్ కోర్సు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. ఇది స్వల్పకాలిక కోర్సు. మొత్తం వివిధ మాడ్యూల్స్ కలిసి 20 గంటల వ్యవధిలో కోర్సు పూర్తిచేయొచ్చు. రోజుకు 4 గంటల చొప్పున వారంలో 5 రోజుల పాటు శిక్షణ తీసుకోవచ్చు.



### కోర్సు సిలబస్

- **కార్పొరేట్ ప్రవర్తన నియామవళి:** కార్పొరేట్ రంగంలో బిజినెస్ ప్రవర్తన నియమావళి ఎలా ఉంటుందో తెలిపే వీడియోలు ఉంటాయి.
- **ప్రభావవంతంగా ఈ-మెయిల్ రాయడం:** ఈ-మెయిల్స్ పంపేటప్పుడు సరైన సబ్జెక్ట్ లైన్, బాడీలైన్‌లో అర్థవంతంగా... పక్కా ప్రొఫెషనల్‌గా కంటెంట్ ఎలా ఉండాలో తెలిపే పాఠం ఈ మాడ్యుల్‌లో ఉంటుంది.
- **రెజ్యూమె, కవర్ లెటర్లు రాయడంలో మెలకువలు:** కంపెనీల హెచ్‌ఆర్‌లను ఆకట్టుకునేలా ప్రభావవంతంగా రెజ్యూమె, కవర్ లెటర్‌లు ఎలా సిద్ధం చేయాలో తెలిపే పాఠం.
- **ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెంపొందించడం:** వెర్బల్, నాన్ వెర్బల్ స్కిల్స్ పెంచడానికి ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుంది.
- **బృంద చర్చలకు సిద్ధమవడం:** అసలు బృంద చర్చలు ఎందుకు నిర్వహిస్తున్నారు, వీటిలో చురుగ్గా పాల్గొనడం ఎలా.. మొదలైన పాఠాలు ఈ మాడ్యూల్‌లో అందుబాటులో ఉన్నాయి.
- ప్రభావవంతంగా ప్రజెంటేషన్లను రూపొందించడాన్ని వివరించే మాడ్యూల్ అందుబాటులో ఉంది.
- కార్పొరేట్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే విధానం, విజయం సాధించే మార్గాలపై వీడియో ఉంటుంది.
- పనిలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు సాఫ్ట్‌స్కిల్స్ ప్రాధాన్యం.. కంపెనీల అవసరాలకు తగినట్లు సాఫ్ట్‌స్కిల్స్ పెంచుకోవడం ఎలానో చెప్పే వీడియో లెక్చర్.
- పనికి సంబంధించిన ఫోన్‌కాల్ వచ్చినప్పుడు స్పందించాల్సిన విధానం.
- టీసీఎస్ సంస్థ బిజినెస్ యూనిట్ హెడ్స్ కెరీర్ గైడెన్స్ ఇస్తారు.
- టీసీఎస్ టెక్నాలజీ నిపుణులు చెప్పే ఐటీ ఫండమెంటల్ స్కిల్స్ ఆధారంగా నైపుణ్యాలు పెంచుకోవడం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://learning.tcsionhub.in/courses/career-skills

### బృందంగా పనిచేసే నేర్పు

- విద్యార్థి దశ దాటి ఉద్యోగంలో అడుగుపెట్టే వారు వినియోగదారుల(క్లయింట్స్, కస్టమర్లు) కోసం పనిచేస్తారు. జట్టుగా కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా 10, 100, 1000 మంది సభ్యుల బృందాలు ఉంటాయి. వీరందరితో కలిసి పనిచేయాలి. బృందంగా పనిచేసే నేర్పు, ప్రభావవంతంగా భావ వ్యక్తీకరణ, ఇతరులతో సులువుగా కలిసిపోయి పనిచేయటం వంటి సాఫ్ట్‌స్కిల్స్ ఉద్యోగికి చాలా అవసరం. కాబట్టి సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కెరీర్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరిగింది. అందుకే విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐసీటీఈతో కలిసి డిజిటల్ కోర్సు ప్రవేశపెట్టాం. ఏఐసీటీఈ అనుమతి పొందిన ఏ కాలేజీ అయినా ఈ కోర్సుకు నమోదు చేసుకోవచ్చు. ఇది పూర్తిగా ఉచితం. దీన్ని విద్యార్థులు ఎక్కడి నుంచైనా, ఏ డివైజ్‌లో అయినా యాక్సెస్ చేసుకోవచ్చు. మొదట కాలేజీలు నమోదు చేసుకున్న తర్వాత.. ఆయా కాలేజీల విద్యార్థులకు యాక్సెస్ లభిస్తుంది. ఈ కోర్సులో ఈ-మెయిల్స్ రాయడం, భావవ్యక్తీకరణ చేయడం, కార్పొరేట్ సంస్కృతి-వ్యవహరించాల్సిన తీరుతెన్నులు మొదలైనవి నేర్పుతాం.

**– వి.రాజన్న, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్-టెక్నాలజీ బిజినెస్ యూనిట్, రీజినల్ హెడ్ – తెలంగాణ, ఏపీ-టీసీఎస్.**

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
18-8-2019



## జూనియర్ టెన్నిస్ చాంపియన్ శ్రీవల్లి రష్మిక

తెలంగాణ అమ్మాయి శ్రీవల్లి రష్మిక జాతీయ జూనియర్ క్లే కోర్ట్ టెన్నిస్ చాంపియన్‌గా నిలిచింది. చెన్నైలో శనివారం ఈ టోర్నీ ముగిసింది. ఫైనల్లో శ్రీవల్లి 7-6(7/3), 2-6, 6-1తో రేష్మా మరూరి (కర్ణాటక)పై విజయం సాధించింది. టైటిల్ కోసం ఇరువురు క్రీడాకారిణులు తీవ్రంగా శ్రమించారు. పోటాపోటీగా సాగిన మొదటిసెట్‌ను శ్రీవల్లి టై బ్రేక్‌లో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో పుంజుకున్న రేష్మా మరూరి 6-2తో సెట్‌ను కైవసం చేసుకుంది. విజేతను తేల్చే మూడో సెట్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన శ్రీవల్లి సెట్‌ను 6-1తో గెలిచి మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

# సాయి ప్రణీత్‌కు 'అర్జున'


సాయి ప్రణీత్


దీప


జడేజా


పూనమ్


అజయ్


బర్మన్

## పారాలింపియన్ దీపకు 'ఖేల్‌రత్న' • అర్జున జాబితాలో రవీంద్ర జడేజా

*గోపీచంద్ అకాడమీ ఆణిముత్యం, తెలుగుతేజం సాయిప్రణీత్‌కు భారత ప్రభుత్వం నుంచి ఘనమైన గుర్తింపు లభించనుంది. యేటికేడు తన రాకెట్ పదును పెంచుకుంటున్న ఈ బ్యాడ్మింటన్ స్టార్‌కు 'అర్జున' అవార్డు ఖాయమైంది. పారాలింపియన్ దీప మాలిక్ రెండో 'ఖేల్‌రత్న'గా ఎంపిక కాగా... బ్యాడ్మింటన్ గురువు విమల్ కుమార్ ద్రోణాచార్యుడయ్యాడు. క్రికెటర్లు రవీంద్ర జడేజా, పూనమ్ యాదవ్ అర్జునలుగా నిలిచారు. అయితే ఎప్పటిలాగే చిన్నపాటి అసంతృప్తుల సమేతంగానే ఈ సారి కూడా క్రీడా పురస్కారాల జాబితా వెలువడింది.*

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారానికి మరో తెలుగు షట్లర్ ఎంపికయ్యాడు. భమిడిపాటి సాయి ప్రణీత్ 'అర్జున' అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇంటాబయటా నిలకడగా రాణిస్తున్న ఈ బ్యాడ్మింటన్ స్టార్ ప్రతిభను అవార్డుల కమిటీ గుర్తించింది. 2017లో ప్రణీత్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. నిలకడైన ప్రదర్శనతో సింగపూర్ ఓపెన్, థాయ్‌లాండ్ ఓపెన్‌లలో టైటిల్స్ గెలిచాడు. సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచాడు. పారాలింపియన్ దీపా మాలిక్‌కు భారత అత్యున్నత క్రీడా పురస్కారం దక్కనుంది. రియో పారాలింపిక్స్‌లో రజతం నెగ్గిన ఆమెను 'రాజీవ్ ఖేల్‌రత్న'కు నామినేట్ చేశారు. ఇప్పటికే ప్రపంచ నంబర్‌వన్ రెజ్లర్ బజరంగ్ పూనియా ఆ అవార్డుకు ఎంపికవగా ఈ ఏడాది సంయుక్తంగా ఇద్దరికి ఆ పురస్కారం లభించనుంది. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, మహిళా క్రికెటర్ పూనమ్ యాదవ్‌లు అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. రిటైర్డ్ జస్టిస్ ముకుందకమ్ శర్మ నేతృత్వంలోని అవార్డుల కమిటీ 19 మందిని 'అర్జున'కు, ఇద్దరిని 'ఖేల్‌రత్న'కు ఎంపిక చేసింది. మరో ముగ్గురిని 'ద్రోణాచార్య'కు నామినేట్ చేసింది.

### దీపకు మూడో పురస్కారం

పారా అథ్లెట్ దీప 2012లో అర్జున అవార్డు అందుకుంది. రెండేళ్ల క్రితం 2017లో భారత పౌరపురస్కారం 'పద్మశ్రీ'ని దక్కించుకుంది. వరుసగా మూడు పారా ఆసియా గేమ్స్ (2010, 2014, 2018)లో పతకాలు గెలిచిన భారత మహిళా అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. జకార్తా (2018) ఈవెంట్‌లో ఆమె డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో కాంస్యాలు గెలిచింది. గడిచిన నాలుగేళ్ల ప్రదర్శన ఆధారంగా ఇచ్చే 'రాజీవ్ ఖేల్‌రత్న'కు ఆమె అర్హురాలని కమిటీ నిర్ణయించింది. పూనియాతో పాటు ఆమెను ఎంపిక చేసింది. మహిళా క్రికెటర్ పూనమ్ యాదవ్ ఐసీసీ ఈవెంట్లలో పరుగుల ప్రవాహం సృష్టించడంతో 'అర్జున'కు ఎంపికైంది. మహిళల భారత జట్టు 2017లో వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్, గతేడాది టి20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరడంలో ఆమె కీలక పాత్ర పోషించింది.

### విమల్‌కు ద్రోణాచార్య

సైనా నెహ్వాల్ మాజీ కోచ్ విమల్ కుమార్ 'ద్రోణాచార్య'కు నామినేట్ అయ్యారు. ఆయనతో పాటు సందీప్ గుప్తా (టేబుల్ టెన్నిస్), మొహిందర్ సింగ్ ధిల్లాన్ (అథ్లెటిక్స్) కోచ్‌లకు ఇచ్చే పురస్కారానికి ఎంపికయ్యారు. మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ కోచ్ సంజయ్ భరద్వాజ్, మెర్జ్‌బన్ పటేల్, రణ్‌బీర్‌సింగ్ ఖోఖర్ జీవిత సాఫల్య పురస్కారాలకు నామినేట్ అయ్యారు. కమిటీ నామినీల జాబితాను కేంద్ర క్రీడాశాఖ ఆమోదించిన వెంటనే అధికారికంగా విజేతలను ప్రకటిస్తారు. యేటా హాకీ దిగ్గజం, దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి (ఆగస్టు 23)ని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తారు. ఆ రోజు రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. ఖేల్‌రత్న విజేతకు పతకంతో రూ.7.5 లక్షలు, అర్జున, ద్రోణాచార్యలకు మెమెంటో, రూ. 5 లక్షలు బహుమతిగా అందజేస్తారు.

### మేరీ తప్పకుంది...

భారత చాంపియన్ బాక్సర్ మేరీకామ్ అవార్డుల కమిటీలో ప్రధాన సభ్యురాలు. కానీ ఆమె శనివారం 'ద్రోణాచార్య' ఎంపికలో పాలుపంచుకోలేదు. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఈ బాక్సర్ వ్యక్తిగత కోచ్ చోటేలాల్ యాదవ్ కూడా 'ద్రోణాచార్య' ప్రతిపాదిత జాబితాలో ఉన్నారు. దీంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు దూరంగా ఉండాలని భావించిన ఆమె ఎంపిక ప్రక్రియ నుంచి స్వయంగా తప్పుకుంది.

### అవార్డు నామినీల జాబితా

**రాజీవ్ ఖేల్‌రత్న:** బజరంగ్ పూనియా (రెజ్లింగ్), దీపామాలిక్ (పారా అథ్లెట్).

**అర్జున:** సాయిప్రణీత్ (బ్యాడ్మింటన్), రవీంద్ర జడేజా, పూనమ్ యాదవ్ (క్రికెట్), తేజిందర్‌పాల్ సింగ్, మొహమ్మద్ అనస్ యాహియా, స్వప్న బర్మన్ (అథ్లెటిక్స్), సోనియా లాతర్ (బాక్సింగ్), చింగ్లేశన సింగ్ (హాకీ), అజయ్ ఠాకూర్ (కబడ్డీ), గౌరవ్‌సింగ్ గిల్ (మోటార్ స్పోర్ట్స్), ప్రమోద్ భగత్ (పారా బ్యాడ్మింటన్), సుందర్‌సింగ్ గుర్జార్ (పారా అథ్లెట్), అంజుమ్ మౌద్గిల్ (షూటింగ్), హర్మీత్ దేశాయ్ (టేబుల్ టెన్నిస్), పూజ ధండ (రెజ్లింగ్), ఫౌవాద్ మిర్జా (ఈక్వెస్ట్రియన్), గుర్‌ప్రీత్‌సింగ్ సంధు (ఫుట్‌బాల్), సిమ్రన్‌సింగ్ షెర్గిల్ (పోలో).

## ఆర్‌డీటీకి పురస్కారం


ఫెర్రర్

క్రీడలను ప్రోత్సహించడంలో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) చేస్తున్న కృషిని భారత ప్రభుత్వం గుర్తించింది. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ సంస్థను అవార్డు కమిటీ 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్'కు ఎంపిక చేసింది. ఐదు దశాబ్దాల క్రితం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్'గా మొదలైన ఈ స్వచ్ఛంద సంస్థ మొదట్లో ప్రజల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం శ్రమించింది. కాలక్రమంలో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌గా మారాక గత 20 ఏళ్లుగా క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో 2002లో స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 32 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి పరచింది. సకల సౌకర్యాలతో క్రీడలకు, క్రీడాకారులకు ఎనలేని సేవలందజేస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు చెందిన నిరుపేద బాలబాలికల్లో ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తోంది.

"చాలా సంతోషంగా ఉంది. సరైన సమయంలో ఈ అవార్డుకు ఎంపికయ్యాను. రాబోయే టోర్నీల్లో మరింత పట్టుదలతో రాణించేందుకు ఈ అవార్డు ఊతమిస్తుంది"
– 'సాక్షి'తో సాయి ప్రణీత్

"మన దేశంలో తమవాళ్లకే అవార్డులు ఇచ్చుకుంటారు. అంటే కమిటీలో మనవారుంటే గుర్తిస్తారు. అంతే తప్ప ప్రదర్శనతోనూ, ప్రతిభతోనూ కాదు. ఇండియాలో ఇంతే. ఎవరేం చేయలేరు. మన పని మనం చేసుకోవాల్సిందే"
– ట్విట్టర్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ ఆవేదన

"ఆటగాళ్ల విజయంలో కోచ్‌ల పాత్ర ఎంతో ఉంటుంది. నేను ఆ కోచ్‌ల వల్లే ఎదిగాను. జస్పాల్‌రాణా షూటింగ్‌లో ఉత్తమ కోచ్. మను భాకర్, సౌరభ్ చౌదరి, అనీశ్ భన్‌వాలాలను ప్రపంచశ్రేణి షూటర్లుగా తీర్చిదిద్దారు. అలాంటి రాణాను విస్మరించడం సరికాదు. ఇలాంటి తప్పటడుగులు టోక్యో ఒలింపిక్స్‌లో ప్రభావం చూపిస్తాయి"
– ఒలింపిక్స్ స్వర్ణ విజేత అభినవ్ బింద్రా

# స్మిత్ అదరహో





- మాజీ కెప్టెన్ మరో గొప్ప ఇన్నింగ్స్
- మెడకు దెబ్బ తగిలినా ఆట కొనసాగింపు
- ఆస్ట్రేలియా 250 ఆలౌట్
- యాషెస్ రెండో టెస్టు

**లండన్:** అది ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 77వ ఓవర్. మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ 152 బంతుల్లో 80 పరుగులతో ఆడుతున్నాడు. క్రీజు మొత్తం నాదే అన్నట్లు కదులుతూ, మంచి బంతులను దీటుగా ఆడుతూ, వీలు చిక్కితే బౌండరీలు బాదుతూ ఇంగ్లండ్ బౌలర్లకు చిర్రెత్తిస్తున్నాడు. నిలకడగా 145 నుంచి 155 కి.మీ. వేగంతో వస్తున్న ఆర్చర్ బంతులను కాచుకుంటూ జట్టు స్కోరును 200 దాటించాడు. అప్పటికీ ఆర్చర్ వేసిన 71వ ఓవర్ చివరి బంతి బలంగా తగిలి స్మిత్ ఎడమ చేయి వాచిపోయింది. అయినా, మొండిగా ఆడిన అతడు 80ల్లోకి వచ్చాడు. సెంచరీ చేసేలా కనిపించాడు.అంతలోనే అనూహ్య ఘటన...! పేసర్ జోఫ్రా ఆర్చర్ వేసిన 77వ ఓవర్ రెండో బంతి నేరుగా స్మిత్ మెడకు తగిలింది. 149 కిలోమీటర్ల వేగంతో షార్ట్ లెంగ్త్‌లో వచ్చిన ఆ బంతిని తప్పించుకోలేక పోయిన అతడు కుప్పకూలాడు. వెల్లకిలా పడుకుని నొప్పితో విలవిల్లాడాడు. మైదానంలో ఒక్కసారిగా కలవరం. జట్టు డాక్టర్ పరుగు పరుగున వచ్చాడు. ఆర్చర్ మినహా ఇంగ్లండ్ ఆటగాళ్లు స్మిత్ చుట్టూ చేరిపోయారు. 2014 నాటి ఫిల్ హ్యూస్ ఉదంతం తలచుకుని అటు ఆస్ట్రేలియా టీంలోనూ కంగారు. కాస్త దిమ్మెరపోయినప్పటికీ స్మిత్ వెంటనే పైకి లేచాడు. డాక్టర్‌తో సంభాషించి రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. అయితే 9 ఓవర్ల అనంతరం వచ్చి వోక్స్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండరీలు బాదాడు. వోక్స్ మరుసటి ఓవర్లో ఓ ఫోర్ కొట్టి వికెట్ల ముందు దొరికిపోయాడు. ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో యాషెస్ రెండో టెస్టు నాలుగో రోజు శనివారం ఇరు జట్ల ఆట కంటే ఈ ఘటనే ఎక్కువగా వార్తల్లో నిలిచింది. మొత్తానికి సెంచరీ చేజారినా స్టీవ్ స్మిత్ (161 బంతుల్లో 92; 14 ఫోర్లు) మరో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆసీస్‌ను ఆదుకున్నాడు. అతడి పోరాటంతో తొలి ఇన్నింగ్స్‌లో జట్టు 250 పరుగులకు ఆలౌటై ఇంగ్లండ్ స్కోరు (258)కు దగ్గరగా వచ్చింది. 8 పరుగుల స్వల్ప ఆధిక్యంతో అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆతిథ్య జట్టును కమిన్స్ (2/16), సిడిల్ (2/19) దెబ్బకొట్టారు. కెప్టెన్ జో రూట్ (0)డకౌట్ అయ్యాడు. రోజు ముగిసేసరికి ఇంగ్లండ్ 96/4 తో నిలిచింది. ఆ జట్టు 104 పరుగుల ఆధిక్యంలో ఉంది.

### స్మిత్ వర్సెస్ ఆర్చర్

ఓవర్‌నైట్ స్కోరు 80/4తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్‌కు ఎప్పటిలాగే స్మిత్ ఆపద్బాంధవుడయ్యాడు. మాథ్యూ వేడ్ (6) తొందరగానే ఔటైనా, కెప్టెన్ టిమ్ పైన్ (70 బంతుల్లో 23; 2 ఫోర్లు); కమిన్స్ (80 బంతుల్లో 20; 3 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్ నడిపించాడు. ఈ క్రమంలోనే యాషెస్‌లో వరుసగా ఏడో అర్ధ శతకాన్ని (107 బంతుల్లో) సాధించాడు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ లంచ్ తర్వాత స్మిత్ వర్సెస్ ఆర్చర్‌గా సాగింది. ఆర్చర్ వేసిన 8 ఓవర్ల స్పెల్ భీకరంగా సాగింది. స్మిత్‌కు 73వ ఓవర్ చివరి బంతిని అతడు 155 కి.మీ. వేగంతో సంధించడం గమనార్హం.

## అత్యున్నతంగా నిలపడమే లక్ష్యం

- టీమిండియా ముమ్మందు అద్భుతాలు చేస్తుంది
- హెడ్ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలు



**కూలిడ్జ్ (అంటిగ్వా):** భారత పురుషుల జాతీయ జట్టు హెడ్ కోచ్‌గా నియామకం అనంతరం రవిశాస్త్రి తన భవిష్యత్ ప్రణాళికను వివరించాడు. కొత్త తరం వస్తున్నందున తాను వైదొలిగే లోపు జట్టు పునర్ నిర్మాణ ప్రక్రియ సాఫీగా సాగేలా చూడటం ప్రధానమైనదని పేర్కొన్నాడు. మరో నలుగురైదుగురు బౌలర్లను వెదికి పట్టుకోవడం ఇందులోని సవాల్‌గా అతడు తెలిపాడు. '26 నెలల నా పదవీ కాలం పూర్తయ్యేసరికి టీమిండియాను అత్యున్నత స్థానంలో నిలపడమే లక్ష్యం. తద్వార రాబోయే తరానికి వారు ఘన వారసత్వం అందిస్తారు. ఈ జట్టు ముమ్మందు అద్భుతాలు సృష్టించగలదన్న నమ్మకం నాకుంది. మేం ఇప్పుడు ఆ దిశగానే వెళ్తున్నాం. పురోగమనానికి అంతుండదు. యువ ఆటగాళ్లను చూస్తుంటే ఉత్సాహంగా ఉంది. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పుడు శ్రద్ధ కూడా అదేవిధంగా ఉండాలి. ఫలితాలు రాకపోయినా నిరుత్సాహం చెందొద్దు. గత రెండు-మూడేళ్లుగా టీమిండియా స్థిరంగా విజయాలు సాధిస్తోంది. ఇకపై వాటిని మరింత పెంచుకుంటూ పోవాలి' అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా జట్టు పురోగతిని విశ్లేషించిన అతడు ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఫీల్డింగ్‌లో సాధించిన ప్రగతిని నొక్కిచెప్పాడు. ఈ ప్రమాణాలను మరో మెట్టు ఎక్కించడమే తమ బృందం లక్ష్యమని వివరించాడు.

# రాణించిన పుజారా, రోహిత్

## టీమిండియా 219/4 • వెస్టిండీస్ 'ఎ'తో ప్రాక్టీస్ మ్యాచ్


పుజారా రోహిత్

**కూలిడ్జ్:** కరీబియన్ పర్యటనలో టెస్టు సిరీస్ ముంగిట టీమిండియా కీలక బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (156 బంతుల్లో 89 బ్యాటింగ్; 7 ఫోర్లు, సిక్స్)కు చక్కటి సన్నాహకం లభించింది. పుజారాతో పాటు మరో బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ (115 బంతుల్లో 68; 8 ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో రాణించడంతో వెస్టిండీస్ 'ఎ'తో శనివారం ఇక్కడ ప్రారంభమైన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత్ మెరుగైన స్కోరు దిశగా సాగుతోంది. టీ విరామ సమయానికి జట్టు 62 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్... ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (12) వికెట్‌ను త్వరగానే కోల్పోయింది. దూకుడు చూపిన మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (46 బంతుల్లో 36; 5 ఫోర్లు, సిక్స్) శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. కెప్టెన్ అజింక్య రహానే (1) తీవ్రంగా నిరాశపర్చాడు. 6 బంతులు మాత్రమే ఆడిన అతడు కార్టర్ (2/24) బౌలింగ్‌లో కీపర్ హామిల్టన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 53/3తో కష్టాల్లో పడిన ఈ స్థితిలో పుజారా, రోహిత్ ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. రోహిత్ సహజ శైలిలో ధాటిగా ఆడాడు. చాలాకాలం తర్వాత మైదానంలో దిగిన పుజారా తన ఫామ్‌ను చాటుకున్నాడు. అతడికి తోడుగా తెలుగు ఆటగాడు హనుమ విహారి (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

# శ్రీలంక గెలుపు దిశగా...

## విజయలక్ష్యం 268 • ప్రస్తుతం 133/0


తిరిమన్నె కరుణరత్నే

**గాలే:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంక విజయానికి దగ్గరైంది. 268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 133 పరుగులు చేసింది. ఓపెనర్లు కరుణరత్నే (71 బ్యాటింగ్; 2 ఫోర్లు), తిరిమన్నె (57 బ్యాటింగ్; 4 ఫోర్లు) శుభారంభాన్నిచ్చారు. పట్టుదలగా ఆడి అర్ధసెంచరీలు సాధించారు. అబేధ్యమైన తొలి వికెట్‌కు 133 పరుగులు జోడించారు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా చేతిలో 10 వికెట్లున్న శ్రీలంక లంచ్ విరామంలోపే లక్ష్యాన్ని అధిగమించే అవకాశాలున్నాయి. అంతకుముందు 196/7 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు శనివారం ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 106 ఓవర్లలో 285 పరుగుల వద్ద ఆలౌటైంది. క్రితంరోజు స్కోరుకు మరో 89 పరుగులు జతచేసి మిగిలిన 3 వికెట్లను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ వాట్లింగ్ (77; 6 ఫోర్లు), సోమర్‌విల్లే (40 నాటౌట్; 2 ఫోర్లు) ఎనిమిదో వికెట్‌కు 46 పరుగులు జోడించారు. లంక బౌలర్లలో ఎంబుల్డెనియా 4, ధనంజయ డిసిల్వా 3 వికెట్లు తీశారు.

## ఆటగాళ్లపై నా నియంత్రణ లేదు: గోపీచంద్

**ముంబై:** భారత షట్లర్ల టోర్నీ ప్రణాళికలు, ప్రాక్టీస్ వంటి అంశాలు తన అదుపులో ఉండటం లేదని చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'దురదృష్టవశాత్తు మన దేశంలో ఓ క్రమ పద్ధతి అంటూ ఉండదు. ఇక్కడ చీఫ్ కోచ్ పాత్ర పూర్తిగా అలంకారప్రాయమైంది. కోచ్‌గా నాకు ఏ హక్కులు లేవు. అసలు జాతీయ కోచ్ అనేది అర్థం లేని పదవిగా మారింది. సెలక్షన్స్‌లో కానీ, ప్రణాళికల్లో కానీ భాగస్వామ్యమే ఉండదు. సహాయ కోచ్‌ల్ని ఎంపిక చేసుకోలేం, వారి పారితోషికాల్ని నిర్ణయించలేం. ఇవేవీ లేని జాతీయ కోచ్, అతని బృందం ప్రపంచ స్థాయి ఆటగాళ్లను ఎలా తయారు చేస్తుంది చెప్పండి? బ్యాడ్మింటన్ క్రీడ వ్యక్తిగత ఆటే... కానీ శిక్షణ కూడా ఎవరికి వారు వ్యక్తిగతంగానే తీసుకోవాలని లేదు. చైనా, జపాన్, కొరియా, ఇండోనేసియా, మలేసియా, డెన్మార్క్ దేశాల్లో ఈ శిక్షణ ప్రక్రియ జట్టుగా... కలసికట్టుగా సాగుతుంది. కానీ ఇక్కడలా లేదు. ఇక టోర్నీల విషయానికొస్తే ఒక ప్లేయర్ ఏడాదికి ఎన్ని టోర్నీల్లో ఆడాలనే నియంత్రణ ఉండదు. ప్రతిభాన్వేషణకు సరైన ప్రణాళికలే లేవు. ప్రతిభ ఉంటే ప్రపంచశ్రేణి ఆటగాడిగా తీర్చిదిద్దే కార్యక్రమాలే ఉండవు. ఆటగాళ్లంతా సొంతంగా ఎదగాల్సిందే. ఇది సరికాదు. ఒక స్పష్టమైన విధివిధానమంటూ ఉండాలి. దీనికి ఓ జవాబుదారితనం కావాలి. ఎవరు దేనికి బాధ్యులో అందరికీ తెలిసుండాలి' అని కుండబద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాన్ని చెప్పారు.

# తమిళ్ తలైవాస్ ఓటమి

**చెన్నై:** సొంత ప్రేక్షకుల మధ్య ఆడిన తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ పరాభవాన్ని మూటగట్టుకుంది. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 21-32తో బెంగళూరు బుల్స్ చేతిలో ఓడింది. తలైవాస్ స్టార్ ఆటగాళ్లు రాహుల్ చౌదరి, మంజీత్ చిల్లర్, అజయ్ ఠాకూర్‌లు పూర్తిగా విఫలమయ్యారు. బెంగళూరు ఆటగాడు పవన్ షెరావత్ సూపర్ 'టెన్' (మొత్తం 11 పాయింట్లు)తో జట్టుకు విజయాన్ని అందించాడు. ఆద్యంతం హోరాహోరీగా సాగిన బెంగాల్ వారియర్స్, దబంగ్ ఢిల్లీల మ్యాచ్ చివరకు 30-30తో 'టై'గా ముగిసింది. దబంగ్ ఢిల్లీ ఆటగాడు ప్రవీన్ కుమార్ 11 పాయింట్లతో 'టాప్' స్కోరర్‌గా నిలిచాడు.

# థీమ్ 'క్లిక్' అయితే..

ఏ వృత్తిలో ఉన్నా ప్రవృత్తి రీత్యా, అభిరుచి రీత్యా ఫొటోగ్రఫీని ఇష్టపడేవారు ఎంతో మంది ఉంటారు. వారి ఛాయాచిత్ర జ్ఞానాన్ని, అభిరుచులను ఇతరులతో పంచుకోవడం ద్వారా సృజనాత్మకతకు పదును పెట్టుకోవచ్చు. నిజానికి ఫొటోగ్రఫీ డే ప్రాధాన్యం కూడా ఇదే. ఏటా ఒక్కో రకమైన థీమ్‌తో ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకోవడం విశేషం. 2017 ఆగస్టు 19న 'మేఘాలను అర్థం చేసుకోవడం (అండర్ స్టాండింగ్ క్లౌడ్స్)'అనే థీమ్‌తో జరుపుకొన్నారు. 2018లో 'బీ నైస్'అనే థీమ్‌తో నిర్వహించారు. ట్రావెల్, లైఫ్‌స్టైల్, హాలిడేస్, పర్యావరణం లాంటి ఇతివృత్తాలతో పాటు ప్రజలను సామాజికంగా చైతన్యపరిచేందుకు ఫొటోగ్రఫీ డేను ఇంగ్లండ్ సమర్థంగా ఉపయోగించుకుంటోంది. సమస్యలను ఛాయాచిత్రాల రూపంలో ఆహ్వానించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. మన జీవితంతో విడదీయలేనిది ఏదైనా ఉందంటే అది ఛాయాచిత్రమే. అదే ఫొటో ఒక్కొక్కప్పుడు యావత్ ప్రపంచ ప్రజానీకంలో సానుకూల మార్పును తీసుకొచ్చేది కూడా కావచ్చు.

**దక్షిణ సూడాన్‌లో 1993లో వచ్చిన తీవ్ర కరువుకు ప్రతి రూపం ఈ ఫొటో. దీన్ని కెవిన్ కార్టర్ అనే ఫొటోగ్రాఫర్ తీశాడు. అప్పట్లో ఈ ఫొటో పెద్ద సెన్సేషన్ అయింది. దీనికి పులిట్జర్ బహుమతి కూడా వచ్చింది. అయితే దురదృష్టవశాత్తు కొద్ది రోజులకే డిప్రెషన్ బారిన పడి కార్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు.**





# మైమరిపించేలా..

- బుద్ధవనంలోని మహాస్తూపం పైకప్పు ఆకాశం ప్రతిబింబించేలా ఏర్పాటు
- చుట్టూ గులాబీ రేకులతో ప్రత్యేకాకర్షణ

**సాక్షి, హైదరాబాద్:** ఆ ప్రాంతానికి వెళ్తే బుద్ధుడి జీవిత చక్రం కళ్లముందు కదలాడుతుంది.. ఆ మహనీయుని బోధనలు అడుగడుగునా మనసును ప్రేరేపించేలా వివిధ రూపాల్లో కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 8 ప్రధాన బౌద్ధ స్తూపాలు కళ్లముందు ప్రత్యక్షమవుతాయి. ఇప్పుడు ఆప్రాంతం దేశంలోనే ప్రధాన బౌద్ధపర్యాటక ప్రాంతం గా మారబోతోంది. అంతర్జాతీయ పర్యాటకులనూ ఆకట్టుకునే రీతిలో రూపుదిద్దుకుంటోంది. అదే నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం. 249 ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఈ నిర్మాణాలపరంపరలో కీలకమైన మహాస్తూపం ప్రత్యేక తరహాలో సిద్ధమవుతోంది. మరో వారం రోజుల్లో బుద్ధుడి 8 రూపాలతో కూడుకున్న రాతి విగ్రహాలు ప్రతిష్టించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నంద్యాలలో చెక్కిన శిల్పాలు ఇటీవలే బుద్ధవనం చేరుకున్నాయి.

**ఆకాశ గుమ్మటం...ఆకర్షణీయం..**

మహాస్తూపాన్ని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. 70 అడుగుల ఎత్తు, 140 అడుగుల వెడల్పుతో దీన్ని నిర్మించారు. పైన గుమ్మటం తరహాలో నిర్మాణం ఉంటుంది. అదే ప్రధాన మందిరం. లోపలి వైపు నిలబడి పైకి చూస్తే ఆకాశం కనిపిస్తుంది. పైకప్పునకు ఆకాశం ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. దాని చుట్టూ 16 వరసల్లో గులాబీ పూరేకుల తరహాలో తీర్చిదిద్దారు. ఈ ఏర్పాటు సిమెంటుతో కాకుండా అల్యూమినియం ఫ్యాబ్రికేషన్‌తో ఏర్పాటు చేయటం విశేషం. అందులోనే నాలుగు దిక్కులా ఒక్కోటి 9 అడుగుల ఎత్తులో ఉండే నాలుగు బుద్ధుడి భారీ రాతి విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ధర్మచక్ర ప్రవర్ధన ముద్రలో ఇవి ఉంటాయి. వీటి మధ్య ఒక్కోటి మూడు అడుగుల ఎత్తుతో మరో నాలుగు విగ్రహాలుంటాయి. అవి ధ్యాన ముద్ర, భూస్పర్శ ముద్ర, అభయ ముద్ర, వర్ణముద్రల్లో ఉంటాయి. ఈ విగ్రహాలను నంద్యాలలో ప్రత్యేక రాయితో చెక్కించారు. వీటి ప్రతిష్ట పూర్తయితే ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తయినట్టే. ప్రధాన ద్వారం వద్ద అష్టమంగళ చిహ్నాలు, బుద్ధుడి జాతక చిహ్నాలను రాతితో చేయించిన 104 ప్యానెల్స్‌పై చెక్కించి ఏర్పాటు చేయించారు. మధ్య 17 అడుగులతో ధర్మచక్ర స్థంభం ఆకట్టుకుంటోంది. బుద్ధవనంలో బుద్ధుడి జీవితంలోని ప్రధాన ఘట్టాలు ప్రతిబింబించేలా 10 కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయించారు. బుద్ధుడి జాతక కథలను తెలిపే 40 రాతి ఫలకాలు ఏర్పాటు చేశారు. శ్రీలంక ప్రభుత్వం ప్రత్యేకంగా 27 అడుగుల ఎత్తుతో ఔకాన బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయించింది. ఆ దేశంలో జరిపిన తవ్వకాల్లో వెలుగు చూసిన ఐదో శతాబ్దపు 40 అడుగుల ఎత్తు విగ్రహానికి ఇది నమూనాగా భాసిల్లుతోంది. మన దేశంలోని ప్రధాన 5 బౌద్ధ స్థూపాలు, వివిధ దేశాల్లోని ప్రధాన 8 స్థూపాల సూక్ష్మ నమూనాలతో మినియేచర్ పార్కు ఏర్పాటు చేశారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ బుద్ధవనాన్ని సిద్ధం చేస్తున్నామని ఆ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు.

# తుంగభద్రపై కర్ణాటక కొత్త ఎత్తులు!

- పూడికతో తగ్గిన నిల్వల మేరకు 31 టీఎంసీలతో కొత్త బ్యారేజీ
- తుంగభద్ర బోర్డు భేటీలో తెలంగాణ అభ్యంతరం
- ఆర్డీఎస్‌లో 15.90 టీఎంసీల వాటాకు 5 టీఎంసీలే దక్కుతోందని స్పష్టీకరణ
- నిర్ణీతవాటా వచ్చేలా చూస్తేనే బ్యారేజీకి సమ్మతిస్తామన్న తెలంగాణ

**సాక్షి, హైదరాబాద్:** తుంగభద్ర నదిపై మరో బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక ఎత్తులు వేస్తోంది. డ్యామ్‌లో పూడిక వల్ల జరుగుతున్న నష్టాన్ని పూడ్చేందుకు వీలుగా కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైంది. సుమారు 31 టీఎంసీల సామర్థ్యంతో తుంగభద్రకు ఎగువన నవాలి ప్రాంతంలో నిర్మించే కొత్త రిజర్వాయర్‌పై ఇప్పటికే కర్ణాటక తుంగభద్ర బోర్డు అనుమతి కోరింది. ఈ బ్యారేజీపై అభిప్రాయాలు చెప్పాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను బోర్డు కోరగా, ఆర్డీఎస్ ఎడమ కాల్వ కింద నీటి అవసరాలకు ఈ బ్యారేజీ నిర్మాణం ఆటంకం కలిగిస్తుందని తెలంగాణ స్పష్టం చేసింది.

**52 టీఎంసీల కోసం కర్ణాటక ప్రతిపాదన**

తుంగభద్ర డ్యామ్‌లో గతంలో ఉన్న నీటినిల్వ సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం గణనీయంగా నిల్వ తగ్గింది. 1953లో డ్యామ్ ప్రారంభం సమయంలో 132 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 100 టీఎంసీలకు పడిపోయింది. ఈ నష్టాన్ని పూడ్చేలా దాదాపు 31 టీఎంసీల సామర్థ్యంలో నవాలి వద్ద రిజర్వాయర్ నిర్మించాలని కర్ణాటక నిర్ణయించింది. తుంగభద్ర కింద ప్రస్తుతం 212 టీఎంసీల నీటిని వినియోగించేకునేలా గత ట్రిబ్యునళ్లు అనుమతించినా, ప్రస్తుతం పూడికతో 172 టీఎంసీల నీటినే వినియోగిస్తున్నామని, కొత్త రిజర్వాయర్‌తో ఆ నష్టాన్ని పూడ్చుకునే అవకాశం ఉంటుందని గత డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక తెలిపింది. భారీ వరద ఉన్నప్పుడు తుంగభద్ర నది నుంచి వరద కాల్వ తవ్వి, రోజుకు 17,900 క్యూసెక్కుల నీటిని కొత్త రిజర్వాయర్‌కు తరలిస్తామని, దీనికి అనుబంధంగానే శివపుర, విఠలపుర చెరువుల సామర్థ్యాన్ని పెంచుతామని, ఈ 3 రిజర్వాయర్ల కింద మొత్తంగా 52 టీఎంసీల నీటిని వినియోగిస్తామని ప్రతిపాదించింది.

**దిగువకు నష్టమే...**

నిర్మాణం చేపట్టబోయే రిజర్వాయర్ డీపీఆర్‌లు సమర్పిస్తే వాటిని పరిశీలించి అభిప్రాయాలు చెబుతామని తెలుగు రాష్ట్రాలు బోర్డుకు తెలిపాయి. అయినా ఇంతవరకు కర్ణాటక డీపీఆర్‌లు ఇవ్వలేదు. శనివారం బెంగళూరులో జరిగిన సమావేశంలో తెలంగాణ తరపున హాజరైన ఈఎన్సీ మురళీధర్ సమర్థంగా రాష్ట్ర వాదనలను వినిపించినట్లు తెలిసింది. డీపీఆర్‌లు ఇవ్వకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. దీంతోపాటే ఎగువన తుంగ, భద్ర నదులో కర్ణాటక చేస్తున్న నీటి వినియోగం, మరిన్ని ఎత్తిపోతల ద్వారా తీసుకుంటున్న నీటిలెక్కలను తమ ముందుంచాలని స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఎడమ కాల్వ కింద తెలంగాణకు 15.9 టీఎంసీల మేర కేటాయింపులున్నా, 5 టీఎంసీలకు మించి నీరు రావట్లేదని, ప్రస్తుతం మరో బ్యారేజీ నిర్మిస్తే తమ వాటాలకు నష్టం ఏర్పడుతుందని వాదించినట్లు సమాచారం. దీంతోపాటే గతంలో ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులకు విఘాతం కలుగుతుందని బోర్డు దృష్టికి తెచ్చారు. తుంగభద్ర సహా కొత్త బ్యారేజీ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిర్ణీత వాటాలు వచ్చేలా చూస్తామని కచ్చితమైన హామీ ఇస్తేనే బ్యారేజీ నిర్మాణానికి అనుమతిస్తామని, లేదంటే అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీంతోపాటు బోర్డు, కేంద్ర జల సంఘం అనుమతి సైతం కచ్చింతగా తీసుకోవాలని సూచించారు. ఏపీ సైతం డీపీఆర్‌లు ఇచ్చాకే దీని నిర్మాణంపై అభిప్రాయం చెబుతామని, ఇప్పటికిప్పుడు దీన్ని ఒప్పుకోమని స్పష్టం చేసినట్లుగా తెలిసింది.

# దొరికిపోతామనే భయం చాలు..
# నేరాలు తగ్గడానికి!

- శిక్ష తప్పదని అర్థమైతే తప్పు చేయడానికి భయపడతారు
- మరణశిక్షలతో నేరాలు తగ్గటం సాధ్యం కాదు
- ఫిక్కీ ముఖాముఖిలో డీజీపీ మహేందర్‌రెడ్డి



శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో స్వాతి లక్రా, సోనా చత్వానీ

**సాక్షి, హైదరాబాద్:** రక్షణ, స్త్రీల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, సాక్ష్యాలతో కూడిన పోలీసింగ్, ప్రామాణిక సేవలను రాష్ట్రమంతా ఒకేలా అందించడం.. పోలీసుల లక్ష్యమని, రానున్న ఐదేళ్లపాటు ఈ లక్ష్యాల పూర్తిస్థాయి సాధనకు కృషి చేస్తున్నామని డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. పార్క్ హయత్‌లో శనివారం ఫిక్కీ మహిళా సంస్థ ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. ఉమెన్ సేఫ్టీ విభాగం ఐజీ స్వాతి లక్రా, ఫిక్కీ చైర్‌పర్సన్ సోనా చత్వాని సహా వంద మంది మహిళలు పాల్గొన్నారు.

**భయపడితే చాలు..**

'ఉరిశిక్షలు వేస్తే నేరాలు తగ్గవు. కానీ నేరానికి కచ్చితంగా శిక్ష పడుతుంది.. తప్పించుకోలేం అనే భయం నేరస్తుల్లో గుబులు పుట్టిస్తుంది. 24 నుంచి 48 గంటల్లోపే చాలా కేసులను ఛేదించాం. వరంగల్‌లో 9 నెలల పాప అత్యాచారం కేసుతో పాటు అనేక సంచలన కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చేయడంలో విజయం సాధించాం. అత్యవసర సేవల నిర్వహణలో భాగంగా సమాచారం అందితే నగరంలో 5 నిమిషాల్లో, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 10 నిమిషాల్లో, గ్రామాల్లో 15 నిమిషాల్లో స్పందించగలుగుతున్నాం' అని మహేందర్‌రెడ్డి చెప్పారు

**ప్రతి పౌరుడూ పోలీసే...**

'70 ఏళ్లలో సాధ్యం కానిది.. ఈ ఐదేళ్లలో సాధించాం. పోలీసు విభాగానికి 11,500 వాహనాలు కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం మనదే కావచ్చు. రెండు శాతం జనాభా మాత్రమే పోలీసు సేవలను వినియోగిస్తోంది. మిగిలిన 98 శాతం మంది కూడా పన్ను కడుతున్నవారే. వాళ్లు మా దగ్గరికి రారు. అందుకే మేమే వాళ్ల దగ్గరికి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. చిన్న చిన్న సమావేశాల ద్వారా ప్రజలకు దగ్గరయ్యే కార్యక్రమాలను చేపడుతున్నాం. ప్రతి పౌరుడూ పోలీసే.. ప్రతి పోలీసూ పౌరుడే. ప్రజలతో కలసి పనిచేయకపోతే, వాళ్లకు ఉపయోగపడకపోతే మా సేవలకు అర్థం ఉండదు.'అని బదులిచ్చారు.

**బలప్రయోగం చివరియత్నం..**

'నేరం జరిగిన తర్వాత కంటే ముందు దాన్ని నిలువరించడమే పోలీసుల సమర్థత. బలప్రయోగం అనేది ఏ ప్రయత్నాలు ఫలించనప్పుడు చివరగా చేసేది. సంతకాల వెరిఫికేషన్ ప్రక్రియలో ఇబ్బందులతో ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్ ప్రక్రియ సాధ్యం కావటం లేదు. అయితే మన దగ్గర ఫిర్యాదు ఆన్‌లైన్ ద్వారా తీసుకుని సంతకాలు మాత్రం స్వయంగా వెళ్లి ఇచ్చినప్పుడు కేసు రిజిస్టర్ చేసుకుంటారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను రెగ్యులరైజ్ చేస్తాన్నాం. నగరంలో 4వేల సెక్యూరిటీ ఏజెన్సీలు ఉండగా, అందులో 200 ఏజెన్సీలకే పీఏఎస్ఏఆర్ఏ లైసెన్స్ ఉన్నాయి.




## 23న హైదరాబాద్‌లో పెన్షన్ అదాలత్

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 23న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ కేఎస్ ఆర్‌సీ మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల పెన్షనర్లు ఈ కార్యక్రమంలో తమ సమస్యలు, ఫిర్యాదులను అందజేయవచ్చునన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

## 19 మున్సిపాలిటీల కమిషనర్ల బదిలీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా 19 పురపాలికల కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ మేరకు స్థానచలనం చేస్తూ ఆ శాఖ కార్యదర్శి అర్విందకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వార్డుల విభజన, ఓటర్ల జాబితాల తయారీలో నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణల నేపథ్యంలోనే ఈ బదిలీలు చేసినట్లు మున్సిపల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## బీజేపీలోకి బండ కార్తీక!

**సికింద్రాబాద్:** ఏఐసీసీ సభ్యురాలు, నగర మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. శనివారం సాయంత్రం తార్నాకలోని బండ కార్తీక రెడ్డి నివాసానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి వచ్చి గంటసేపు భేటీ కావడం చర్చనీయాంశమైంది. బండ కార్తీకతో పాటు టీపీసీసీ కార్యదర్శి బండ చంద్రారెడ్డి కూడా బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్టు తెలిసింది.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com